ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలు కొత్త చరిత్రను సృష్టించాయి. బెంగాల్‌లో అత్యధిక పోలింగ్ శాతంతో పాటు అనూహ్యంగా బిజెపి అఖండ విజయం సాధించి చరిత్రను మార్చగా, కేరళలో హ్యాట్రిక్ సాధించాలనుకొన్న పినరయ్ విజయన్ నాయకత్వంలోని ఎల్డీఎఫ్‌ను మట్టి కరిపించి యుడిఎఫ్ అధికారంలోకి వచ్చింది. తమిళనాట విజయ్ నాయకత్వంలో టివికె అధిక సీట్లు సాధించి మరో చరిత్ర సృష్టించింది. బెంగాల్ సిఎం మమతా బెనర్జీ, తమిళనాడు సిఎం స్టాలిన్ ఓడిపోవడం మరో విశేషం.


తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

WWW.VAARTHA.COM కరీంనగర్

Published from Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

epaper.vaartha.com : fb.com/vaartha Digital

5-5-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 94 పేజీలు: 8+16 వెల: 6.50




## ఇద్దరు సిఎంలు ఘోర పరాజయం

భవానీపూర్‌లో మమత

కొళత్తూరులో స్టాలిన్ ఓటమి 2



| పశ్చిమబెంగాల్ | 293 | తమిళనాడు | 234 | అస్సాం | 126 |
|---|---|---|---|---|---|
| బిజెపి | 206 | డిఎంకె | 59 | ఎన్‌డిఎ | 102 |
| టిఎంసి | 77 | టివికె | 107 | యుపిఎ | 21 |
| కాంగ్రెస్ | 2 | ఎఐడిఎంకె | 46 | ఎఐయుడిఎఫ్ | 2 |
| ఇతరులు | 4 | ఇతరులు | 9 | ఇతరులు | 1 |



సోమవారం ఫలితాల అనంతరం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విజయోత్సవాల్లో అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

# బెంగాల్‌లో విరిసిన కమలం

## ఐదింట మూడు రాష్ట్రాల్లో బిజెపికే పగ్గాలు

### కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో మళ్లీ ఎన్నార్సీబిజెపి

### కేరళంలో ఎల్డీఎఫ్‌కు బ్రేక్.. యుడిఎఫ్‌కు మద్దతు

### అసోంలో హ్యాట్రిక్ సాధించిన బిజెపి

**న్యూఢిల్లీ, మే 4:** దేశంలోని ఐదురాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకోవడంతోపాటు రెండు రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వం ఏర్పాటుచేయడం, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్ఆర్‌సితో కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేయడం జరుగుతోంది. గత ఎన్నికల తరహాలోనే బిజెపి వ్యూహాత్మకంగా బెంగాల్‌లో పావులు కదపడంతో ప్రస్తుత సీఎం మమతా బెనర్జీని సైతం మట్టికరిపించింది. మొత్తం 294 స్థానాల్లో 200కుపైగా స్థానాలు గెలుచుకుని బిజెపి ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. 15 ఏళ్లపాటు అప్రతి హతంగా పాలించిన మమతా బెనర్జీ ప్రాభవానికి ఇపుడు బెంగాల్‌లో తెరపడింది. >>2

# తమిళనాట విజయ్ విహారం

### 107 స్థానాలతో అతిపెద్ద పార్టీగా టివికె

### సర్కార్ ఏర్పాటుకు సిద్ధం



**చెన్నై, మే 4:** పార్టీప్రారంభించిన రెండేళ్లలోపే అప్రతిహత విజయాన్ని సాధించి టివికె విజయ్ తమిళనాడులోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రజల దృష్టిని ఆకర్షించారు. తన చిట్టచివరి సినిమా జననాయగన్ విడుదలకానీయకుండాజరిగిన ప్రయత్నాలు, ప్రచారంలో అడుగడుగునా ఆటంకాలు సృష్టించడం, సిబిఐ విచారణలు, హైకోర్టు, సుప్రీంకోర్టులవరకూ వెళ్లినప్పటికీ మొక్కవోని దీక్షతో >>2

## అసోం, పుదుచ్చేరిలో అవే 'డబుల్ ఇంజిన్'లు 2

హ్యాట్రిక్ సాధించిన అసోం సిఎం హిమంత బిశ్వ శర్మ



## 'చేతి'లోకి కేరళం

ఒక్క కాంగ్రెస్‌కే 63 సీట్లు



# 'కమర్షియల్' బాదుడు!

### ఇడ్లీ రూ.75, దోశ రూ.80, ఫుల్ మీల్స్ రూ.200

### హోటల్ మెనూలో మంట!

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** తెలంగాణలో ఇడ్లీ రూ.75, దోశ రూ.80 ఇక ఫుల్ మీల్స్ రూ.200కు పైగా ధరలు పలుకుతున్నాయి. కమర్షియల్ సిలెండర్ బాదుడు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. హోటల్స్‌లో ఏం తిందామన్నా గొంతులో మంట పుడుతోంది. ఈ ధరల పెరుగుదలపై కస్టమర్లు లబోదిబోమంటున్నారు. ఇంత రేట్లు పెట్టి మేం టిఫిన్స్, భోజనాలు హోటళ్లలో తినలేం అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కుటుంబంతో కలిసి బయటకు వెళ్లి టిఫిన్ చేయాలన్నా రూ.వెయ్యి సరిపోని పరిస్థితి ఉంది. చాలా మంది బ్యాచిలర్స్, విద్యార్థులు మెస్ ధరలు పెరగడంతో ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నారు. అంతే కాకుండా కొన్ని హాస్టల్స్ వచ్చే నెల నుంచి రెంట్స్ కూడా పెంచేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం భారీగా పెరిగిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు. గత కొద్ది రోజులుగా గ్యాస్ ధరలు విపరీతంగా పెరగ డంతో హోటళ్లు, టిఫిన్‌సెంటర్లు నిర్వహించడం >>2

## విద్యుత్ కొనుగోలు అక్రమాలపై

# సిబిఐ విచారణకు గ్రీన్ సిగ్నల్



సోమవారం హైదరాబాద్‌లో కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్

### జస్టిస్ మదన్ బి.లోకూర్ కమిషన్ 114 పేజీల నివేదిక సిబిఐకి అప్పగింత

### 26వ తేదీలోగా భూముల ధరలు, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపునకు ఆదేశం

### అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు

### నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘం నేషనల్ డెవలప్‌మెంట్ బోర్డుకు అప్పగింత

### అజీజ్‌నగర్‌లో ఆధునిక కూరగాయల మార్కెట్ కోసం 42 ఎకరాలు కేటాయింపు

### కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే4:** విద్యుత్ కొనుగోలు, భద్రాద్రి,యాదాద్రి థర్మల్ ప్రాజెక్టులలో జరిగిన అక్రమాలపై విచారణకు సంబంధించిన కమిషన్ నివేదికను కేంద్ర దర్యాప్తు సంస్థ(సిబిఐ)కు అప్పగించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సోమవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను మంత్రులు పొన్నం ప్రభాకర్,వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌లతో కలిసి రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వివరించారు. విద్యుత్ కొనుగోళ్లతో పాటు భద్రాద్రి, యాదాద్రి విద్యుత్తు ప్లాంట్లలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై ప్రభుత్వం విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 2024 మార్చి 14వ తేదీన కమిషన్స్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం ప్రకారం రిటైర్డ్ జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసింది. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు 2024 జులైలో ఆయన విచారణ నుంచి తప్పుకోవటంతో జస్టిస్ మదన్ బి. లోకూర్‌ను కమిషన్‌గా నియమించారు. 2024 అక్టోబర్లో కమిషన్ మొత్తం 114పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అనంతరం 2025 జనవరి 4వతేదీన జరిగిన కేబినేట్ సమావేశంలో ఈ నివేదికపై తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై అడ్వకేట్ జనరల్ అభిప్రాయం తీసుకోవాలని నిర్ణయించింది. నివేదికను పరిశీలించిన అడ్వకేట్ జనరల్ తన సూచనలు, అభిప్రాయాలను తెలియజేశారు. వాటన్నింటినీ సోమవారం కేబినేట్ చర్చించిందని,. ప్రధానంగా అంతర్రాష్ట్ర అంశాలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఈ కేసులో ఉన్నాయి. అందుకే నిష్పాక్షిక దర్యాప్తు జరిపేందుకు సీబీఐ విచారణ అప్పగించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని,. ఇందుకు సంబంధించిన తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మార్కెట్ విలువల రేషనలైజేషన్ చేయడానికి రిజిస్ట్రేషన్ శాఖకు అనుమతి ఇచ్చినట్లు >>2



### బెంగాల్‌లో మార్పు

## దేశమంతా కోరింది

### ఐదు రాష్ట్రాల ప్రజలు ప్రధాని మోడీని ఆశీర్వదించారు

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 4 ప్రభాతవార్త:** దేశ ప్రజలంతా పశ్చిమ బెంగాల్‌లో మార్పు కావాలని కోరుకున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 15 ఏళ్లుగా టిఎంసి ప్రభుత్వం బెంగాల్‌ను అస్తవ్యస్థం చేసిందన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని జంగల్ రాజ్‌గా మార్చిందన్నారు. బంగ్లాదేశ్ నుంచి లక్షలాదిగా వలస వచ్చిన ఇల్లీగల్ మైగ్రెంట్స్ బెంగాల్ ప్రజలపై దాడులు చేశారన్నారు. తృణమూల్ అండతో బెంగాలీలపై వారు చేయని దౌర్జన్యం లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో బెంగాల్‌లో బిజెపి ప్రభుత్వం రావడం చాలా గొప్ప మార్పునకు నాంది అన్నారు. బెంగాల్‌లో కోల్ మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో టిఎంసి ఎమ్మెల్యేలు, మంత్రులు ఇల్లీగల్ మైనింగ్ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారు. వేలాది కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. బెంగాల్‌లోని బొగ్గు గనుల్లో టిఎంసి >>2

## వేగంగా ధాన్యం

# కొనుగోళ్లు

### అకాల వర్షాలతో రైతాంగం నష్టపోకుండా చర్యలు

### ఇప్పటి దాకా 14.80 లక్షల మె.ట ధాన్యం సేకరణ

### రైతుల ఖాతాల్లో రూ.2001.96 కోట్లు జమ: మంత్రి ఉత్తమ్



ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్. చిత్రంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** అకాల వర్షాలు సంభవిస్తున్నందున ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. ఈ మేరకు సోమవారం సచివాలయం నుండి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరితో కలిసి జిల్లాల ఇంచార్జ్ మంత్రులు, కలెక్టర్లు ఇతర ఉన్నతాధికారులతో అత్యవసరంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రబీ సీజన్‌లో పెరిగిన ధాన్యం ఉత్పత్తికి అనుగుణంగా కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఇప్పటి >>2

# కార్యాలయాలు మీకు.. కల్లాలు మాకా?

### అశ్వాపురం మండలంలో వ్యవసాయ అధికారిని చుట్టుముట్టిన రైతులు

### భానుడి భగ భగల మధ్య గంటకు పైగా కొనసాగిన రాస్తారోకో.

### కిలోమీటర్ల మేర బారులు తీరిన వాహనాలు.

### ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న 7 గ్రామ పంచాయతీల సర్పంచులు



అశ్వాపురం మండలం మొండికుంట గ్రామంలో ఆందోళన చేస్తున్న దృశ్యం

**అశ్వాపురం, ప్రభాతవార్త మే 4:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని మొండికుంట గ్రామంలో ధాన్యం కొనుగోలు విషయంలో సోమవారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఆందోళన కార్యక్రమం ఉద్రిక్తత ల మధ్య సాగింది. ఈ ఆందోళనకు అధిక సంఖ్యలో రైతులు, సిపిఎం పార్టీ నాయకులు మద్దతునిచ్చి ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ నిరక్ష్య వైఖరికి నిరసనగా భారీ రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. మణుగూరు నుండి కొత్తగూడెం వెళ్ళు ప్రధాన రహదారిపై ధాన్యం బస్తాలతో భీష్మించుకు కూర్చున్నారు. భానుడి భగ భగ మధ్య ఎర్రటి ఎండలో గంటకు పైగా రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, తెలంగాణా రైతుసంఘం నాయకులు బద్దంశంబిరెడ్డి మాట్లాడుతూ >>2



సోమవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన వేం టెక్నాలజీస్ డిఫెన్స్ ఇండస్ట్రీ సిఎండి

## సిఎం రేవంత్‌తో భేటీ అయిన వేం టెక్నాలజీస్ డిఫెన్స్ ఇండస్ట్రీ సిఎండి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే4:** వెమ్ టెక్నాలజీస్ డిఫెన్స్ ఇండస్ట్రీ సిఎండి వెంకట్‌రాజు సోమవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జహీరాబాద్ నిమ్జ్‌లో కొత్త యూనిట్ ఏర్పాటుకుకు సహకరించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపినట్లు వెంకట్ రాజు పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు

>> వరకు 14.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యానికిగాను ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ. 2001.96 కోట్లు జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో భారీ ఎత్తున ధాన్యం తరలి రానున్నందున కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నల్లగొండ, నిజామాబాద్ జిల్లాలో ఇబ్బడి ముబ్బడిగా ధాన్యం వస్తున్నందున అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అకాల వర్షాలతో సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్ వంటి జిల్లాలో 299 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోయినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. తడిసిన బియ్యాన్ని తక్షణమే బియ్యం మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాబోయే రోజుల్లో అకాల వర్షాలు కురిసే అవకాశమున్నందున సిఎం రేవంత్‌రెడ్డి సూచనలను సిరియస్‌గా తీసుకుని రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల ప్రభావం రైతుల మీద పడకుండా వాతావరణ పరిస్థితులకనుగుణంగా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లను వినియోగించేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తోపాటు పౌర సరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి, కార్మిక, ఉపాధి, విపత్తు నిర్వహణాశాఖ కార్యదర్శి హరిచందన తదితరులు పాల్గొన్నారు.

## 'కమర్షియల్' బాదుడు!

>> యజమానులకు కత్తిమీద సాములా మారింది. హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర ధర ఇప్పటి వరకు రూ.2,321 ఉండగా, పెరిగిన ధరల తర్వాత రూ.3,300కు పైగా చేరింది. బ్లాక్‌లో అయితే రూ.5,500 నుండి 6 వేల వరకూ కొందరు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు, ముడి సరుకుల ధరలు, లేబర్ ఖర్చులకు తోడు గ్యాస్ భారం తోడవడంతో, ఆ భారాన్ని హోటల్ యాజమాన్యాలు కస్టమర్ల మీదకు మళ్లించాయి. ఫలితంగా మధ్యతరగతి ప్రజలు బయట తినాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.

దీంతో తెలంగాణలోని హైదరాబాద్ తదితర ప్రధాన నగరాల్లోని హోటళ్లలో ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. ఒకప్పుడు రూ.30 నుంచి రూ.40 మధ్యలో లభించే ఇడ్లీ ప్లేట్ ఇప్పుడు ఏకంగా రూ.75 నుండి ఆ పైకి చేరింది. ఇక దోశ విషయానికి వస్తే నెయ్యి లేదా మసాలా దోశ ధరలు రూ.80 నుంచి రూ.100 దాటుతూ గొంతు దిగే పరిస్థితి కనిపించడం లేదు. ఇదే సమయంలో సాధారణ మధ్యతరగతి హోటళ్లలో కూడా ఫుల్ మీల్స్ ధర రూ.200 కి పైగా చేరింది. టీ, కాఫీ విషయానికి వస్తే సామాన్యుడికి అందుబాటులో ఉండే టీ ధర కూడా రూ.15 నుంచి రూ.20 వరకు పెరిగింది. కమర్షియల్ సిలిండర్ ధరలు పెరగడం వల్ల హోటల్ నిర్వహణ వ్యయం 20 శాతం నుంచి 30 శాతం వరకు పెరిగింది. పప్పు దినుసులు, వంట నూనెలు, కూరగాయల ధరలు కూడా భారీగా పెరగడం హోటల్ యజమానులను ఇబ్బందుల్లోకి నెట్టింది. కరెంటు బిల్లులు, షాపుల అద్దెలు, పనివారి జీతాలు పెరగడంతో ధరల పెంపు తప్పనిసరి అని యజమానులు వాదిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే పేద ప్రజల ఆకలి తీరడం కష్టంగా మారనుందని సామాన్యుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

## దేశమంతా కోరింది

>> అరాచకత్వం సృష్టించిందన్నారు. బొగ్గు గనుల్లో మమతా బెనర్జీ, అక్కడి మంత్రులు అక్రమంగా బొగ్గు ఉత్పత్తి చేసి, అక్రమంగా అమ్ముకొని కోట్లు దండుకున్నారని, ఎన్నిసార్లు ఈ అక్రమ దందాను నిలిపేయాలని ఎన్నిసార్లు కోరినా మమతా బెనర్జీ స్పందించలేదన్నారు. రాణిగంజ్ సహా వివిధ కోల్ బెల్ట్ నియోజకవర్గాల్లో బిజెపి బంపర్ మెజారిటీతో గెలిచిందిదన్నారు. గతంలో సిపిఎం, ఇప్పుడు మమతా బెనర్జీ బెంగాల్‌లో పారిశ్రామిక వ్యవస్థను ధ్వంసం చేశారని, పరిశ్రమలు రాష్ట్రం నుంచి తరలిపోయేలా దుర్మార్గంగా వ్యవహరించారని మండిపడ్డారు. దీంతో అక్కడి యువత ఉపాధిలేక ఇతర ప్రాంతాలకు వలసపోయారని, రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయకుండా కుట్ర చేశారని, తృణమూల్ కాంగ్రెస్ గత ఏళ్లుగా బంగ్లాదేశ్ నుంచి వచ్చిన గూండాలను పెంచి పోషించిందన్నారు. వారికి ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు ఇచ్చి వారికి, ప్రభుత్వ పథకాల ఫలాలను అందించిందని, బంగ్లాదేశ్ గుండాలు.. మమతాదీదీ ఇచ్చిన ఉచిత పథకాలు అందుకుని, రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు చేశారని మండిపడ్డారు. హిందువులపై దాడులకు తెగబడ్డారు, బెంగాల్ ప్రజలకు బిజెపి గెలుపుతో మంచి రోజులు రానున్నాయని,డబుల్ ఇంజన్ సర్కారు బెంగాల్‌లో అధికారంలోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో పూర్తిగా కనుమరుగైంది. రాహుల్ నాయకత్వంలో ఆ పార్టీ తుడిచిపెట్టుకు పోతుందన్నారు. దేశ ప్రజలంతా దేశంలో డబుల్ ఇంజిన్ సర్కారు రావాలని కోరుకుంటున్నారని, దక్షి ణ భారతదేశంలో బిజెపి అధికారంలోకి వచ్చేందుకు పుష్కలమైన అవకాశాలున్నాయన్నారు. తెలంగాణలో కూడా ఈ ఎన్నికల ఫలితాల ప్రభావం చాలా సాను కూలంగా ఉండనుందన్నారు. నరేంద్రమోడీ నేతృత్వంలో అందరం కలిసి కట్టుగాపని చేసి బిజెపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోడీ తొలిసారిగా 10వ తేదీన తెలంగాణకు రానున్నారని, ఈ సందర్భంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించుకుం టున్నామని తెలిపారు. కెసిఆర్ పాలనలో రాష్ట్రంలో.. అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం పెరిగింది... కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన తర్వాత కూడా ఈ పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదన్నారు.

## ఇద్దరు సిఎంలు ఘోర పరాజయం

### భవానీపూర్‌లో మమత

### కొళత్తూరులో స్టాలిన్ ఓటమి

**కోల్‌కత్తా, మే 4:** పశ్చిమబెంగాల్ ముఖ్యంమంత్రి మమతా బెనర్జీకి షాక్ తగిలింది. ఆమె పోటీచేసిన భవానీపూర్‌స్థానంలో ఆమె ప్రత్యర్థి బిజెపి అభ్యర్థి సువేందు అధికారి చేతిలో 15 వేలకుపైగా ఓట్లతేడాతో ఓడిపోయారు. బెంగాల్‌లో బిజెపి 200 సీట్లతో ఘనవిజయం సొంతంచేసుకోగా టిఎంసి 72స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. 2021లో కూడా మమతా బెనర్జీని సువేందు అధికారి ఓడించిన విషయం తెలిసిందే. అదేవిధంగా తమిళనాడు ఎన్నికల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఓటమి చవిచూసారు. కొళత్తూర్ నియోజకవర్గంనుంచి పోటీచేసిన ఆయన టివికె అభ్యర్థి విఎస్‌బాబుచేతిలో 9 వేల ఓట్ల తేడాతో ఓటమి చవిచూసారు. కొళత్తూరునుంచి మూడుసార్లు గెలిచిన సీఎం ఈ ఎన్నికల్లో విజయం సాధించలేకపోయారు. 1996 తర్వాత సీఎం స్టాలిన్ ఓటమి పాలుకావడం ఇదే తొలిసారి. అదికూడా తన పాతమిత్రుని చేతిలోనే ఓడిపోవడం గమనార్హం.

## విజయ్ విహారం

>> విజయ్ ముందుకు సాగి విజయం సాధించారు. పార్టీకి బలమైన కేడర్ ఉండటం, పార్టీకి కర్తర్మక్రియ అన్నీ తానే అయి ముందుకునడిపించిన విజయ్ ముందుకుసాగారు. మొత్తం 38 జిల్లాల్లో కేవలం 10 లోపే జిల్లాల్లోపర్యటించినప్పటికీ తమిళనాడు ప్రజలు ఆయనకు పట్టం కట్టారు. హోరాహోరీ పోరులో అతిరథమహారథులను టివికెకు చెందిన ప్రాముఖ్యంలేని నేతలు ఓడించి రికార్డులు సాధించారు. తక్కువ ప్రచారంతో ఎక్కువమందిని ఆకర్షించేటట్లు తన వ్యూహాలను అమలుచేసి విజయ్ విజయం సాధించారు. పేరుకు తగినట్లుగానే పోటీచేసిన రెండుస్థానాల్లోకూడా గెలిచారు. డిఎంకె కాంగ్రెస్‌కూటమి74 స్థానాలు గెలిస్తే టివికె 107 స్థానాలు గెలిచి ఏకైక అతిపెద్దపార్టీగా అవతరించింది. అన్నా డిఎంకె కూటమి 53 స్థానాలకే పరిమితం అయింది. మొత్తంగాచూస్తే టివికె ఏడాదిలోపే పుట్టిన పార్టీ అయినప్పటికీ తమిళనాట 48 ఏళ్ల ప్రాంతీయ పార్టీలకు చెక్‌పెట్టి ఇపుడు పాలనపగ్గాలు చేపడుతోంది. ఇది కేవలం విజయ్‌కే సాధ్యం అనిపించే విధంగా ఆపార్టీ విజయం సాధించింది.

## వారం - వర్జ్యం

05-05-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
చవితి పూర్తి
జ్యేష్ఠ మ.12.54
వర్జ్యం : లేదు
దు.ఉ.8.13-ఉ.9.04,
2) రా.11.34-రా.12.25
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** ఖర్చులు అధికం అవుతాయి. కోర్టు వ్యవహారాలు మీకు అనుకూలంగా ఉంటాయి.కొత్త మిత్రులు పరిచయం.

**వృషభం:** కీలక విషయాలలో మిత్రులతో ఆలోచించి ముందుకు సాగింది. ఒక అవకాశం వెతుక్కుంటూ రాగలదు.

**మిథునం:** షేర్ల క్రయ విక్రయాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. సంఘంలో పేరు ప్రఖ్యాతలు పొందుతారు.

**కర్కాటకం:** విద్య, పారిశ్రామిక రంగాల వారికి కొంత మేరకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రయాణాలు లాభిస్తాయి.

**సింహం:** అందరిని కలుపుకొని మంచి పనులు చేస్తారు. సంకుచిత మనస్తత్వం కలిగిన వ్యక్తులతో ఇబ్బందులు తప్పకపోవచ్చు.

**కన్య :** ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. రావల్సి ధనం చేతికి అందదు. ఆరోగ్య విషయమై ఖర్చులు సూచిస్తున్నాయి.

**తుల :** నూతన వ్యక్తులతో, పెద్దలతో పరిచయాలు ఏర్పడుతాయి. తద్వారా మీరు కొంత మేర లాభపడతారు. వాహనసౌఖ్యం.

**వృశ్చికం:** వృత్తి, ఉద్యోగాలలో మీపై అధికారుల వత్తిడి అధికం అవుతుంది. ప్రయాణాలు. పెట్టుబడుల విషయంలో నిదానం అవసరం.

**ధనుస్సు:** ఆత్మీయులతో కలిసి పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు. వివాహాది శుభకార్యాలకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి..

**మకరం:** మీరు చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైన ధైర్యముతో ఎదుర్కొంటారు. ఋణాలు కొంతవరకు తీరుస్తారు.

**కుంభం:** వృత్తి యందు బాధ్యతలు పెరుగుట వలన అధిక శ్రమకు గురి అవుతారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది.

**మీనం :** దైనందిన కార్యకలాపములలో మార్పులు గోచరిస్తున్నాయి. పొదుపుకు సంబంధించి పురోగతి సాధిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సోమవారం న్యూఢిల్లీలో విజయోత్సవాల్లో తరుణ్‌చుగ్ తదితరులు



న్యూఢిల్లీలో బిజెపి ప్రధాన కార్యాలయం వద్ద బాణాసంచా పేలుస్తున్న అభిమానులు

## బెంగాల్‌లో విరిసిన కమలం

>> అదేవిధంగా కేరళంలోని ఎల్డీఎఫ్ కూటమి జైత్రయాత్రకుసైతం బ్రేక్‌పడింది. కేరళంలోని ఓటర్లు ఈసారి కాంగ్రెస్ భాగస్వామ్యం ఉన్న యుడిఎఫ్ కూటమికి జైకొట్టారు. ఇక్కడ 140 స్థానాల్లో కాంగ్రెస్‌కూటమికి 99 స్థానాలు, సిపిఐఎం 26స్థానాలు, ఐయుఎంఎల్ 22స్థానాలు, సిపిఐ ఎనిమిది, బిజెపి మూడు ఇతరులు 18 స్థానాలు గెలుచుకున్నారు. యుడిఎఫ్‌కూటమి ప్రభుత్వం ఏర్పాటుదిశగా అత్యదిక స్థానాలు గెలిచి మ్యాజిక్‌మార్కును సులువుగా దాటేసింది. కేరళలో ఎల్డీఎఫ్ ఓటమి చవిచూసినా సీఎం పినరయి విజయన్ మాత్రం ధర్మదంస్థానంలో గెలుపొందడంతో కూటమి ఊరట చెందింది. ఇక తమిళనాడులో అయితే 1996నుంచి అప్రతిహతంగా వస్తున్న డిఎంకె ప్రభుత్వాన్ని ఏడాదిక్రితం పార్టీనిస్థాపించి తమిళనాట విస్తృతంగా పర్యటనలుచేసిన సినీ నటుడు విజయ్ స్థాపించిన కొత్త పార్టీతో తొలిసారే సీఎం అయ్యేవిధంగా విజయం సాధించారు. 234 స్థానాల్లో మొత్తం టివికెకు 106 స్థానాలు, డిఎంకెకు 56, ఎఐఎడిఎంకెకు 50, కాంగ్రెస్‌కు ఐదు, బిజెపి ఒకటి, ఇతరులు 16 స్థానాల్లో గెలిచారు. తమిళనాడులో డిఎంకెకు ఘోరపరాభవం తప్పలేదు. ఇటీవలే పార్టీలోచేరిన ఎఐఎడిఎంకెనేత మాజీసీఎం పన్నీర్‌సెల్వం గెలవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. స్టాలిన్ కుమారుడు చేపాక్‌లో విజయం సాధించాడు. అయితే పార్టీ మాత్రం రాష్ట్రంలో దెబ్బతిన్నదనే చెప్పాలి. అస్సాంలో బిజెపి సీనియర్‌నేత ప్రస్తుత సీఎం హిమంతబిశ్వశర్మ సారథ్యంలోనే బిజెపి హ్యాట్రిక్ విజయం సాధించింది. మొత్తం 140 స్థానాల్లో మేజిక్ మార్కు ను అధిగమించి 102 స్థానాలు సాధించింది కా గ్రెస్‌పార్టీ 19 స్థానాలకే పరిమితం అయితే ఇతరులు 3స్థానాల్లో గెలిచారు. తొలినుంచీ కూడా తన విజయంపై ధీమాగా ఉన్న హిమంతశర్మ తనదైనశైలిలో ముందుకు దూసుకుపోవడం వల్లనే విజయం సాధించింది. వరుసగా మూడోసారి సీఎం అయ్యే అవకాశాలు ఆయనకే ఎక్కువగా ఉన్నాయి. ఇక పుదుచ్చేరిలో ఎన్ఆర్‌కాంగ్రెస్ అధినేత రంగస్వామితోపాటు బిజెపి కలిసి పోటీచేసింది. మొత్తం 30 స్థానాల్లో ఇప్పటికే 16స్థానాలు పైబడింది. కాంగ్రెస్ ఆరుస్థానాలకే పరిమితంకాగా ఆరుగురు ఇతరులు కూడా గెలవడంతో ఎన్నార్సీ బిజెపి కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు ఏర్పాట్లు ముమ్మరంచేసుకుంటున్నది.

## చరిత్ర సృష్టించిన బిజెపి

### ఐదు రాష్ట్రాల ప్రజలు రాజ్యాంగాన్ని గెలిపించారు: ప్రధాని మోడీ

### గంగోత్రి నుంచి గంగాసాగర్‌దాకా వికసించిన కమలం

**న్యూఢిల్లీ, మే 4:** ఐదురాష్ట్రాలప్రజలు భారత రాజ్యాంగాన్ని గెలిపించారని, బెంగాల్‌లో 93శాతం పోలింగ్‌తో సరికొత్త రికార్డు నమోదుచేసారని ప్రధానిమోడీ వ్యాఖ్యానించారు. ఐదురాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో మూడురాష్ట్రాల్లో బిజెపి ప్రభంజనంపై ఆయన హర్షంప్రకటించారు. ప్రత్యేకించి బెంగాల్ విజయంపై బిజెపి చరిత్ర సృష్టించిందని అన్నారు. ఐదురాష్ట్రాల ఫలితాల్లో బిజెపి మూడు రాష్ట్రాల్లో విజయంపై మోడీ బిజెపి కేంద్రకార్యాలయంలో జరిగిన సంబరాల్లో పాల్గొని ప్రసంగించారు. సాంప్రదాయ పంచెకట్టుతో పార్టీ ఆఫీసుకువచ్చిన మోడీ గంగానది ప్రవహించే ఉత్తరాఖండ్‌నుంచి బెంగాల్‌వరకూ గెలిచామని, గంగానది ఆశీర్వాదంవల్లే ఈ విజయాలు వచ్చాయన్నారు. బ్రహ్మపుత్ర ఆశీర్వాదంతో అస్సాంలోకూడా హ్యాట్రిక్ విజయం సాధించామన్నారు. పుదుచ్చేరిలో 2021లో ఇచ్చిన హామీలు అమలుచేసామని, బెంగాల్‌లో గెలుపుతో శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ ఆత్మకు శాంతి లభిస్తుందని, ఇకనుంచి బెంగాల్‌లో భయాందోళనలు ఉండవని అన్నారు. సుపరిపాలన అందించినందువల్లనే ప్రజలు మాకు పట్టం కట్టారని, రాష్ట్రాలు అభివృద్ధిచెందాలంటేబిజెపి ఉండాలని ప్రజలు బలంగా విశ్వసించారని అందుకే అద్వితీయ విజయాలను బిజెపికి అందిస్తున్నారని మోడీ అన్నారు. బెంగాల్‌లోప్రజాశక్తి గెలిచిందన్నారు. బెంగాల్‌లోని ప్రతి ఒక్కరికీ తాను తలవంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్నివర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం అందించేవిధంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తామని మోడీ హామీ ఇచ్చారు. బిజెపి కేంద్ర కార్యాలయంలో బెంగాల్, అస్సాంలలో బిజెపి విజయంపై పార్టీపెద్దలు సంబరాల్లో పాల్గొన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబీన్‌తోపాటు కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, జెపినడ్డా తదితరులు మొత్తం హాజరయ్యారు. పార్టీకేడర్ కూడా ఉత్సాహంతో బాణాసంచాలకాల్చి బిజెపి విజయసంబరాలను కేరింతలతో నిర్వహించారు.



సోమవారం తిరువనంతపురంలో కాంగ్రెస్ విజయోత్సవాల్లో కెసి వేణుగోపాల్ తదితరులు

## కార్యాలయాలు మీకు.. కల్లాలు మాకా?

>> ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్,సంబంధిత శాఖల అధికారులు స్పష్టమైన వైఖరి ప్రకటించేదాకా ఇక్కడి నుండి లేచేది లేదని తేల్చి చెప్పారు. రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి నెల రోజులు పూర్తి కావస్తున్నా ధాన్యం కొనుగోలు చెయ్యట్లేదని, రకరకాల నియమ నిబంధనలతో రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. వరి కోతలు కూడా చివరి దశకు చేరుకున్నాయని పండించిన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చారని, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం నిర్ణీత తేమ శాతం వచ్చినా కానీ కొనుగోలు చేయ ఉండటంతో రైతులు ధాన్యాన్ని రాశులుగా పోసి కొనుగోలు కోసం ఎదురుచూస్తున్నారని,ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశం లేకపోవడంతో కొనుగోలు జరగడంలేదని అన్నారు.ఎఫ్ ఎ క్యూ నిబంధనల పేరిట రైతుల ధాన్యం కొనుగోలు చేయకుండా తీవ్ర జాప్యం చేస్తూ రైతులను కష్టనష్టాలకు గురిచేస్తున్నారన్నారు.మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, జాలే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలప్పుడు మాయమాటలతో అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం కనీసం ధాన్యం కొనడం కూడా చేతకాకుండా చేతులెత్తేసిందని,ఈ ప్రభుత్వం వచ్చిన దగ్గరనుంచి రైతులకు అన్ని కష్టాలేనని, రైతుబంధు ఎగ్గొట్టుకుంటూ సరిగా ఇవ్వకుంటూ,కనీసం యూరియా బస్తాలు కూడా సకాలంలో అందించలేదని, ఆరుగాలం కష్టపడి కష్టనష్టాలు వచ్చి పండిన పంట కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే ఇక్కడ కొనుగోలు చేయకుండా రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు పై జిల్లా కలెక్టర్ అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఈ రాస్తారోకో విరమించేది లేదన్నారు.మొండికుంట లో బిఆర్ఎస్ సీపీఎం శ్రేణులు రాస్తారోకో నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న అశ్వాపురం సిఐ జి అశోక్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని రైతులను సముదాయించినా రైతుల నిర్ణయంలో ఎటువంటి మార్పు లేకుండా రాస్తారోకో నిర్వహించారు. సీఐ చొరవతో అశ్వాపురం వ్యవసాయ శాఖ అధికారి చటర్జీ రైతుల వద్దకు చేరుకొనగానే రైతుల్లో ఆగ్రహం రెట్టింపై కొద్దిసేపు ఉద్రిక్తత కు దారితీసింది. రైతులు వ్యవసాయ శాఖ అధికారిని చుట్టుముట్టి దాదాపు నెల రోజులు కావస్తున్న ఎక్కడికి వెళ్లారని కనీసం ధాన్యం కొనుగోళ్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షి ంచారా, రైతులు ఎర్రటి ఎండలో వడగాలుల ను తట్టుకొని కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తుంటే మీరు మాత్రం కార్యాలయాలు దాటి బయటకు రావట్లేదని,ఇదేనా రైతుల పట్ల మీకున్న చిత్తశుద్ధి అని నిలదీశారు. ఒక్కసారిగా చుట్టుముట్టిన రైతులను సిఐ సముదాయించటంతో, ఏవో చటర్జీ మాట్లాడుతూ రేపటి నుంచి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేసి తరలిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు శ్యామల యాదగిరిరెడ్డి,పినికేసి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత ముప్పై ఏళ్లుగా మేము వ్యవసాయం చేస్తున్నామని, ఇంతవరకు ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఇలాంటి పరిస్థితి ఏనాడు ఎదుర్కోలేదని,రేపటి నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొదలు పెట్టాలని లేనిచో ఈరోజు జరిగిన ఆందోళన ఆరంభం మాత్రమే అని, ఇంతకుమించిన ఆందోళనలు నిర్వహించి వ్యవస్థలన్నీ స్తంభింప చేస్తామని హెచ్చరించారు. దాదాపు గంటన్నర సేపు జరిగిన ఈ కార్యక్రమం చివరికి వ్యవసాయ శాఖ అధికారి ఇచ్చిన హామీతో రైతులు ఆందోళన ను విరమించారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సూదిరెడ్డి గోపిరెడ్డి, మండల బిఆర్ఎస్ యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ,వెన్నా అశోక్ కుమార్,పాటి మన్మధ రెడ్డి,తూము కళాధర్, సిపిఎం నాయకులు పగడాల అశోక్ రెడ్డి,బొమ్మరాతి రామయ్య, సర్గం రాఘవులు,సర్పంచులు మర్రి సంధ్య, మంద్రు రామకృష్ణ,ముర్రం సమ్మయ్య,కొంద్రు సోమయ్య, లకావత్ రామారావు,కోర్సా అలివేలు,కల్లేటి నాగమణి,ఉపసర్పంచ్ లు చలమల్ల శివారెడ్డి,గాడిద మహేష్, బొల్లినేని గణేష్, పసుల లింగయ్య,దారపు శ్రీను,రామాచారి,సతీష్,పాటి చంద్రకళ,యానాల లావణ్య,అంబటికర్ర శ్రీను,తాటిపాముల రమేష్,కడారి వేణు,మందా హుస్సేన్ రామకృష్ణ,వీరారెడ్డి అధిక సంఖ్యలో రైతులు, బిఆర్ఎస్,సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసోం, పుదుచ్చేరిలో అవే 'డబులింజిన్'లు

### హ్యాట్రిక్ సాధించిన అసోం సిఎం హిమంత బిశ్వ శర్మ

**గువాహతి/ పుదుచ్చేరి, మే 4:** ఈశాన్యరాష్ట్రం అస్సాంలో హిమంతబిశ్వశర్మ నేతృత్వంలో బిజెపి మూడోసారి విజయం సాధించింది. హ్యాట్రిక్ సాధించిన బిజెపి సీఎం కూడా హిమంతబిశ్వశర్మనే వరిస్తుందన్న అంచనాలుపెరిగాయి. మొత్తం 126 అసెంబ్లీస్థానాల్లో భారతీయ జనతాపార్టీ 82 స్థానాలు గెలిచింది. కాంగ్రెస్‌పార్టీ 19 స్థానాలకే పరిమితం కాగా బోడోలాండ్ పీపుల్స్‌ఫ్రంట్ 10 స్థానాలు, అస్సాం గణపరిషద్ 10 స్థానాలు, ఆలిండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రెండు, రైజోర్‌దళ్ రెండు,టిఎంసి ఒకస్థానంలోను గెలుపొందాయి. మెజార్టీమార్కును అత్యంత సులువుగా దాటేసిన అస్సాంలో బిజెపిహైకమాండ్ హిమంతబిశ్వశర్మ పైనే ఎక్కువ నమ్మకం ఉంచింది. మొత్తం 30స్థానాలున్న కేంద్రపాలితప్రాంత పుదుచ్చేరి అసెంబ్లీలో ఆలిండియాఎన్నార్సీకి 12 స్థానాలు, డిఎంకె ఐదు, బిజెపి 4 టివికె రెండు, కాంగ్రెస్ ఒకటి,ఎల్‌జెకె ఒకటి ఇతరులు ఐదుస్థానాల్లో గెలిచారు. ఎన్నార్సీ బిజెపి, స్వతంత్రులతోకలిసి ప్రభుత్వం ఏర్పాటుకు ఈ దక్షిణాది రాష్ట్రంలో సులువయింది. మొత్తం స్వతంత్రులతోకలిసి 21 స్థానాలకు రావడంతో ఇక రంగస్వామి మరోసారి సీఎం అయ్యేందుకు తన వ్యూహాలు విజయవంతంచేసుకున్నట్లు స్పష్టంగా కనిపించింది.

## 'చేతి'లోకి కేరళం

### ఒక్క కాంగ్రెస్‌కే 63 సీట్లు

**తిరువనంతపురం, మే 4:** వామపక్ష ప్రజాతంత్ర కూటమి ఎల్డీఎఫ్‌కు కేరళలో అనూహ్య ఓటమి ఎదురయింది. ఆరుపర్యాయాలు కేరళంలో ప్రభుత్వాలునడిపిన ఎల్డీఎఫ్ ఈసారి ఘోరపరాజయం చవిచూసింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమక్రటిక్ ఫ్రంట్ ఈసారి అత్యధిక స్థానాలు గెలుచుకుంది. 140 మందిసభ్యులున్న అసెంబ్లీలో మెజార్టీ మార్కు 71 స్థానాలను అధిగమించ గలిగింది. కాంగ్రెస్ పార్టీ ఒక్కటే 63 స్థానాలు గెలిచింది. యుడిఎఫ్ 102 స్థానాలుసాధిస్తే ఎల్డీఎఫ్ 35 స్థానాలకే పరిమితం అయింది. కేరళ విజయంతో దేశంలో ఇక వామపక్షాలపాలనశకం ముగిసిందనేటట్లు ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. కాంగ్రెస్ పార్టీకే మేం కట్టుబడి ఉన్నట్లు కేరళం ఓటర్లు తీర్పునిచ్చారు. పార్టీకి 63 స్థానాలు రాగా సిపిఐఎంకు 26, ఐయుఎంఎల్‌కు 22, సిపిఐకి ఎనిమిది, కెఇసి ఏడు స్థానాలు లభించాయి. ఇక ఆర్ఎస్‌పికి మూడు, ఇతరులు 11స్థానాల్లో గెలవడంతో కేరళలో యుడిఎఫ్ పాలనపగ్గాలుచేపట్టేందుకు మార్గం సులువయింది.

## సిబిఐ విచారణకు గ్రీన్ సిగ్నల్

>> తెలిపారు. ఈనెల 26వ తేదీలోగా సవరించిన విలువలు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులు ఇప్పుడు ప్రభుత్వం చెల్లించే పరిహారం రేట్లపై అసంతృప్తితో ఉన్నారు. ధర పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందిస్తున్నారు. దీంతో పాటు వాస్తవంగా మార్కెట్ లో ఉన్న ధరలతో పోలిస్తే ప్రభుత్వం నిర్ణయించిన భూముల ధరలు భారీగా వ్యత్యాసమున్నాయి. అందుకు శాస్త్రీయ పద్ధతి అనుసరించి ఈ ధరలను సవరించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వారికి ఇప్పుడున్న భూముల ధరలే వర్తిస్తాయి. మిగతా 90 శాతం 90 రోజుల్లో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కాగా, అకాల వర్షాలతో వివిధ జిల్లాల్లో పంటలు, పంట ఉత్పత్తులకు నష్టం వాటిల్లినట్లు సమాచారం అందింది. వెంటనే ఆయా జిల్లాల ఇంచార్జి మంత్రులు బాధ్యత తీసుకుని వివరాలు తెప్పించుకుని రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి పొంగులేటి వివరించారు. నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘాన్ని నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డుకు అప్పగించే ఎంవోయూకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో నల్గొండ రంగారెడ్డి మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ (నార్మక్) కు సంబంధించిన పాలు, పాల ఉత్పత్తులకు సంబంధించి డైరీ ప్లాంట్ నిర్వహణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ ఎన్డీడీబీ నిర్వహిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణలో 9 జిల్లాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్ల వద్ద సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పైలెట్ పద్ధతిన 18 చోట్ల ఈ సోలార్ జనరేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దాదాపు రూ.66.50 కోట్లతో 19 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను అమలు చేసేందుకు ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లలో పెండింగ్‌లో ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాలు పన్నులను క్లియర్ చేరుకునేందుకు వన్ టైమ్ సెటిల్ మెంట్ (ఓటిఎస్) వెసులుబాటు కల్పించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. దాదాపు రూ. 5864 కోట్ల బకాయిలున్నాయి. జరిమానాలు, వడ్డీలన్నీ మినహాయించి వన్ టైమ్ సెటిల్మెంట్ ద్వారా రూ.1686 కోట్లు వస్తాయని అంచనా వేసింది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలోనే వన్ టైమ్ సెటిల్మెంట్ పై ఈ బకాయిలు వసూలు చేసుకోవాలని మున్సిపల్ శాఖను కేబినెట్ ఆదేశించింది. హైదరాబాద్ జల మండలికి ఇవ్వాల్సిన నీటి బకాయిలను కూడా సర్దుబాటు చేయాలని నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కామేపల్లి వద్ద బుగ్గవాగు నుంచి లెఫ్ట్ ఫ్లడ్ ఫ్లో కాలువ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఖమ్మం జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు నీరు అందించనున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్ నగర్లో ఆధునిక కూరగాయల మార్కెట్ కోసం 42 ఎకరాల భూమి కేటాయించేందుకు రాష్ట్ర మంత్రివర్గం తెలిపిందని పేర్కొన్నారు.




## తమిళనాట చక్కర్లు కొడుతున్న విజయ్ కారు నంబర్

### రెండేళ్లక్రితమే సీఎం కావాలని ఫిక్స్ అయిన ఫ్యాన్స్

**చెన్నై, మే 4:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దళపతి విజయ్ సునామీ కనిపించింది. టీవీకే పార్టీ అద్భుత విజయాన్ని అందుకుంది. ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచింది. విజయ్ పార్టీ సింగిల్‌గా పోటీచేసి గెలుపు అందుకున్నారు. 110 కుపైగా సీట్లలో టీవీకే పార్టీ అభ్యర్థులు ఆధిక్యంలో ఉన్నారు ట్రెండ్‌ను బట్టి విజయ్ ముఖ్యమంత్రి కావడం ఖాయంగా కనిపిస్తోంది. తమిళనాడు ఎన్నికల ఫలితాల వేళ రెండేళ్ల క్రితం వచ్చిన విజయ్ సినిమా గోట్ కారు నంబర్ ప్లేట్ వైరల్ అవుతోంది. ఈ సినిమాలో విజయ్ కారుకు ఉన్న నంబర్ ప్లేట్ గురించి చర్చ జరుగుతోంది.. దళపతి రెండేళ్ల క్రితమే టార్గెట్ ఫిక్స్ చేసుకున్నట్లు చర్చ జరుగుతోంది. దళపతి విజయ్ 2024 ఫిబ్రవరి 2న టీవీకే పేరుతో పార్టీని ప్రారంభించారు. 2024 సెప్టెంబర్ 5న ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ గోట్ మూవీ విడుదలైంది.అంటే విజయ్ పార్టీని స్థాపించిన దాదాపు ఏడు నెలలకే ఈ సినిమా వచ్చింది హీరోయిన్‌గా త్రిష నటించారు. ఈ మూవీలో విజయ్ ప్రయాణించిన కారుకు నంబర్ ప్లేట్‌పై టిఎన్ 07 సీఎం2026 ఉంది. తమిళనాడు ఎన్నికల ఫలితాల వేళ ఈ కారు నంబర్ ప్లేట్ వైరల్ అవుతోంది. 2024లోనే విజయ్ ముఖ్యమంత్రి టార్గెట్ ఫిక్స్ చేసుకున్నారనే చర్చ జరుగుతోంది. ఈ నంబర్ ప్లేట్‌తో మరో కొత్త లాజిక్ కూడా తెరపైకి వచ్చింది.

# ప్రశాంతంగా ఎప్ సెట్ అగ్రికల్చర్ పరీక్షలు

### 92.9 శాతం హాజరు, నేడు ఒక సెషన్‌లో కొనసాగనున్న పరీక్ష: కన్వీనర్ విజయ్‌కుమార్ రెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 4:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026–27 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈఏపీ(ఎప్) సెట్–2026కి సంబంధించిన అగ్రికల్చర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మొదటి రోజు పరీక్షలకు 92.9 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ఎప్ సెట్–2026 కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్న సెషన్‌ను 3 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించినట్లు తెలిపారు. మొదటి రోజు ఎప్ సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయు వీసీ ప్రొఫెసర్ కిషన్ కుమార్ రెడ్డి, జేఎన్‌టీయు రిజిస్ట్రార్, ఎప్ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రం లోనికి అనుమతించలేదు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 106 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎప్ సెట్–2026 కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఉదయం సెషన్‌లో 30,333 మంది దరఖాస్తుచేసుకోగావారిలో 28,046 మంది (92.46శాతం) పరీక్షకు హాజరయ్యారు. మధ్యాహ్న సెషన్‌లో 30,253 మందికిగానూ 28,241 మంది(93.35) శాతం మంది హాజరయ్యారు. నేడు(మంగళవారం)జరిగే సెషన్‌కి 30, 372 మంది పరీక్షకు హాజరుకానున్నారు. ఈ నెల 9 నుంచి 11 వరకు ఇంజినీరింగ్ పరీక్షలు జరుగనున్నాయి.

## కాంగ్రెస్ చరిత్రాత్మక విజయం

### 'నేను ఎప్పటికీ మరవలేను' సిఎం రేవంత్‌రెడ్డి స్పెషల్ ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే4:** కేరళలో కాంగ్రెస్ కూటమి సాధించిన చారిత్రాత్మక విజయంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ అఖండ విజయం పట్ల కూటమి నాయకులకు, కార్యకర్తలకు, కాంగ్రెస్ శ్రేణులకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా అభినందనలు తెలిపారు. కేరళలో ఈ అద్భుత విజయం సాధించడానికి మార్గనిర్దేశం చేసిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, దీపా దాస్ మున్షీలకు రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వారి సమర్థవంతమైన నాయకత్వం వల్లే ఈ చారిత్రాత్మక గెలుపు సాధ్యమైందని ఆయన కొనియాడారు. కేరళలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ద్వారా దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొందని పేర్కొన్నారు. కేరళలో సీఎం రేవంత్ రెడ్డి స్టార్ క్యాంపెయినర్‌గా పలు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొనగా.. తన ప్రచార పర్యటనను గుర్తు చేసుకుంటూ రేవంత్ రెడ్డి కేరళ ప్రజలపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. నేను కేరళలో ప్రచారం చేస్తున్న సమయంలో అక్కడి ప్రజలు నాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలను ఎప్పటికీ మరువలేను. యూడీఎఫ్ మద్దతుదారులకు, కేరళ ప్రజలకు తెలంగాణ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని ఆయన పేర్కొన్నారు. కేరళ ఓటర్లు అభివృద్ధిని, ప్రజాస్వామ్య విలువలను నమ్మి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలు పురోగతి విలువలు, ప్రజాస్వామ్య సిద్ధాంతాలు కలిగిన గొప్ప రాష్ట్రాలని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గత దశాబ్ద కాలంగా నిరాశ, నమ్మకద్రోహానికి గురైన కేరళ ప్రజలు.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉజ్వల భవిష్యత్తును పొందబోతున్నారన్నారు.తెలంగాణలో ఇప్పటికే ప్రజా ప్రభుత్వం కొనసాగుతుండగా ఇప్పుడు కేరళలో కూడా కాంగ్రెస్ అధికారం చేపట్టడం ద్వారా రెండు రాష్ట్రాలు అభివృద్ధిలో కలిసి నడుస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# హైదరాబాద్ శివారులో భారీ పేలుడు

## ముగ్గురికి గాయాలు.. భారీగా ఆస్తి నష్టం

**సరూర్‌నగర్, మే 4 ప్రభాతవార్త:** శివారు హైదరాబాద్‌లో ఓ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. దాదాపు కిలోమీటర్ మేర వరకు భారీ శబ్ధం రావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ప్రమాదంలో భారీ అస్తినష్టం జరిగింది. వైద్య అవసరాల కోసం వాడే ఆక్సిజన్‌కు సంబంధించిన ట్యాంకులు పేలిన ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా పేలుడు ధాటికి ఆస్తి నష్టం సంభవించింది. ఈ సంఘటన సోమవారం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జల్‌పల్లి శివార్లలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే జల్‌పల్లి పరిధిలోని బాబా కాంటా సమీపంలో వైద్య అవసరాల నిమిత్తం ఆసుపత్రులకు సరఫరా చేసే ఆక్సిజన్ సిలిండర్లు నింపే లైఫ్‌కేర్ మెడికల్ అండ్ ఇండస్ట్రియల్ ఎయిర్ ప్రొడక్స్ సంస్థ ఉంది. అయితే సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఒక్కసారిగా ఓ కంటైనర్‌కు లీకేజీ ఏర్పడి పెద్ద శబ్ధంతో పేలగా ఆ తర్వాత



లైఫ్‌కేర్ మెడికల్ అండ్ ఇండస్ట్రియల్ ఎయిర్ ప్రొడక్స్ సంస్థలో ప్రమాద దృశ్యం

మరొకటి పేలింది. దీంతో కంపెనీకి చెందిన ఇద్దరు ఉద్యోగులు గాయపడగా సమీపంలో వెల్డింగ్ పనులు చేస్తున్న ఓ వ్యక్తితో పాటు ఓ కస్టమర్ సైతం గాయపడ్డారు. ఈ ప్రమాదంలో కంపెనీ రూఫ్ ధ్వంసం కాగా అక్కడే ఉన్న పది డిసిఎం వాహనాలు భారీగా ధ్వంసం అయ్యాయి. సమీపంలోని విశ్వకర్మ ఫర్నీచర్ షాపు షెడ్ ధ్వంసంతో పాటు పరిసరాల్లో ఉన్న పలు ఇళ్ళ గ్లాసులు పగిలిపోయాయి. కాగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసును నమోదు చేసుకొని పహాడీషరీఫ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చరిత్రను తిరగ రాయడానికి కొత్త రాజకీయ శక్తులు అవసరం: కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే4:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ అధినేత్రి కవిత స్పందించారు. భ్రష్టుపట్టిపోయిన ఈ రాజకీయ చరిత్రను తిరగ రాయడానికి కొత్త రాజకీయ శక్తులు అవసరమని తమిళ ప్రజలు నిరూపించారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు.'ఉన్న వాళ్లతో విసిగిపోయాం. అధికార దాహార్తులతో వేసారిపోయాం. భ్రష్టుపట్టిపోయిన ఈ రాజకీయ చరిత్రను తిరగ రాయడానికి కొత్త రాజకీయ శక్తులు అవసరమని దేశానికి తమిళ ప్రజలు ఒక సంకేతం పంపారు' అని ట్వీట్ చేశారు. కవిత కూడా పది రోజుల క్రితం తన కొత్త పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త రాజకీయ శక్తుల అవసరాన్ని ప్రజలు గుర్తించారని అభిప్రాయపడ్డారు.

# పెళ్లి వేదిక ఎక్కాల్సిన వరుడిపై దుండగుల కాల్పులు

**జౌన్‌పూర్ (యుపి), మే 4:** పెళ్లి వేడుకలతో కళకళలాడాల్సిన ఓ ఇంట్లో పెను విషాదం నెలకొంది. మరికొన్ని గంటల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన వరుడిని, ఊరేగింపుగా వెళ్తుండగా దుండగులు నడిరోడ్డుపై కాల్చి చంపారు. ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్‌లో జరిగిన ఈ దారుణంలో తల్లితండ్రులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. పెళ్లికి రెండు రోజుల ముందే తమకు బెదిరింపులు వచ్చాయని, తాము వాటిని తేలికగా తీసుకున్నామని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆజాద్ బింద్ అనే యువకుడికి వివాహం నిశ్చయమైంది. శుక్రవారం సాయంత్రం పూలతో అలంకరించిన కారులో బంధువులతో కలిసి పెళ్లి మండపానికి బయలుదేరాడు. వారి నివాసానికి ఐదు కిలోమీటర్ల దూరంలో, జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు కారును అడ్డగించారు. నెంబర్ ప్లేట్‌కు గుడ్డ కట్టి ఉన్న బైక్ పై వచ్చిన




మాస్కులు ధరించిన నిందితులు వెంటనే ఆజాద్‌పై కాల్పులు జరిపి పరారయ్యారు. కాల్పులు జరగడంతో కారులో ఉన్నవారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. బుల్లెట్ గాయాలతో ఉన్న ఆజాద్ "నేను బతకలేను" అంటూ చెప్పిన మాటలను గుర్తుచేసుకుని కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. వెంటనే అతడిని సమీపంలోని ఆసుపత్రికి, అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆజాద్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఈ హత్య వెనుక వధువు తరపు బంధువుల హస్తం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వధువు బంధువైన ప్రదీప్ బింద్‌కు ఈ పెళ్లి ఇష్టం లేదని, ఈ కారణంగానే అతను రవి యాదవ్, భోలే రాజ్‌భర్‌లతో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. పెళ్లికి ముందు ప్రదీప్ తమను బెదిరించినట్లు వధువు కూడా విచారణలో అంగీకరించింది. నిందితుడు ప్రదీప్‌కు నేరచరిత్ర ఉందని, గతంలో ఓ హత్య కేసులో నిందితుడిగా ఉండి బెయిల్‌పై బయట ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా, వారి ఆచూకీ తెలిపిన వారికి రూ. 25వేల రివార్డును పోలీసులు ప్రకటించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## భారత్‌పై ఆసిమ్‌మునీర్ కొత్తకుట్రలు

### నిఘా వేగుల హెచ్చరికలు



**న్యూఢిల్లీ, మే 4:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్, భారత్‌పై కొత్త కుట్రపూరిత వ్యూహం చేపడుతున్నారు. తన దేశంలో తెహ్రీక్‌ఏతాలిబన్ (టీటీపీ), బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) జరుపుతున్న దాడుల వెనుక భారత్ హస్తం ఉందంటూ తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. పాకిస్థాన్ స్వయంకృతాపరాధమే ఈ సమస్యలకు కారణమని స్పష్టంగా తెలుస్తున్నా, మునీర్ ఈ ప్రచారాన్ని ఉధృతం చేయడం వెనుక ఒక స్పష్టమైన లక్ష్యం ఉందని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. జైష్‌ఏ మొహమ్మద్, లష్కర్‌ఏతొయిబా వంటి ఉగ్రవాద సంస్థలను మళ్లీ భారత్‌పై దాడులకు ఉసిగొల్పడమే ఆయన అసలు ఉద్దేశం. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ సైన్యం పరువు కోల్పోవడంతో, ఆసిమ్ మునీర్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌కు ముందు, "భారత్‌ను తూర్పు నుంచి నాశనం చేయడం ప్రారంభిస్తాం" అంటూ ఆయన గంభీరమైన ప్రకటనలు చేశారు. అయితే, ఆ ఆపరేషన్ విఫలమవడంతో ఇప్పుడు సొంత దేశంలో ఆయనకు ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఈ అవమానం నుంచి బయటపడేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు మునీర్ భారత్‌పై నిందలు మోపుతున్నారని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జైష్, లష్కర్ వంటి ఉగ్రవాద సంస్థలు పునరేకీకరణ అవుతున్నప్పటికీ ఆ ప్రక్రియ పాక్ సైన్యం, ఐఎస్ఐ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఐఎస్ఐ నిధులు, వనరులు సమకూరుస్తున్నా, ఆ సంస్థల నాయకత్వంలో నైతిక స్థైర్యం కొరవడిందని, భారత్‌పై వెంటనే దాడులు చేసేందుకు అవి విముఖంగా ఉన్నాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. వారిలో భారత్‌పై ద్వేషాన్ని మరింత తీవ్రతరం చేసి, దాడులకు పురిగొల్పేందుకే మునీర్ ఈ ఆరోపణల పర్వాన్ని ఎంచుకున్నారని తెలుస్తోంది. మరోవైపు ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లతో యుద్ధం విషయంలోనూ మునీర్ అనుసరించిన వ్యూహం బెడిసికొట్టింది. ఆ వైఫల్యం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి కూడా భారత్‌పై విమర్శలు ఆయనకు ఒక ఆయుధంగా మారాయి. కశ్మీర్‌లో దాడులు చేయడంలో అనుభవం ఉన్న లష్కర్, జైష్‌లను రంగంలోకి దించకుండా పాకిస్థాన్ తన ప్రాక్సీ యుద్ధాన్ని కొనసాగించలేదు. అందుకే ఆ సంస్థలలో మళ్లీ కసి రగిలించేందుకు మునీర్ ఈ ప్రచారాన్ని వాడుకుంటున్నారు. భారత సైన్యం సరిహద్దుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండటంతో ఉగ్రవాదుల చొరబాటు యత్నాలన్నీ విఫలమవుతున్నాయి. పాకిస్థాన్ నిస్పృహలో ఉందని, మునీర్ రెచ్చగొట్టే ప్రసంగాల నేపథ్యంలో కశ్మీర్‌లో ఒక భారీ దాడికి తెగించే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి.



## టిఎంసి కార్యాలయాలపై బిజెపి కార్యకర్తల దాడులు, విధ్వంసం

**కోల్‌కత్తా, మే 4:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారం దిశగా దూసుకుపోతోంది. దాదాపు 200 స్థానాల్లో బీజేపీ లీడ్‌లో కొనసాగడంతో టీఎంసీ ఓటమి ఖాయమైంది. విజయంపై ధీమాతో బిజెపి శ్రేణులు సంబరాల్లో మునిగిపోవడంతోపాటు పశ్చిమ బెంగాల్‌లో పలు చోట్ల సోమవారం హింస చెలరేగుతోంది. వెస్ట్ బర్ధబాన్ ప్రాంతం, అసాన్‌సోల్‌లోని టీఎంసీ కార్యాలయాన్ని బీజేపీ కార్యకర్తలు తగులబెట్టారు. పార్టీ ఆఫీసులోని చైర్లు, టేబుళ్లు, సామగ్రిని ధ్వంసం చేశారు. అలాగే చుట్టుపక్కల వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. కౌంటింగ్ కేంద్రానికి కొద్ది దూరంలోనే ఈ ఘటన జరిగింది. దీంతో ఈ ప్రాంతంలో కేంద్ర భద్రతా బలగాలు మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై అసాన్‌సోల్ దుర్గాపూర్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ పవన్ కుమార్ స్పందించారు. టీఎంసీ ఆఫీసుపై దాడి జరిగిందని, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. మరోవైపు కూచ్ బెహార్‌లోని దిన్హాటలో కూడా హింస చెలరేగింది. టీఎంసీ, బీజేపీ కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పరిస్తితి ఆందోళనకరంగా మారడంతో భద్రతా దళాలు ఆందోళనకారులపై లాఠీఛార్జి చేశాయి. 294 అసెంబ్లీ సీట్లున్న పశ్చిమ బెంగాల్‌లో అధికారం చేపట్టాలంటే 148 సీట్లు అవసరం. బీజేపీ మెజారిటీ మార్క్ దాటి లీడింగ్‌లో దూసుకెళ్తోంది. టీఎంసీ మాత్రం వెనకబడింది. అయితే, సాయంత్రానికి ఫలితాలు మారిపోతాయని మమతా బెనర్జీ అన్నారు. తమ టీఎంసీయే అధికారంలోకి వస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.

# దేశంలో అధికారంలో లేని వామపక్షాలు

**న్యూఢిల్లీ, మే 4:** భారత రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా వెలుగొందిన వామపక్షాలు, దేశంలో ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేని పరిస్థితిని తెచ్చుకున్నాయి. ఐదు దశాబ్దాల్లో ఇలాంటి రాజకీయ శూన్యత ఏర్పడటం ఇదే తొలిసారి. తమ చివరి కంచుకోట అయిన కేరళంలోనూ లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) అధికారం కోల్పోయే దశకు చేరింది. కేరళలో వెలువడుతున్న ఎన్నికల సరళి ప్రకారం పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వంభారీగా వెనుకబడింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) స్పష్టమైన ఆధిక్యంతో వచ్చింది. ఇలాగే కొనసాగితే, వామపక్షాలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేని చారిత్రక ఘట్టం నమోదవుతుంది. ఈ క్రమంలో తిరువనంతపురంలోని కాంగ్రెస్ కార్యకర్తలు ఇప్పటికే సంబరాలు ప్రారంభించారు. ఒకప్పుడు జాతీయ రాజకీయాల్లో వామపక్షాలది కీలక పాత్ర. 1996లో సీపీఎం అగ్రనేత జ్యోతి బసు యునైటెడ్ ఫ్రంట్ తరఫున ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినా, పార్టీ పొలిట్‌బ్యూరో ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. దీనిని ఆయన తర్వాత చారిత్రక తప్పిదంగా అభివర్ణించారు. 2008లో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూ పీఏ ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకోవడంతో ప్రభుత్వం పార్లమెంటులో విశ్వాస పరీక్షను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ సమయంలో పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర ఇలా మూడు రాష్ట్రాల్లో లెఫ్ట్ పార్టీలు అధికారంలో ఉన్నాయి. భారత రాజకీయాల్లో కమ్యూనిస్టులది సుదీర్ఘ, ప్రభావవంతమైన చరిత్ర. 1957లో కేరళలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వంగా ప్రపంచ రికార్డు సృష్టించారు. ఇక, పశ్చిమ బెంగాల్‌లో 1977 నుంచి 2011 వరకు ఏకధాటిగా 34 ఏళ్లు పాలించి, దేశంలోనే సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న పార్టీగా చరిత్రకెక్కారు. జ్యోతి బసు ఒక్కరే 23 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. త్రిపురలోనూ 1993 నుంచి మాణిక్ సర్కార్ నేతృత్వంలో వరుస విజయాలు సాధించి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. గత దశాబ్ద కాలంగా వామపక్షాల ప్రాభవం క్రమంగా తగ్గుతూ వచ్చింది. సింగూర్, నందిగ్రామ్ భూసేకరణ ఉద్యమాల నేపథ్యంలో 2011లో పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ చేతిలో లెఫ్ట్ ఫ్రంట్ అధికారాన్ని కోల్పోయింది. ఆ తర్వాత 2018లో బీజేపీ ప్రభంజనంలో త్రిపుర కోట కూడా బద్దలైంది. దీంతో కేరళ ఒక్కటే వామపక్షాలకు చివరి ఆశగా మిగిలింది. 2021లో రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చి పినరయి విజయన్ సంచలనం సృష్టించారు. అయితే, తాజా ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా ఉండటంతో వామపక్షాల పాలన శకం తాత్కాలికంగా ముగింపు దశకు చేరుకున్నట్లేనని రాజకీయ పండితులు పేర్కొంటున్నారు.






## హార్ముజ్‌లో ట్రంప్ ఆపరేషన్ ఫ్రీడమ్

**వాషింగ్టన్, మే 4:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హార్ముజ్ జలసంధిలో చిక్కుకున్న విదేశీ వాణిజ్య నౌకలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు ప్రాజెక్ట్ ఫ్రీడమ్ పేరుతో ప్రత్యేక ఆపరేషన్ చేపడుతున్నట్లు వెల్లడించారు. సోమవారం నుంచే ఈ ఆపరేషన్ ప్రారంభమయిందని తెలిపారు.ట్రూత్ సోషల్ వేదికగా ఈ విషయాన్ని ప్రకటించిన ట్రంప్ ఈ వివాదంతో ఏమాత్రం సంబంధం లేని అనేక దేశాల నౌకలు అక్కడ చిక్కుకుపోయాయని పేర్కొన్నారు. వారిని "అమాయక బాధితులు"గా అభివర్ణించారు. ఆ నౌకల్లోని సిబ్బంది వద్ద ఆహారం, నిత్యావసరాలు అడుగంటుతున్నాయని, ఇది పూర్తిగా మానవతా దృక్పథంతో చేపడుతున్న చర్య అని వివరించారు. ఈ ఆపరేషన్‌కు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) పూర్తి మద్దతు ప్రకటించింది. గైడెడ్‌మిసైల్ డిస్ట్రాయర్లు, 100కు పైగా విమానాలు, 15,000 మంది సైనికులు ఇందులో పాల్గొంటారని తెలిపింది. ఇదే సమయంలో, ఈ మానవతా సహాయక చర్యలకు ఎవరైనా అడ్డుతగిలితే తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని ట్రంప్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్‌తో తమ ప్రతినిధులు చాలా సానుకూల చర్చలు జరుపుతున్నారని ట్రంప్ పేర్కొనడం గమనార్హం. కొన్ని రోజుల క్రితమే ఇరాన్ ప్రతిపాదించిన 14సూత్రాల శాంతి ప్రణాళికను ట్రంప్ ఆమోదయోగ్యం కాదని తోసిపుచ్చారు. తాజా పరిణామాలపై స్పందించిన ఇరాన్, హార్ముజ్ జలసంధిలో అమెరికా జోక్యాన్ని కాల్పుల విరమణ ఉల్లంఘనగా పరిగణిస్తామని హెచ్చరించింది.

# ప్రేమజంట ఆత్మహత్య

● కడపలో యువకుడు.... చెన్నూరులో యువతి

**కడప క్రైమ్, మే 4 ప్రభాతవార్త:** వారిరువురు చెన్నూరు ప్రాంతానికి చెందిన వారే. ఇరువురు కులాలు వేరైనా ఒకే స్కూల్లో చదివారు… ప్రస్తుతం కడప బాలాజీ నగర్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బిఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. యువ జంట తరువాత గత కొన్ని సంవత్సరాలుగా ఒకరినొకరు ప్రేమించు కున్నారు ఈ నేపథ్యంలో ఉన్నట్లుండి ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈనెల 3వ తేదీన తబంధువుల వివాహానికి వెళ్లి వచ్చారు. యువకుడు కడప నగరంమృత్యుంజయ కుంటలోని బాబాయ్ ఇంటికి వెళ్లి ఉన్నాడు. తరువాత ఇంటిలో ఉరేసుకునిఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకుని యువతి మనస్తాపా నికి గురైచెన్నూరులోని తమ ఇంటికి వచ్చి సోమ వారం ఉదయం ఇంటిలో ఎవరూ లేనిసమ యంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో ఈ సంఘటన కడప నగరంతో పాటు చెన్నూరు, జిల్లాలో సంచలనం కలిగించింది. ఈ సంఘటనపై కడప చిన్నచౌక్. చెన్నూరు పోలీసుల తెలిపిన వివరాలిలా వున్నాయి. కడప జిల్లా చెన్నూరులోని లక్షి మ్నగర్కు చెందిన గిరిరాజు కుమారుడు యోగేంద్ర కుమార వర్మ(20), గోదిన వీధికి చెందిన హేమశ్రీ(19) ఇరువురు పరస్పరం కొన్ని సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరు ప్రస్తుతం కడప నగరంలోని బాలాజీ నగర్ పరిధిలో వున్న ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఆదివారం ఇద్దరు కలిసి కడపలో జరిగిన ఓ వివాహానికి కూడా హాజరయ్యారు. తరువాత కడపలోని మృత్యుంజ యకుంట సమీపంలో యోగేంద్ర తన బాబాయ్ ఇంటికి వెళ్లాడు. హేమశ్రీ చెన్నూరులోని తన ఇంటికి వచ్చింది. సెల్‌ఫోన్‌లో ఒకరినొకరు మాట్లాడుకున్నారు. యోగేంద్ర కోపంతో సెల్‌ఫోన్‌తో తన తలకేసి కొట్టుకున్నాడు. తరువాత కొంతసేపటికి తన చిన్నమ్మ ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై చిన్నచౌక్ పోలీసులు మృతుని తండ్రి. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నచౌక్ ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలియజేశారు. ఈసంఘటనను తెలుసుకున్న యువతి హేమశ్రీ. యోగేంద్ర మృతదేహాన్ని చూసేందుకు వెళ్లింది. తరువాత తీవ్ర మనస్థా పానికి గురైంది. అక్కడినుండి తన ఇంటికి వెళ్ళినా యువతి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహా లను కడప రిమ్స్ లోని మార్చురీకి తరలించారు. ఇరువురి బంధువుల ఫిర్యాదు మేరకు కడప చిన్నచౌక్, చెన్నూరు పోలీస్ స్టేషన్లలో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సంబంధిత పోలీసు అధికారులు తెలిపారు.

# బంగ్లా సరిహద్దుల్లో సాయుధ పహారా

### అసోం, బెంగాల్‌లో బిజెపి గెలుపు నేపథ్యంలో పహారా పెంపు

### చొరబాట్ల నిరోధానికి నిరంతర నిఘా

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** అసోం, బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి గెలుపొందడంతో ఈ రెండు రా ష్ట్రాలకు ఆనుకుని వున్న బంగ్లాదేశ్ సరిహద్దుల్లో సాయుధ పహారాను పెంచారు. బంగ్లా దేశ్ సరిహద్దుల్లో బిఎస్ఎఫ్ పహారా కొన సాగుతుండగా ఇప్పుడు ఈ పారా మిలటరీ బలగానికి తోడుగా రెండు రాష్ట్రాలకు చెందిన సాయుధ పోలీసులు సహాయంగా వుంటారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ ఆదేశాలు జారీ చేసింది. బెంగాల్, అసోంలలో బిజెపి గెలుపొందితే బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి చొరబాట్లు ఇక కష్టమని బంగ్లాలో అధికార పార్టీకి చెందిన ఓ ఎంపి ఇటీవల సోషల్ మీడియా వేదికగా ప్రకటించడం వైరల్‌గా మారడం తెలిసిందే. బంగ్లాదేశ్ ఎంపి ప్రకటన ఎలా వున్నా ఆ దేశం నుంచి అసోం, బెంగాల్ రాష్ట్రంలోకి చొరబాట్లను పూర్తిగా నిరోధించేందుకు కేంద్రం నిర్ణయించి, ఈ బాధ్య



తలను బిఎస్ఎఫ్‌కు అప్పగించింది. ఈశాన్య రాష్ట్రాలకు బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు ఈనాటిది కాదనేది తెలిసిందే. బంగ్లాదేశ్ విముక్తి జరిగినప్పటి నుంచి ఈ సమస్య వుండడం విదితమే. అయితే మూడు దశాబ్దాలుగా బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ పరిస్థి తులు, నిరుద్యోగ సమస్య వెరసి భారత్‌లోకి ఆ దేశం నుంచి లక్షల సంఖ్యలో చొరబాట్లను పెంచసాగింది. బంగ్లాదేశ్ నుంచి ఎక్కువగా అస్సాంలో చొరబాట్లు జరుగుతుండగా ఆ తరువాత బెంగాల్‌లో వుంటో ందని కేంద్ర హోం శాఖ గణాంకాలు చెబుతున్నాయి. మొదట అస్సాం, బెంగాల్‌లోకి వస్తున్న బంగ్లాదేశ్ చొరబాటు దారులు ఆ తరువాత భారత్ లోని ఇతర నగరాలలో తిష్ట వేస్తూ తప్పుడు పత్రాలతో ఇక్కడి పౌరులుగా చెలామణి అవుతూ ప్రభుత్వ వ్యవస్థలను అపహాస్యం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలలోని పలు ప్రాంతాలలోనూ పెద్ద సంఖ్యలో బంగ్లాదేశీయులు అక్రమంగా వుంటున్నట్లు కేంద్ర హోం శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఇదే అంశంపై బిజెపి అస్సాం, బెంగాల్ ఎన్నికల్లో ప్రచారం చేసింది. ఎన్నికల వేళ ఈ రెండు రాష్ట్రాలలో గల బంగ్లాదేశ్ సరిహద్దులో బిఎస్ఎఫ్ బలగాలు నిరంతరం పహారా కాశాయి. ఎన్నికల అనంతరం బంగ్లాదేశ్ సరిహద్దులో కఠిన నిఘా కొనసాగించాలని, ఆ దేశం నుంచి ఒక్కచొరబాటు కూడా వుండకూడదని కేంద్రం బిఎస్ఎఫ్‌ను ఆదేశించింది. ఎన్నికలవేళ, ఆ తరువాత బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు పెరిగి దీని ద్వారా అస్సాం, బెంగాల్‌లలో హింస జరిగే వీలుందని నిఘా వర్గాలు సమాచారం ఇవ్వడంతో బిఎస్ఎఫ్ పహారాను మరింత కట్టుదిట్టం చేసింది.

**అసోం, బెంగాల్‌లలో బంగ్లాదేశీయులను వెనక్కి పంపేందుకు కేంద్రం నిర్ణయం:** ఇదిలావుండగా అసోంతో పాటు బెంగాల్‌లో ఇంతకాలం అక్రమంగా వున్న బంగ్లాదేశ్‌కు చెందిన వారిని గుర్తించి వెంటనే వెనక్కు పంపేందు కు కేంద్రం నిర్ణయించినట్లుగా సమాచారం. ఇటీవల జరిగిన ఓట్ల తొలగింపులో ఈ రెండు రాష్ట్రా లలో అక్రమంగా వుంటున్న బంగ్లాదేశ్‌కు చెంది న వారు అనేక మంది వున్నట్లు నిర్ధారణ అయినట్లు తెలిసింది. వీరిని వారి స్వదేశానికి వెనక్కు పంపేందుకు కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయంలో బంగ్లాదేశ్ ప్రభుత్వానికి సమాచారం ఇచ్చిన తరువాత వారిని వెనక్కు పంపాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిసింది.

వార్త

ఏమైనా సాధించడానికి మీ వద్ద సమయం అంటూ ఉండదు. అందుకే సమయాన్ని కల్పించుకోవాల్సి ఉంటుంది.

న- చార్లెస్ బక్స్‌టన్

# మార్పు కోసం తీర్పు!

పంచరాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలుమార్పు కోరుతూ స్పష్టమైన తీర్పునిచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు బలంగా పనిచేసింది. కేరళం, తమిళనాడు, పశ్చిమబెంగాల్, రాష్ట్రాలలో ప్రభుత్వాలు నడిపే పార్టీలు మారుతున్నాయి. ఓట్ల లెక్కింపులో ఆది నుంచీ ఈ ట్రెండ్ కొనసాగింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆధిపత్యంలో ఉండి తమకు కొరకరాని కొయ్యలుగా ఉన్న ముఖ్యమంత్రులు ఎంకె స్టాలిన్, మమతా బెనర్జీల నుంచి ప్రభుత్వాలను మార్చాలని భారతీయ జనతాపార్టీ అగ్రనేతలు భావించారు. అదే దిశగా ఆ రెండు రాష్ట్రాలపై ప్రచార పర్వంలో ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు ఆయా రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీకి ప్రాణప్రతిష్ట చేయాలనే తపనతో ప్రత్యేక వ్యూహరచన చేశారు. ఆ మేరకు ఒక్క పశ్చిమ బెంగాల్ లో మాత్రమే వారి పాచిక పారింది. అసోంలో తిరిగి బిజెపికే జనం పట్టం కడతారని ముందుగా ఊహించినదే జరిగింది. ఇక్కడ కాంగ్రెస్ ఫిరాయింపుదారులు బిజెపిలో చేరి విజేతలయ్యాడంటే ఆ ప్రాంతంలో ఆపార్టీపై విశ్వస నీయత ఎంత ఉందో వేరే చెప్పక్కర్లేదు. కనీసంనాలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారుతున్నాయన్నది సుస్పష్టం. తమిళనాడులో హిందూ వ్యతిరేక ముద్రతో డిఎంకె పలుచబడింది. తొలి విడత కౌంటింగ్ జరుగుతున్న వైఖరిని పసిగట్టగానే డిఎంకె ప్రధాన కార్యాలయం ముందు టెంట్‌లు ఎత్తేసారు. రెండేళ్ల క్రితమే రాజకీయ పార్టీ టివికెని స్థాపించిన విజయ్ అప్రతిహతంగా డిఎంకె సంప్రదాయ ఓటర్లను ఆకట్టుకోవడంలో కృతకృత్యులైనారు. ఈ రాష్ట్రంలో చాలా రౌండ్లు గడిచినా ముఖ్యమంత్రి స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, మరో 23మంది మంత్రులు వెనుకంజలోనే ఉన్నారు. తొలుత అధికార డిఎంకె మూడోస్థానంలో కొనసాగుతూ చివరకు రెండోస్థానంలో స్థిరపడింది. రాజకీయ పార్టీలుస్థాపించిన వెంటనే వచ్చిన ఎన్నికల్లో పోటీ చేసి అధికారాన్ని చేపట్టే సినీనటుల్లో ఎన్టీఆర్ తర్వాత విజయ్‌నే చెప్పుకోవాలి. తాను ఎవరికి సీటిచ్చినా వారికి ప్రజల్లో ఎలాంటి పలు కుబడి లేకపోయినా 'దళపతి బ్రాండ్‌తోనే ఆయన పార్టీ అభ్యర్థులు గెలవడం చెప్పుకోదగిన విషయం. విజయ్ డ్రైవర్ కొడుక్కి విరుంబాక్కం అసెంబ్లీ స్థానం టిక్కెట్టివ్వ గా అతను గెలిచాడు. దీనిని బట్టే తమిళనాట విజయ్'కు ఎలాంటి ఆదరణ ఉందో ఫలితాలుచెప్పాలి.ముఖ్యమంత్రి గా స్టాలిన్ ప్రభుత్వ నిర్వహణలోని లోపాలను కడిగేసిన ప్రసంగాలు చేయకపోయినా విజయ్ విజయతీరాలకు చేరుకున్నాడు. జనం టి.వి.కె పట్ల ఆకర్షితులయ్యారంటే ప్రభుత్వం మీద ఉన్న తీవ్రత ఎంతో అర్థమౌతోంది. గతంలో ప్రభుత్వ నిర్వహణలో మేమే ఘనమంటూ చెప్పుకునే డిఎంకె, ఎడిఎంకెలు ఒకదశలో ద్వితీయ స్థానం కోసం పోటీపడ్డాయి. తమిళనాడు రాజకీయ చిత్ర పటంలో గత ఎన్నికల సంగతులు గమనిస్తే కేవలం ద్రవిడ పార్టీలే అటుఇటుగా వరుసగా ఎన్నికయి రావడం మనకు తెలిసిందే. మొన్నటిసారి డిఎంకె, ఈసారి మళ్లీ ఎఐడిఎంకె వంతు వస్తుదేమోనని కొందరు అంచనా వేశారు. కానీ తన 'జననాయకుడు' చిత్రం ద్వారాతమిళ ప్రజల హృదయాలను కొల్లగొట్టాలనుకున్నా 'విజయ్'కు అడుగడుగునా ఆటంకాలెదురయ్యాయి. కానీ తాజా గెలు పుతో అసలుసిసలు రాజకీయాల్లో జననాయకుడిగా విజయ్ జనహృదయాలకు దగ్గరయ్యారు. రాజకీయాల్లో తగిన అనుభవం లేకపోయినా,జనానికి దగ్గరయ్యేమాధ్య మాలకు దూరం పెట్టినా, జనాకర్షక ప్రసంగాలు జన మందరికీ చేరకున్నా జనం మాత్రం ప్రత్యేకమార్పు కోరు కున్నారన్న విషయం ద్యోతకమవుతుంది. తుది లెక్కింపు లు పూర్తయ్యే సరికి మేజిక్ ఫిగర్ 118దాటకపోతేద్రవిడ పార్టీలను కలుపుకోవాల్సి వస్తుంది. ద్రవిడ నాట టివికె అతిపెద్ద పార్టీగా అవతరించడం దాదాపు ఖాయ మైనట్లే. అయితే ఓటర్లను పలకరించిన ఉచితాలు ఏవీ వారిని లొంగదీసుకోలేకపోయాయి. తమిళనాడు బెంగాల్‌లో ఎగ్జిట్‌పోల్స్‌కు భిన్నంగా ఫలితాలువచ్చాయి. జనం తమ నాడిని బయటకు తెలియచేయకుండా జాగ్రత్తపడ డమే దీనికి కారణం అయిఉండొచ్చు. స్టాలిన్ పోటీ చేసిన కొళత్తూరు నియోజకవర్గంలో ఓటమి చెందారు. టి.వి.కె విజయ్ మాత్రం పోటీ చేసిన రెండు స్థానాల్లో గెలుపొందడం విశేషం. ఎంతో ప్రతిష్టా త్మకంగా జరిగిన ఎన్ని కల్లో నాలుగు రౌండ్ల లెక్కింపు పూర్తవగానే లేచి వెళ్లిపోయే పరిస్థితిలేదు. చివరంటా నరాలు తెగే ఉత్కంఠ ఉండనే ఉంటుంది. తమిళనాడు, బెంగాల్‌లో ఈసారి ఎవరూచెప్పలేనంత ఉత్కంఠ సాగింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ దూకుడుకు కాలగర్భంలో కలిసిపోయిన కమ్యూనిస్టు పార్టీ ఈసారి రెండు సీట్లలో ఆధిక్యత చూసింది. 'ఎస్ఐఆర్' ప్రక్రియ ద్వారా బోలె డన్ని ఓట్లు గల్లంతు చేసిందని మమతాబెనర్జీ ఆరోపిం చింది. ఇంకా ఆమెలోని ఆశ చావలేదు. తరచి చూడగా 'దీదీ చెవిలో బెంగాలీలు పువ్వుపెట్టారనేచెప్పాలి. బెంగాల్ లో ప్రధాన పోటీ టిఎంసి, బిజెపిల మధ్యనే సాగింది. కేరళలో లెక్కింపుపూర్తయ్యేసరికి కాంగ్రెస్ కూటమిమేజిక్ ఫిగర్‌ను దాటింది. 'సింహం సింగిల్‌గానే వస్తుందన్న' రీతిలో విజయ్ ఏ ఇతర పార్టీలతోనూ కలువకుండా సింగల్ పార్టీ వ్యూహంతోనే రంగంలోకి దిగాడు. స్వల్ప మెజారిటీతోనైనా సెంచరీ కొట్టాడు. పశ్చిమ బెంగాల్ విషయంలోనే 'దీదీ' తన పార్టీ మనుగడను దెబ్బకొట్టే ఏ వ్యూహాన్ని అంగీకరించలేదు. 'సర్' పేరిట కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తనను దెబ్బతీసిందని కడదాక ఆగ్రహం వెలిబుచ్చుతూనే ఉన్నారు. ఏదిఏమైనా గెలుపు ఎవరిదైనా ప్రజాస్వామ్యం గెలిచిందనే చెప్పాలి

అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.



ఆస్కార్‌వైల్డ్

కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనబడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.



కె. స్టానిస్లావిస్కి

# ప్రజావాక్కు



### పథకాల పట్ల అవగాహన కల్పించాలి

నేటి సమాజంలో ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన లేక చాలా మంది ప్రజలు సంపాదించిన సొమ్మును మొత్తం ప్రైవేట్,ప్రభుత్వ ఆసుపత్రులలో ధారపోస్తున్నారు. మనకు కావలసిన పథకాలుఏమున్నాయి. మన కుటుంబానికి కావలసిన ప్రభుత్వ పథకాల అవసరాలు ఏమున్నాయి అని ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అవకాశం ఉన్న ప్రతి ఒక్క పథకానికి మనం దరఖాస్తు చేసుకుని ఉంటే ఏ సమయంలోనైనా ఉపయోగపడే అవకాశం. కావున కేంద్రరాష్ట్ర ప్రభుత్వనికి సంబంధించిన పథకాలను గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేస్తేనే కొంత మెరుగుపడే అవకాశం ఉంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### డేటింగ్ యాప్‌లు

ఈ డిజిటల్ యుగంలో ప్రేమ, స్నేహం, సంబంధాలు కనుగొనడంసులభమైంది. టిండర్, బంబుల్, హింజ్ వంటి డేటింగ్ యాప్‌లు స్వైప్ చేసి మ్యాచ్ అయితే చాలు – ప్రేమ కథ మొదలవుతుందని యువత భావిస్తోంది. కానీ వాస్తవంభిన్నం. ఈయాప్‌లు డేంజర్‌గా మారుతున్నాయి. క్యాట్‌ఫిషింగ్, ఫైనాన్షియల్ స్కామ్‌లు, సెక్స్‌టార్షన్, స్టాకింగ్, హరాస్‌మెంట్ నుంచి మర్డర్ వరకు – డేటింగ్ యాప్‌లు నేరస్థులకు హంటింగ్ గ్రౌండ్‌గా మారాయి. తెలంగాణలోనే 2025లో 569 మంది డేటింగ్ యాప్ స్కామ్‌లకుబలై, సుమారు3కోట్లరూపాయలుకోల్పోయారు. ఇది కేవలం అంకెలుకాదు – యువత భవిష్యత్తు, మానసిక ఆరోగ్యం, భద్రతపై ముప్పు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డేటా ప్రకారం, 2025లో డేటింగ్ యాప్ ఫ్రాడ్‌లు గణనీయంగా పెరిగాయి.

- ఎల్లబోయిన వెంకటేశ్వర్లు, హైదరాబాద్

### అలవాట్లు మార్చుకోవాలి

ఆధునిక సమాజం ఎంతో పురోగమిస్తున్నకొద్దీ రోగాలు కూడా ముసురుకుంటున్నాయి. సామాన్యుడి నుండి కోటీశ్వరుడి వరకు జీవనశైలి వ్యాధుల బారిన పడుతున్నారు. పాతకాలం రోజులే బాగుండే అని. తాత ముత్తాతలను గుర్తుచేసుకొంటున్నారు. కానీమారిన జీవన శైలిని మార్చుకొనేందుకు ఇష్టపడట్లేదు. మనం తినేఆహారం, తాగే పానీయాలు, శారీరక శ్రమ తగ్గడం, వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం, ప్లాస్టిక్ భూతం, మద్యపానం ధూమపానం లాంటి వ్యసనాలు ఆరోగ్యాన్ని కాటేస్తున్నాయి.

-టి. మురళీ మోహన్, హైద్రాబాద్

### సేంద్రియ పద్ధతే మేలు

ఉత్తరాంధ్రకు చెందిన చిన్న గ్రామంలో భూసారాన్ని కాపాడగలిగేసేంద్రీయ పద్ధతిలో వ్యవసాయాన్ని చేపట్టాలి. వాస్తవంగా రసాయన ఎరువుల సాగుపై పూర్తి ఆధారంతో మనకు వచ్చిన ఉత్పత్తులవల్ల వాటి పోషక విలువలు తగ్గిపోయాయని, తిన్న ఆహారం శరీరానికి పటిష్టత లేదని నమ్ముతున్నారు. రైతు వల్లే పంట మూలం గనుక రైతులను ఆదుకోవాలి. అసలైన భూసారపరిరక్షణ వారికితృప్తి. విశ్వాసం కలిగేలా శాఖాధికార్లతో పాటు గ్రామపెద్దలు, వ్యవసాయ నిపుణులు, విద్యావేత్తలు కలిపి చెప్పడం మంచి పని. మన భావి ఆరోగ్యం ,భూసార రక్షణ ఇప్పుడు అత్యంత అవసరం.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### వైద్య సౌకర్యాలు కల్పించాలి

రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులకు పెన్షనర్లకు ప్రత్యేకంగా నగదు రహిత ఆరోగ్య భీమాపథకం ప్రవేశపెట్టడం చాలా సంతోషకరమైన విషయం. దీనివలన దాదాపు 8లక్షల మందికి లబ్ధి జరుగుతుందని తెలుస్తున్నది. ఇదే రీతిలో సింగరేణి డిటైర్డ్ ఉద్యోగులకు కూడా ఉచిత వైద్యసౌకర్యాలు కల్పించాలని గత సంవత్సరాలుగాకోరుతూనేఉన్నాం. ప్రస్తుతంనలభైవేల రూపాయల చెల్లింపుతో జీవితాంతం భార్యాభర్తలు ఇరువురికి కలిపి 8 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. అయితే కొన్ని దీర్ఘకాల వ్యాధులకు ఉచితంగానే వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నారు. సింగరేణి దవాఖానాలలో ఉచితంగా అవుట్ పేషంట్ వైద్యసౌకర్యాలు అందిస్తున్నారు. దినదినంపెరుగుతున్న వైద్య ఖర్చులతో కొత్తగా పుట్టుక వస్తున్న రోగాలకు ఈ ఎనిమిది లక్షలు సరిపోవడం లేదు ఫలితంగా సరియైన వైద్యం కోసం తల్లడిల్లి అల్లాడిపోతున్నారు.

- డి. రాంచందర్ రావు, హైదరాబాదు

### తీరు మారాలి

తాము తిని తినక కష్టపడి సంపాదించి పిల్లలని చదివించి వారికీ పెళ్లిళ్లు చేసి ఇంకా వారి భవిష్యత్తు మీద భయంతో తమ ఆస్తిపాస్తులన్నీ వారి పేరుమీద రాసి జీవిత చరమాంకంలోతమని ఆదరిస్తారనుకున్న తల్లిదండ్రుల ఆశలను అడియాసలు చేస్తూ ఆస్తి, డబ్బు తమకు దక్కగానే వారిని ఇంటి నుండి గెంటేస్తున్నారు. ఇంకొందరేమో అనాధాశ్రమాలలో చేర్పిస్తున్నారు. కొందరు తనయులు అన్ని తమ పేరు మీద రాయించుకొని ముసలి తల్లిదండ్రులను కనీస మానవత్వంమరిచి రోడ్డుపక్కన వదిలేస్తున్నారు. వారు ఇప్పటికైనా కళ్ళుతెరిచి తల్లిదండ్రుల కన్న వారి రుణం తీర్చుకోవాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సాక్ష్యాల కోసం సమాధులే తవ్వాలా?

ప్రస్తుతం దేశమంతా ఆధార్ ఒక ప్రామాణిక గుర్తింపు పత్రంగా మారింది. బ్యాంకు ఖాతాలు, మరణ నమోదు వంటి అంశాలు రెండూ ఆధార్ తో అనుసంధానించబడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒక వ్యక్తిమరణం రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాగానే, ఆ సమాచారం ఆ వ్యక్తి బ్యాంకు ఖాతాలకు చేరే స్వయంచాలకంగా వ్యవస్థను అభివృద్ధి చేయలేమా అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. ఈ సమస్యలు, ప్రశ్నలు వినటానికి జటిలంగానే అనిపిస్తాయి. కానీ,వ్యక్తులు, వ్యవస్థలు చిత్తశుద్ధితో, మానవతా దృక్పథంతో, ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ ముందుకుసాగితే పరిష్కారం అసాధ్యంకాదు. మరొక జీతూముండా ఉదంతం పునరావృతంకాదని ఆశిద్దాం.



కృష్ణబాలాజి పల్లపోతు

పాలకులు చేసే చట్టాలు, సంస్కరణలు, నిబంధనలు ఏవైనా ప్రజలకు ప్రయోజనాలు కలిగించేలా ఉండాలి తప్ప ఇబ్బందులు కష్టనష్టాల పాలు చేయకూడదు. కొన్ని సందర్భాల్లో ఈ నిబంధనల వల్ల ఎన్నో ఇక్కట్లకు గురవుతున్నారు. ఇటీవల ఒడిషా కియోంఝోర్ జిల్లాలోనిగ్రామీణ బ్యాంకుశాఖలో జరిగిన సంఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కల్రా ముండా అనే గిరిజన మహిళ 2026 సం॥జనవరిలో మరణించింది. అంతకు ముందు సుమారు రూ.19వేల మొత్తాన్ని తన బ్యాంకుఖాతాలో జమచేసింది. ఆమెకు ఇతర వారసులెవరూ లేకపోవడంతో, ఆమె సోదరుడు జీతూముండా ఆ సొమ్ము తీసుకోవడానికి బ్యాంకు వారిని సంప్రదించాడు. వారు,ఖాతాదారు స్వయంగా రావాలనే షరతు పెట్టారు. ఒకవేళ ఆమె మరణించినట్లైతే ధృవీకరణ పత్రాలు, వారసత్వ ఋజువు సమర్పించాలని సూచించారు. బ్యాంకు, సంబంధిత రెవెన్యూ కార్యాలయాల చుట్టూ అనేకసార్లు తిరిగినా, కావలసిన పత్రాలు తీసుకురావడం నిరక్షరాస్యుడైన జీతూకు సాధ్యం కాలేదు. ఎటూ తోచలేదు. జీతూ తనసోదరి సమాధిని తవ్వి, అస్థిపంజరాన్ని బయటకు తీసాడు. దానిని ఒక గోనె సంచిలో చుట్టి భుజాన వేసుకుని, సుమారు 3 కిలోమీటర్ల దూరం నడిచి బ్యాంకుకు చేరుకున్నాడు. అక్కడ తన అక్క మరణానికి ఇంతకంటే సాక్ష్యం తన వద్ద లేదంటూ,డబ్బు విడుదల చేయాలని బ్యాంకు వారిని ప్రాధేయపడ్డాడు. ఈ అనూహ్యమైన సంఘటన తరువాత పోలీసులు, జిల్లా పరిపాలన యంత్రాంగం, బ్యాంకు అధికారులు జోక్యం చేసుకోవడంతో అస్థిపంజరాన్ని మళ్లీ సమాధి చేయడం, కావలసిన పత్రాలు జారీ చేయడం, ఖాతాలో ఉన్న మొత్తాన్ని విడుదల చేయడం, జిల్లా పరిపాలన యంత్రాంగం నుండి అదనంగాఆర్థిక సహాయం అందించడం వంటి పనులన్నీ చకచకా జరిగిపోయాయి. సభ్యసమాజం తలదించుకునేలా చేసిన విషాద పర్వం కేవలం జీతూతోనే ప్రారంభం కాలేదు,అంతం అవ్వదు కూడా! దేశవ్యాప్తంగా వెలుగులోకి రాని ఇటువంటి ఉదంతాలు ఎన్నో. ఒక్కొక్క దయనీయ గాథ ఒక్కో రకంగా ఉంటుంది. ప్రతి ఉదంతమూ భవిష్యత్ సంఘటనలకు పరిష్కారం చూపాల్సి ఉంటుంది. లేకుంటే అనాగరిక సమాజంలో అమాయకులకు న్యాయం దక్కదు. ఈ ఘటనతో ఒక ప్రధానమైన ప్రశ్న తలెత్తుతోంది దీనికి బాధ్యులు ఎవరు? ఈ ఉదంతాన్ని క్షుణ్ణంగా విశ్లేషిస్తే ఏ ఒక్క వ్యవస్థను, అధికారిని దోషిగా నిలబెట్టడం సరైంది కాదు. తిలా పాపంతలా పిడికెడు అన్నట్టు, ఎన్నో సంస్థాగత, వ్యక్తిగత, సమన్వయ లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. వాటి పరిష్కారానికి ఔచిత్య ముగింపు వెదుక్కోవాల్సి ఉంటుంది. ప్రజల డిపాజిట్లతో వ్యాపారం చేస్తున్న బ్యాంకులు, ఆ సొమ్ము భద్రతకుతగిన చర్యలు తీసుకోవడాన్ని ఎవరూ ఆక్షేపించరు. నిబంధనల ప్రకారం బ్యాంకు సిబ్బంది కొన్ని పత్రాలు తీసుకురావాలని కోరడం సమంజసమే. అయితే, పిడుక్కీ బియ్యానికీ ఒకే మంత్రం ఉండకూడదు. రూ.5వేల చిన్న మొత్తాన్ని, రూ.50 లక్షల భారీ మొత్తానికి సంబంధించిన వ్యవహారాన్నీ ఒకే దృష్టితో చూడటమే సబబుగా లేదు. సమంజసం కాదు. ఆర్థికంగా, సామాజికంగా బలహీన వర్గాలకు చెందిన వారి విషయంలో,స్వల్పమొత్తాల విషయంలో కొన్ని వెసులుబాట్లు, సడలింపులు కల్పించాలి. ఉదాహరణకు బ్యాంకు అధికారులు క్షేత్ర సందర్శన చేసి పంచానామాలతో మరణాన్ని ధృవీకరించుకోవడం, రెవెన్యూ యంత్రాంగంతో సమన్వయం ఏర్పరచుకుని వారసత్వాన్ని నిర్ధారించుకోవడం వంటి చర్యలు నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి కొండంత ఊరటనిస్తాయి. అయితే, ఈ సడలింపులు బ్యాంకు శాఖ పరిధిలో



ఉండవు. ఉన్నతస్థాయిలో విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలి. వాటిని కట్టుదిట్టంగా అమలు చేసే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. అలాగని, శాఖసిబ్బంది చేతిలో ఏమీ ఉండదనుకోవడం పొరపాటే. నిరక్షరాస్యులు, నిరుపేదలు, గిరిజనులు వంటి వారితో లావాదేవీలు జరిపేటప్పుడు,నిబంధనలు పాటిస్తూనే మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. ప్రస్తుత సంఘటనలో వాస్తవంగా ఏం జరిగిందన్న దానిపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. సాధారణంగా ఇటువంటి ఖాతాదారులకు ఓపిగ్గా బ్యాంకు నిబంధనలు వివరించడం, వారికి ధైర్యం చెప్పడం, పరిష్కారాలు సూచించడం, తమ పరిధిలో ఉన్నంతవరకు సహాయం చేయడం, అవసరమైతే జిల్లా పాలనాయంత్రాంగాన్ని నేరుగా సంప్రదించడంవంటివి సిబ్బంది విధుల్లో భాగమే. అలా వ్యవహరిస్తే ఇటువంటి సంఘటనలు చాలా వరకూ అరికట్టవచ్చు. అయితే సమయాభావం, పని ఒత్తిడి, సిబ్బంది కొరత, టార్గెట్లు వంటి ఎన్నో ఇబ్బందుల్ని సహిస్తూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వహించే బ్యాంకు సిబ్బంది పరిస్థితి కూడా గమనించాలి. అటువంటి సమస్యలను బ్యాంకుల యాజమాన్యాలు, ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలి. అయితే, కొన్నిసందర్భాల్లో సంఖ్యాపరమైన లక్ష్యాలు సాధించే అత్యుత్సాహం మాటున మానవీయకోణం మరుగునపడిపోతుంది. పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రిత్వశాఖ అందజేసిన సమాచారం ప్రకారం, జనవరి 2026 నాటికి 'మదుపుదా రుల విద్య, అవగాహన నిధి'లో రూ. 72వేల కోట్లకు పైగాపేరుకుపోయి ఉంది. బ్యాంకు డిపాజిట్లలో పదిసంవత్సరాలకు పైగా ఖాతాదారులకు గాని, వారి వారసులకు గాని చెల్లించబడకుండా ఉన్న మొత్తాన్ని ఈనిధిలో జమచేస్తారు. ఈ మొత్తాన్నిసరైన పత్రాలు జమచేసి ఎప్పుడైనా తిరిగి పొందవచ్చు. ఈ నిధిని ఖాతాదారుల్లో ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు లావాదేవీల పట్ల అవగాహన పెంపు వంటి కార్యక్రమాలకు వినియోగిస్తారు. ఇంత పెద్దమొత్తంఇలా పోగుపడిఉండటం వ్యవస్థలోనిలోటుపాట్లను స్పష్టంచేస్తుంది. ఎంత మంది జీతూముండాలకు చెందవలసిన సొమ్ము ఇలా నిస్తేజంగా, నిష్క్రియాపరంగా పడివుంది? ఎంతమంది తమ సన్నిహితుల ఖాతాల్లో ఉన్న చిన్నచిన్న మొత్తాలను తిరిగి పొందడంలో ఎన్నెన్ని ఇబ్బందులు పడుతున్నారు?ఈదుస్థితి ఏర్పడటానికి గల ప్రధాన కారణాలలో, ఖాతాలకు నామినేషన్ లేకపోవడం ఒకటి. ఖాతాలో నామినేషన్ ఉంటే, నామినీ మరణించిన వారి ఖాతాలో ఉండే మొత్తాన్ని సులభంగా పొందవచ్చు. కేవలం మరణధృవీకరణ, కేవైసి పత్రాలుపొందు పరిస్తే సరిపోతుంది. నామినేషన్ లేకపోతే మాత్రం ఈ ప్రక్రియ కొద్దిగా శ్రమతో కూడుకున్నది సాధారణంగా, మరణ ధృవీకరణ, కేవైసీ పత్రాలతో పాటు వారసత్వగుర్తింపు, ఒకరి కంటే ఎక్కువ వారసులు ఉండి ఒక్కరే దరఖాస్తు చేసుకుంటే మిగిలినవారి నుండి త్యాగపత్రం, పూచీకత్తు వంటివి కూడా అవసరమవుతాయి. ఖాతాలో ఉన్నమొత్తం, ఆస్తి స్వభావం తనఖాలో ఉన్ననగలు, లాకర్లలో ఉన్న చరాస్తులు వంటి వాటిని బట్టి ఈప్రక్రియలో స్వల్పమార్పులు ఉంటాయి. మరణించింది ప్రవాస భారతీయుడైతే మరికొన్ని పత్రాలు అవసరమవుతాయి. సంబంధిత బ్యాంకు వారిని సంప్రదించిపూర్తి వివరాలు తెలుసుకోవాలి. ఈప్రక్రియలో ఆలస్యం, ఇబ్బందులు ఏర్పడితే బ్యాంకు ఉన్నతాధికారులను సంప్రదించాలి. ఇంకా పరిష్కారం కాకపోతే, బ్యాంకింగ్ అంబుడ్స్‌మాన్‌ను కూడా సంప్రదించవచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా, ఖాతాదారు మరణించిన వెంటనే ఆ విషయాన్ని బ్యాంకు వారికి లిఖిత పూర్వకంగా తెలియపరిస్తే,బ్యాంకు వారు ఖాతాను స్తంభింపజేస్తారు. తద్వారా అందులో ఉన్న మొత్తానికి పటిష్ఠమైన భద్రత ఏర్పడుతుంది. వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం దేశమంతా ఆధార్ ఒక ప్రామాణిక గుర్తింపు పత్రంగా మారింది. బ్యాంకు ఖాతాలు, మరణ నమోదు వంటి అంశాలు రెండూ ఆధార్ తో అనుసంధానించబడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒక వ్యక్తిమరణం రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాగానే, ఆసమాచారం ఆ వ్యక్తి బ్యాంకు ఖాతాలకు చేరే స్వయంచాలకంగా వ్యవస్థను అభివృద్ధి చేయలేమా అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. ఈ సమస్యలు, ప్రశ్నలు వినటానికి జటిలంగానే అనిపిస్తాయి. కానీ,వ్యక్తులు, వ్యవస్థలు చిత్తశుద్ధితో, మానవతా దృక్పథంతో, ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ ముందుకుసాగితే పరిష్కారం అసాధ్యంకాదు. మరొక జీతూముండా ఉదంతం పునరావృతంకాదని ఆశిద్దాం.

# బయోగ్యాస్ వైపు అడుగులు వేయాలి!

తిప్పర్తి శ్రీనివాస్

ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా వంటి దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు అంతర్జాతీయ మార్కెట్లపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ యుద్ధ వాతావరణం కారణంగా చమురు ధరలు పెరగడం, సరఫరా గొలుసులు దెబ్బతినడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. దీనివల్ల భారతదేశం వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలకు తీవ్ర ఇంధన సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గృహ వినియోగంలో విస్తృతంగా ఉపయోగించే ఎల్పిజి సరఫరాలో కొరత ఏర్పడే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించడం అత్యవసరం. అందులో ముఖ్యంగా బయోగ్యాస్ ఒక సుస్థిరమైన, చౌకైన పర్యావరణానికి మేలు చేసే పరిష్కారంగా నిలుస్తుంది. గ్రామీణ భారతదేశంలో ఇప్పటికే కొంతమేరకు వినియోగంలో ఉన్న బయోగ్యాస్, ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రాముఖ్యత సంతరించుకుంటోంది. బయోగ్యాస్ అనేది పశువుల ఎరువు, వంటింటి వ్యర్థాలు, వ్యవసాయ అవశేషాలువంటి సేంద్రీయ పదార్థాలను క్షయం చేయడం ద్వారా ఉత్పత్తి అయ్యే వాయువు. ఇది ప్రధానంగా మీథేన్ వాయువుతో కూడి ఉంటుంది. దీన్ని వంట ఇంధనంగా ఉపయోగించవచ్చు. ఎల్పిజి స్థానంలో బయోగ్యాస్ వినియోగం పెరిగితే, దిగుమతులపై ఆధారపడే అవసరం గణనీయంగా తగ్గుతుంది. భారతదేశం వంటి వ్యవసాయ ఆధారిత దేశంలో పశుసంపద విస్తృతంగా ఉంది. ప్రతి గ్రామంలోనూ పశువుల ఎరువు సమృద్ధిగా లభిస్తుంది. ఈ వనరులను సమర్థవంతంగా వినియోగిస్తే,ప్రతి ఇంటికీస్వయం సమృద్ధి గల ఇంధన వనరుగా బయోగ్యాస్ మారుతుంది.



ఇది కేవలం ఇంధన సమస్యను మాత్రమే పరిష్కరించదు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేస్తుంది. పర్యావరణ పరిరక్షణ పరంగా కూడా బయోగ్యాస్ కీలక పాత్ర పోషిస్తుంది. ఎల్పిజి వంటి ఫాసిల్ ఫ్యూయల్స్ వినియోగం వలన గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారం పెరుగుతుంది. కానీ బయోగ్యాస్ వినియోగం వల్ల కార్బన్ ఉద్గారాలు తక్కువగా ఉంటాయి. అంతేకాకుండా, బయోగ్యాస్ ఉత్పత్తి ప్రక్రియలో మిగిలే స్లర్రీను సేంద్రీయ ఎరువుగా ఉపయోగించవచ్చు.ఇది భూమి సారాన్ని పెంచడంలోసహాయపడుతుంది. ప్రభుత్వం ఇప్పటికే బయోగ్యాస్ ప్రోత్సాహానికి అనేక పథకాలను అమలు చేస్తోంది. అయితే అవి మరింత విస్తృతంగా ప్రజలకు చేరాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, సబ్సిడీలు అందించడం,సాంకేతిక సహాయం కల్పించడం వంటి చర్యలు తీసుకుంటే, బయోగ్యాస్ వినియోగం వేగంగా పెరుగుతుంది. పట్టణ ప్రాంతాల్లో కూడా అపార్ట్మెంట్లు, కాలనీలు స్థాయిలో బయోగ్యాస్ ప్లాంట్లుఏర్పాటు చేయవచ్చు. వంటింటి వ్యర్థాలను సక్రమంగా వినియోగించడం ద్వారా స్వచ్ఛమైన ఇంధనం ఉత్పత్తి చేయవచ్చు. ఇది చెత్త నిర్వహణ సమస్యనుకూడా పరిష్కరిస్తుంది. ముఖ్యంగా యువత ఈ దిశగా ముందుకు రావాలి. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి చిన్న స్థాయి బయోగ్యాస్ యూనిట్లు అభివృద్ధి చేయడం, స్టార్టప్‌ల రూపంలో విస్తరించడంవంటి అవకాశాలున్నాయి. ఇది ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తుంది. మొత్తానికి, ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు మనకు ఒక స్పష్ట మైన సందేశాన్ని ఇస్తున్నాయి. ఇంధన రంగంలో స్వయంసమృద్ధి అత్యవసరం. ఎల్పిజి కొరతవంటి సమస్యలు తాత్కాలికంగా ఎదురైనా, దీర్ఘకాలికపరిష్కారం కోసం బయోగ్యాస్ వంటిప్రత్యామ్నాయాలపై దృష్టిపెట్టాలి. ఇది కేవలం అవసరం మాత్రమేకాదు, భవిష్యత్తు తరాలకు మనం అందించాల్సిన బాధ్యత కూడా. ఇప్పటికైనామేల్కొని, బయోగ్యాస్ వినియోగాన్ని ప్రోత్సహించాలి.

# సమన్వయం లేని సిలబస్‌తో కొత్త సమస్యలు

మద్రాపు వసుంధరా దేవి

అక్షరాలు పుస్తకాల్లో ఉంటున్నాయి. కానీ ప్రశ్నలు మాత్రం ఆకాశంలో ఉంటున్నాయి. ప్రస్తుత విద్యా వ్యవస్థలో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలకు, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు మధ్య ఉన్న అగాథాన్ని చూస్తుంటే ఇదే అనిపిస్తుంది. ఒక విద్యార్థి తన పదేళ్ల పాఠశాల విద్యను, రెండేళ్ల ఇంటర్మీడియట్ చదువును ఎంతో శ్రద్ధగా పూర్తి చేసినా, తీరా నీట్ లేదా ఐఐటి,జెయియి వంటి పరీక్షల దగ్గరకు వచ్చేసరికి తాను చదివింది సముద్రంలో కాకి రెక్కంతేనన్న చేదు నిజాన్ని ఎదుర్కోవాల్సివస్తోంది. మన విద్యా బోర్డులు రూపొందించిన సిలబస్ కేవలం ప్రాథమిక అవగాహనకు మాత్రమే పరిమితమవుతుంటే, ప్రవేశ పరీక్షలు మాత్రం అన్వయ సామర్థ్యాన్ని, విశ్లేషణాత్మక ఆలోచనను కోరుతున్నాయి. ఈ రెండింటి మధ్య సమన్వయం లేకపోవడం వల్ల సామాన్య విద్యార్థి సమిధగా మారుతున్నాడు. ఇంటర్మీడియట్ సిలబస్ను క్షుణ్ణంగా చదివిన విద్యార్థి కనీసం మన రాష్ట్ర స్థాయి (ఇఎపిసిఇటి)లోనైనా మెరుగైన ర్యాంకు సాధించలేకపోవడం విద్యావేత్తలను కలవరపరుస్తున్న అంశం. ఈ అంతరాన్నే పెట్టుబడిగా మార్చుకున్న కార్పొరేట్ సంస్థలు 'ఫౌండేషన్' పేరిట ఆరో తరగతి నుంచే విద్యార్థుల బాల్యాన్ని తరగతి గదుల నాలుగుగోడల మధ్య బంధిస్తున్నాయి. ఇక్కడ మరో విచారకరమైన అంశం ఏమిటంటే, ఈ ఫౌండేషన్ కోర్సులలో బోధించే వారిలో అత్యధికులు వృత్తిపరమైన ఉపాధ్యాయ శిక్షణ(బి.ఇడి/ఎం.ఇ) పొందిన వారు కాదు. టీచింగ్ మెథడాలజీపై కనీస అవగాహన లేని, కేవలం బి.టెక్ లేదా ఎమ్ఎస్సీ చదివిన యువకులతో ఈ బోధన సాగుతోంది. వీరికి సబ్జెక్టుపై పట్టు ఉండవచ్చు కానీ, ఒక విద్యార్థి మానసిక స్థితిని అర్థం చేసుకుని, వారి వయస్సుకి అనుగుణంగా విషయాన్ని ఎలా చేరవేయాలో తెలియదు. దీనివల్ల బోధన అనేది ఒక యాంత్రిక ప్రక్రియగా మారి, విద్యార్థులపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని పెంచుతోంది. సృజనాత్మకతకు తావులేని ఈ 'ర్యాంకుల ఫ్యాక్టరీల'లో విద్యార్థులు కేవలం సమస్యలను పరిష్కరించే యంత్రాలుగా మారుతున్నారు. ఈఫౌండేషన్ పాఠశాలల ధోరణి విద్యార్థుల సమగ్ర వికాసాన్ని దెబ్బతీస్తోంది. ఇక్కడ కేవలం మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ,జీవశాస్త్రాలు వంటి సబ్జెక్టులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ, భాషలు,సోషల్ స్టడీస్ను పూర్తిగా విస్మరిస్తున్నారు. దీనివల్ల సాహిత్యం,



చరిత్ర, సామాజిక అంశాల్లో అత్యంత చురుకైన విద్యార్థులు కూడా తాము దేనికీ పనికిరామనే న్యూనతాభావానికి లోనవుతున్నారు. మరీ ముఖ్యంగా, ఈ ఉరుకుల పరుగుల చదువుల్లో 'వ్యాయామ విద్య' అన్న మాటే వినిపించడం లేదు. ఆటపాటలకు ఏమాత్రం అవకాశం లేకపోవడంతో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం క్షీణిస్తోంది. క్రీడలు లేని విద్య కేవలం మెదడును నింపుతుందే తప్ప, శరీరాన్ని బలపరచదు. నేడు పోలీస్, రక్షణ రంగాల ఉద్యోగాల కోసం నిర్వహిస్తున్న శారీరక పరీక్షల్లో అభ్యర్థులు స్పృహ తప్పి పడిపోవడం మనం చూస్తున్నాం. భవిష్యత్తులో దేశ రక్షణకు కావలసిన దృఢమైన యువత కరువయ్యే ప్రమాదం పొంచి ఉంది. కేవలం కుర్చీలకే పరిమితమై పుస్తకాలతో కుస్తీ పట్టే ఈ యువత, క్షేత్రస్థాయిలో శారీరక సవాళ్లను ఎలా ఎదుర్కోగలరు అనేది ఒక పెద్ద ప్రశ్నార్థకం. దీని ప్రభావం నేరుగా ప్రభుత్వ విద్యా సంస్థలపై పడుతోంది. ఒకప్పుడు ప్రతిభావంతులకు చిరునామాగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నేడు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. ప్రవేశ పరీక్షలకు కావాల్సిన ప్రత్యేక శిక్షణ అక్కడ దొరకదన్న ఉద్దేశంతో మెరిటోరియస్ విద్యార్థులందరూ కార్పొరేట్ బాట పడుతున్నారు. స్తోమత లేని వారు నాసిరకం కోచింగ్ సెంటర్లలో చేరి, అటు విద్య అందక, ఇటు కెరీర్ పట్ల స్పష్టత లేక మధ్యలోనే ఆగిపోతున్నారు. ఇది కేవలం ఒక విద్యాపరమైన సమస్య మాత్రమేకాదు, సామాజిక సంక్షోభం కూడా. అందరూ కేవలం ఇంజనీరింగ్, మెడిసిన్ సీట్ల వేటలో పడితే, రేపు విశ్వవిద్యాలయాల్లో ప్రాథమిక శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు చదివి సమాజ హితమైన పరిశోధనలు చేసేవారెవరు? చరిత్రను విశ్లేషించేవారు, సాహిత్యాన్ని ప్రేమించేవారు, సామాజిక మార్పు కోసం తపించే మేధావుల కొరత భవిష్యత్తులో దేశాభివృద్ధిని కుంటుపరిచే ప్రమాదం ఉంది. అందుకే ఇప్పుడు కావాల్సింది నామమాత్రపు మార్పులు కాదు, సమూలమైన సంస్కరణలు. ప్రవేశ పరీక్షల స్థాయికి అనుగుణంగా ప్రభుత్వ పాఠ్యప్రణాళికను ఆధునీకరించాలి లేదా ఆ పరీక్షల క్లిష్టతను మన విద్యా ప్రమాణాలకు తగ్గించాలి. పాఠశాలస్థాయి నుంచే కేవలం బట్టీపట్టడం కాకుండా, విషయాన్ని విశ్లేషించే నైపుణ్యాలను పెంపొందించే విధంగా బోధనా పద్ధతులు మారాలి. విద్యతోపాటు క్రీడలను తప్పని సరి చేయాలి. అప్పుడే విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుంది, తల్లి దండ్రులకు ఆర్థిక భారం తప్పుతుంది. ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రభుత్వ సంస్థల్లోనే ఉంటూ దేశానికి అవసరమైన అన్ని రంగాల్లోనూ రాణించే అవకాశం కలుగుతుంది. అక్షరానికి, ఆశయానికి మధ్య ఉన్న ఈ అడ్డుగోడలను తొలగించడమే నేటి విద్యావ్యవస్థ ముందున్న తక్షణ కర్తవ్యం. ఒక సంపూర్ణ మానవుడిని తయారు చేయాల్సిన విద్య, కేవలం ఒక ప్రవేశ పరీక్షకు సిద్ధం చేసే సాధనంగా మిగిలిపోకూడదు.

# వ్యూహ, ప్రతివ్యూహాల మధ్య 'కమల' వికాసం



సోమవారం కోల్‌కతాలోని బిజెపి కార్యాలయంలో సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

## అటు ప్రభుత్వ వ్యతిరేకత - ఇటు ప్రధాని మోడీ చరిష్మా

**న్యూఢిల్లీ, మే 4:** సోమవారం ఫలితాలు వెలువడిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో పశ్చిమ బెంగాల్ ఎన్నికలు కూడా ఉన్నాయి. దక్షిణ రాష్ట్రమైన తమిళనాడులో నటుడు సి. జోసెఫ్ విజయ్ తన కొత్త పార్టీ అయిన టివికెతో ఆధిపత్య పార్టీలను ఓడించి అనూహ్య విజయం సాధించారు. కేరళలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ, వామపక్ష పార్టీల కూటమిని ఓడించింది. ఒకప్పుడు ఫ్రెంచ్ కాలనీగా ఉన్న స్వయం పరిపాలన ప్రాంతమైన పుదుచ్చేరిలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డియే కూటమి విజయం సాధించింది. ఇక ఈశాన్య రాష్ట్రమైన అసోంలో భారతీయ జనతా పార్టీ భారీ మెజారిటీతో తిరిగి అధికారంలోకి వచ్చింది. అయినప్పటికీ, సోమవారం ప్రకటించిన ఫలితాలలో పశ్చిమ బెంగాల్ ఫలితమే అత్యంత కీలకమైనదని విశ్లేషకులు అంటున్నారు. మతపరమైన ధ్రువీకరణను అవకాశంగా తీసుకుని, అంతర్లీనంగా ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను ఉపయోగించుకుని బిజెపి గెలుపొందిందని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

అంతేగాక ప్రధానమంత్రి నరేంద్రమోడీ చరిష్మా, బిజెపి అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యూహ, ప్రతివ్యూహాలు బిజెపి విజయానికి దోహదపడ్డాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భారతదేశం - న్యూఢిల్లీలో ఒక ఇంటి సహాయకురాలిగా పనిచేసే సీమా దాస్, రాష్ట్ర ఎన్నికలలో ఓటు వేయడానికి సమయానికి ఇంటికి చేరుకోవాలనే ఉద్దేశ్యంతో, రైళ్లు మారుతూ, భారతదేశంలోని పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని తన గ్రామానికి రెండు రోజుల ప్రయాణం చేసింది. 2011 నుండి ఈ తూర్పు భారత రాష్ట్రంలో అధికారంలో ఉన్న మధ్యేవాద రాజకీయ శక్తి అయిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (ఎఐటిఎంసి) పార్టీకే దాస్ గతంలో ఎప్పుడూ ఓటు వేసేది. కానీ ఈసారి, బెనర్జీకి ఉన్న ముద్దుపేరు 'దీదీ' (బెంగాలీలో దీనికి అక్క అని అర్థం) 'ముస్లింలకు అనుకూలంగా ఉంటుంది' అని తన అత్తగారు తనను ఒప్పించారని ఆమె చెప్పింది. హిందూ అయిన దాస్ ఇంకా ఇలా అన్నారు. 'దీదీ దారి తప్పారు, అధికారంలో కొనసాగడానికి కేవలం ముస్లింలను ప్రసన్నం చేసుకుంటున్నారు.

మత బహుళత్వానికి, మైనారిటీ హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చే టిఎంసిపై, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి చెందిన హిందూ మెజారిటీవాద భారతీయ జనతా పార్టీ చాలాకాలంగా ఈ ఆరోపణ చేస్తూ వస్తోంది. కానీ, సాంప్రదాయకంగా నామమాత్రపు పార్టీగా ఉన్న ఈ రాష్ట్రంలో బిజెపి పట్టు సాధిస్తున్నప్పటికీ, 9 కోట్లకు పైగా జనాభా ఉన్న ఈ రాష్ట్రంలో బెనర్జీ, ఆమె పార్టీ 15 ఏళ్లుగా పాలిస్తున్నారు. సోమవారం, ఆ పరిస్థితి మారింది. మోడీ పార్టీ పశ్చిమ బెంగాల్‌ను గెలుచుకుంది. ఏప్రిల్‌లో జరిగినప్పటికీ, మే 4న ఓట్ల లెక్కింపు పూర్తయిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల తొలి ఫలితాలు, బిజెపికి చెందిన సిద్ధాంత వ్యవస్థాపకుడు పుట్టిన ఈ రాష్ట్రంలో, మోడీ పటిష్టమైన ఎన్నికల యంత్రాంగం ఆ పార్టీకి భారీ మెజారిటీని అందించడానికి దోహదపడ్డాయి. అయితే, ఈ రాష్ట్రంలో బిజెపి ఇంతకు ముందెన్నడూ గెలవలేదు. రాష్ట్రంలోని 292 స్థానాలకు గాను బిజెపి 204 స్థానాల్లో గెలుపొందింది. 2021లో బిజెపి అత్యుత్తమ ప్రదర్శన 77 స్థానాలు. మరోవైపు, బెనర్జీకి చెందిన టిఎంసి కేవలం 83 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది.

# 23 రాష్ట్రాల్లో బిజెపి, ఎన్డీయే కూటమిదే అధికారం

## మ్యాప్‌తో ట్వీట్‌చేసిన బిజెపి కేంద్రకమిటీ




**న్యూఢిల్లీ, మే 4:** పశ్చిమ బెంగాల్‌లో బిజెపి గెలుపు నేపథ్యంలో బిజెపి ఎక్స్ వేదికగా మోడీ మయమైన భారత్ అని ట్వీట్ చేసింది. కమలం బెంగాల్‌ను కూడా చేరుకుందని పేర్కొంది. ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు గెలుపు కేవలం విస్తరణ కాదని, ప్రగతిపథంలో సాగేందుకు దేశ ప్రజలు తమపై చూపించిన విశ్వాసానికి ప్రతీక అని రాసుకొచ్చింది. ఉత్తరాది నుంచి ఈశాన్యం వరకు మార్పు కొనసాగుతోందని, ఇప్పుడీ ప్రయాణంలో పశ్చిమ బెంగాల్ అనే అతిపెద్ద అధ్యాయం చేరిందని పేర్కొంది. మనందరం కలిసి 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మిద్దామని ఎక్స్ వేదికగా పిలుపునిచ్చింది. బిజెపి ఒంటరిగాను, మిత్రపక్షాలతోను కలిసి మొత్తం 23 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నట్లు గుర్తుచేసింది. పార్టీ ఒంటరిగా, మిత్రపక్షాలతో కలిసి అధికారంలో ఉన్న రాష్ట్రాలతో మ్యాప్‌ను పంచుకుంది. హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, త్రిపుర, అసోం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, సిక్కిం, బీహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో బీజేపీ, మిత్రపక్షాలు అధికారంలో ఉన్నాయంటూ కాషాయం రంగుతో మ్యాప్‌ను ట్వీట్ చేసింది. దీని ప్రకారం, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఝార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, మిజోరాంలలో బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్నాయి.

# ఎన్నికలవేళ ఆసక్తి రేపిన మోడీ ట్వీట్

**న్యూఢిల్లీ, మే 4:** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల లెక్కింపు ఉత్కంఠగా సాగుతున్న సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా చేసిన ఓ పోస్ట్ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. నైపుణ్యం, కృషి, కరుణ వంటి మానవ విలువల ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఆయన చేసిన ఈ ట్వీట్‌పై భిన్నమైన వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. నైపుణ్యం, శ్రద్ధ, కరుణ అనేవి మన జీవితంలోని అద్భుతమైన శక్తులు. వాటితో మనం ప్రతి సవాలును అధిగమించడమేకాకుండా, మన లక్ష్యాలను కూడా సాధించగలం" అని ప్రధాని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "సమర్థునికి భారం ఏముంటుంది? శ్రమించే వారికి దూరం అనేదిఉంటుందా? బాగా చదువుకున్నవారికి అపరిచిత ప్రదేశం అంటూ ఏదీ ఉండదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న కీలక తరుణంలో ప్రధాని ఈ విధమైన తాత్విక సందేశం ఇవ్వడంపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ జరుగుతోంది. ఇది కేవలం స్ఫూర్తిదాయక సందేశమని కొందరు అంటుండగా, మరికొందరు దీని వెనుక రాజకీయ సంకేతాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు.

# కేరళంలో 13 మంది మంత్రుల ఓటమి

## స్వల్పమెజార్టీతో ధర్మదంలో గట్టెక్కిన సిఎం విజయన్

**తిరువనంతపురం,మే 4:** కేరళం రాజకీయాల్లో అధికార లెఫ్ట్ కూటమికి ప్రజలు గట్టి షాక్ ఇచ్చారు. సిఎం పినరయి విజయన్ నేతృత్వంలోని క్యాబినెట్‌లో మెజారిటీ మంత్రులు ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తాజాగా వెలువడిన ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమికి తీవ్ర భంగపాటు ఎదురైంది. పినరయి క్యాబినెట్‌లోని 21 మంది మంత్రులకు గాను 20 మంది పోటీ చేయగా, వారిలో ఏకంగా 13మంది ఓటమి పాలయ్యారు. తుది ఫలితాలు వెలువడుతున్నతరుణంలో, యూడీఎఫ్ 102 స్థానాల్లో, లెఫ్ట్ కూటమి 35, ఎన్డీయే 3 స్థానాల్లో విజయం సాధించాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధర్మదం స్థానాన్ని నిలబెట్టుకున్నప్పటికీ, ఆయన ప్రజాదరణ తగ్గినట్లు ఫలితాలు స్పష్టంచేస్తున్నాయి. 2021లో 50వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిచిన ఆయన, ఈసారి ఆరో రౌండ్ లెక్కింపు వరకు వెనుకంజలో ఉన్నారు. చివరికి కేవలం 19వేల 400 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో గట్టెక్కారు.

# టివికె విజయానికి మేనిఫెస్టోయే కీలకం!



**చెన్నై, మే 4:** తమిళనాడు ఎన్నికల ఫలితాల్లో తమిళగ వెట్రి కజగం ప్రభంజనం సృష్టించింది. ఆ పార్టీ చీఫ్ విజయ్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో విజయానికి కీలకంగా మారింది. మహిళలు, రైతులు, యువత లక్ష్యంగా అనేక హామీలు ఇచ్చారు. 60 ఏళ్లలోపు ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, ఏడాదికి ఆరు ఉచిత ఎల్పీజీ సిలిండర్లు ఇస్తామని ప్రకటించారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రభుత్వ శాఖ, ప్రత్యేక మహిళా కోర్టులు వంటివి టివికె వాగ్దానం చేసింది. ప్రతి వధువుకు ఒక సావరిన్ బంగారు నాణెం, ఒక పట్టు చీర, తల్లులకు, పుట్టిన శిశువుకు బంగారు ఉంగరం ఇస్తామని హామీ ఇచ్చింది. పాఠశాల మానేసే బాలికల సంఖ్యను తగ్గించడానికి, వారి తల్లులు లేదా సంరక్షకులకు సంవత్సరానికి రూ.15వేలు అందజేస్తామని తెలిపింది. మహిళా స్వయం సహాయక బృందాలకు రూ.5 లక్షల వరకు ఒకేసారి ఆర్థిక సహాయం అందిస్తామని, యువత కోసం మేనిఫెస్టోలో కీలక హామీలను విజయ్ పార్టీ ప్రకటించింది. 12వ తరగతి నుంచి పీహెచ్డీ స్థాయి విద్యార్థులకు రూ.20 లక్షల వరకు పూచీకత్తు లేని రుణాలు ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వ నియామకాలన్నింటికీ ఒక పారదర్శక కాలపరిమితిని వాగ్దానం చేసింది. పట్టభద్రులకు నెలకు రూ.4వేలు, డిప్లొమా హోల్డర్లకు రూ.2,500 నిరుద్యోగ భృతిని కూడా అందిస్తామనిపేర్కొంది. నిరుద్యోగులకు, కార్మికులకు నైపుణ్య శిక్షణతో పాటు ఆదాయ వనరులు సమకూరుస్తామని టివికె హామీ ఇచ్చింది. నైపుణ్య శిక్షణ పొందుతున్న నిరుద్యోగ పట్టభద్రులకు నెలకు రూ.10,000, ఐటీఐ డిప్లొమా హోల్డర్లకు రూ.8,000 అందిస్తామని తెలిపింది. 'సిఎం పీపుల్ సర్వీస్ అసోసియేట్' కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయిలో ఐదు లక్షల మంది యువతకు ఉపాధికల్పిస్తామని ఆపార్టీ వాగ్దానంచేసింది. ఈ ఉద్యోగం ద్వారా వారు నెలకు రూ.18,000 సంపాదిస్తారని పేర్కొంది. సిబ్బందిలో 75 శాతం స్థానికులను నియమించుకునే కంపెనీలకు 2.5 శాతం జీఎస్టీ సబ్సిడీ, విద్యుత్ ఛార్జీలపై 5 శాతం రాయితీ లభిస్తుందని పేర్కొంది.

మరోవైపు విజయ్ తన మేనిఫెస్టోలో రైతులకు గణనీయమైన హామీలు ఇచ్చారు. ఐదు ఎకరాల వరకు భూమి ఉన్నవారికి సహకార వ్యవసాయ రుణమాఫీ, ఐదు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్నవారికి 50 శాతం రుణ మాఫీ చేస్తామని పేర్కొన్నారు. వరికి క్వింటాల్‌కు రూ.3,500, చెరకుకు రూ.4,500 చొప్పున చట్టబద్ధంగా మద్దతు ధరను ప్రకటించారు. కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు రూ.10వేలు అందించడంతో పాటు సాగుదారుల హక్కుల కార్డును ప్రవేశపెడతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలన్నీ పొందేందుకు వీలుగా ప్రతి కుటుంబానికి ఒక పౌర ప్రత్యేకాధికార కార్డు అందిస్తామని టీఎంకే పేర్కొంది. అలాగే అన్ని ప్రభుత్వ సేవలను సకాలంలో అందించడాన్ని చట్టబద్ధం, తప్పనిసరి చేసే సేవా హక్కు చట్టంను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. పౌరులు నేరుగా రాష్ట్ర శాసనసభకు వినతిపత్రాలను సమర్పించవచ్చని పేర్కొంది. వాటిలో 5 లక్షల స్పందనలను చర్చకు స్వీకరిస్తామని, 10 వేల సంతకాలతో కూడిన వినతులకు ప్రభుత్వం నుంచి తప్పనిసరి స్పందన లభిస్తుందని వాగ్దానం చేసింది. మరోవైపు దక్షిణ రాష్ట్రంలోని కార్మికుల నిరంతర డిమాండ్ అయిన పాత పింఛను పథకాన్ని పునరుద్ధరించడాన్ని పరిశీలిస్తానని విజయ్ హామీ ఇచ్చారు.

ఐదేళ్లు పూర్తి చేసుకున్న తాత్కాలిక ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరిస్తామని, పారదర్శక బదిలీ విధానాన్ని అమలు చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది మూలవేతనాన్ని రూ.18,000 నుంచి రూ.25,000కు పెంచడంతో పాటు, 'అధిక ఒత్తిడి భత్యం' కింద అదనంగా రూ.1,000 ఇస్తామని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖ వంటి అనేక హామీలు ఇచ్చారు. ఏప్రిల్ 16న 95 పేజీల మేనిఫెస్టో విడుదల సందర్భంగా విజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తిరువళ్లువర్ రచించిన తమిళ గ్రంథం 'తిరుక్కురళ్'లోని సూత్రాలైన అరం (సద్గుణం), పొరుళ్ (సంపద) ఇన్‌బం (ఆనందం) వంటి వాటిపై ఇది ఆధారపడి ఉందని తెలిపారు. ఈ గుణాలే రాజకీయ, పరిపాలనలకు అత్యవసరమైన అంశాలని తెలిపారు. నిజాయితీతో కూడిన పరిపాలనను తన సిద్ధాంతంగా టీవీకే స్వీకరించింది. మా పార్టీ తొలి ఎన్నికల మేనిఫెస్టో కూడా నిజాయితీకి హామీయే. ప్రస్తుత తమిళనాడు సీఎం (స్టాలిన్) లాగా ప్రజలను మేం తప్పుదోవ పట్టించం. ప్రజలకు ఉత్తుత్తి వాగ్దానాలతో కూడిన తొందరపాటు మేనిఫెస్టోను మేం తయారు చేయలేదు అని ఆయన అన్నారు.

# పాతమిత్రుడే.. సిఎం స్టాలిన్‌ను ఓడించాడు!



**చెన్నై, మే 4:** తమిళనాడు రాజకీయాల్లో ఒక చారిత్రక సంచలనం నమోదైంది. ముఖ్యమంత్రి, ద్రవిడ మున్నేట్ర కళగం (డిఎంకె) అధినేత ఎంకే స్టాలిన్ తన కంచుకోట లాంటి కొళత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటమి పాలయ్యారు. నటుడు విజయ్ స్థాపించిన టివికె పార్టీకి చెందిన సాధారణ అభ్యర్థి వీఎస్ బాబు, ఏకంగా ముఖ్యమంత్రిని 8,795 ఓట్ల తేడాతో ఓడించి అందరినీ ఆశ్చర్య పరిచారు. ఈ విజయం ఒక మామూలు గెలుపు కాదు, 15 ఏళ్ల నాటి అవమానానికి తీర్చుకున్న రాజకీయ ప్రతీకారంగా తమిళనాట చర్చ జరుగుతోంది. బలమైన నేత ముఖ్యమంత్రిని ఓడించిన వీఎస్ బాబు నేపథ్యం ఎంతో ఆసక్తికరం. ఒకప్పుడు ఈయన స్టాలిన్‌కు అత్యంత సన్నిహితుడు, డీఎంకేలో కీలక నేత. 2011లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన కొళత్తూర్ నుంచి స్టాలిన్ తొలిసారి పోటీ చేశారు. అప్పుడు ఉత్తర చెన్నై జిల్లా ఇన్‌చార్జ్‌గా ఉన్న వీఎస్ బాబు, స్టాలిన్ ఎన్నికల ప్రచార బాధ్యతలను భుజానకెత్తుకున్నారు. ఆ ఎన్నికల్లో స్టాలిన్ గెలిచినప్పటికీ, కేవలం 2,734 ఓట్ల స్వల్ప మెజారిటీ మాత్రమే వచ్చింది. స్టాలిన్ వంటి కీలక నేతకు అంత తక్కువ మెజారిటీ రావడంపై డీఎంకే అధిష్ఠానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనికి బాబునే బాధ్యుడిని చేస్తూ ఆయన్ను పదవి నుంచి తప్పించి, పార్టీలో పక్కనపెట్టింది. పార్టీలో తనకు జరిగిన అవమానంతో వీఎస్ బాబు డీఎంకేను వీడారు. 2026 ఫిబ్రవరిలో నటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీలో చేరి తన రాజకీయ జీవితాన్ని మలుపుతిప్పుకోగలిగారు. 2011 తర్వాత జరిగిన 2016, 2021 ఎన్నికల్లో సీఎం స్టాలిన్ కొళత్తూర్ నుంచి వరుసగా 37,730, 70,384 ఓట్ల భారీ మెజారిటీలతో గెలిచి ఆ నియోజకవర్గాన్ని తన కంచుకోటగా మార్చుకున్నారు. ఆ స్థానంలో, ఒకప్పుడు తన గెలుపు కోసం పనిచేసి అవమానంతో బయటకు వెళ్లిన వ్యక్తి చేతిలోనే ఓటమి పాలుకావడం స్టాలిన్‌కు రాజకీయంగా పెద్ద దెబ్బ.

# జోర్హాట్‌నుంచి అసోం పిసిసి చీఫ్ గౌరవ్ గొగోయ్ ఓటమి



**గువాహతి, మే 4:** అస్సాంలోని కాంగ్రెస్ యువ ఎంపీ గౌరవ్ గొగోయ్ ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో జోర్హాట్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. అయితే ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడైన ఆయన మొదటి ప్రయత్నంలోనే ఓడిపోయారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో జోర్హాట్ ఎంపీగా గౌరవ్ గొగోయ్ ఎన్నికయ్యారు. బిజెపికి చెందిన టోపోన్ కుమార్ గొగోయ్‌పై 1.4 లక్షల ఓట్ల మెజార్టీతో ఆయన గెలిచారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి జోర్హాట్ అసెంబ్లీ స్థానం నుంచి గౌరవ్ గొగోయ్ పోటీ చేశారు. తన గెలుపుతో పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే బిజెపికి చెందిన హితేంద్ర నాథ్ గోస్వామి చేతిలో 20వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయారు. మరోవైపు బిజెపి సిట్టింగ్ ఎమ్మెల్యే హితేంద్ర నాథ్ గోస్వామి వరుసగా ఆరుసార్లు జోర్హాట్ నియోజకవర్గంలో గెలిచారు. ఏజీపీ నేతగా మూడుసార్లు, బిజెపి ఎమ్మెల్యేగా రెండుసార్లు ప్రాతినిధ్యం వహించారు. ఈసారి కూడా జోర్హాట్‌లో గెలుపును బిజెపికి అందించారు. అలాగే ఆ పార్టీ తరుఫున వరుసగా మూడో విజయాన్ని ఆయన సొంతం చేసుకున్నారు. 59వేలకు పైగా ఓట్లు సాధించారు.

# మమత కంచుకోటలో పెల్లుబికిన వ్యతిరేకత

**కోల్‌కతా, మే 4:** పశ్చిమ బెంగాల్‌ను 1977 నుండి పాలిస్తున్న కమ్యూనిస్ట్ పార్టీల కూటమిని నేరుగా ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీ నిరాకరించడంతో నిరాశ చెందిన మమతా బెనర్జీ, ఆ పార్టీతో సంబంధాలు తెంచుకుని 1998లో టిఎంసిని స్థాపించారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుండి వచ్చిన ఈ న్యాయవాది, విద్యార్థి కార్యకర్తగా, ఆపై రాజకీయ నాయకురాలిగా ఎదిగి, చివరకు 2011లో కమ్యూనిస్టులను ఓడించి రాష్ట్రంలో విజయం సాధించారు. 2014లో మోడీ భారత ప్రధాని అయినప్పటి నుండి, ఆమె బిజెపికి కీలక ప్రత్యర్థిగా ఎదిగారు. తన రాజకీయాలను, ముఖ్యంగా బెంగాల్ ముస్లింల పక్షాన నిలబడటాన్ని, హిందూ మెజారిటేరియనిజానికి వ్యతిరేక చర్యగా ఆమె చిత్రీకరించారు. ఆమె మహిళా కేంద్రీకృత సంక్షేమ పథకాల శ్రేణిని కూడా ప్రారంభించారు. పెద్ద పరిశ్రమలు కోరుతున్న వివాదాస్పద భూసేకరణ ప్రాజెక్టు లను వ్యతిరేకించారు. "మమతకు స్పష్టమైన మద్దతు ఉంది, ఆమెకు ప్రజాదరణ కూడా ఉంది. కానీ టిఎంసి యంత్రాంగంపై వ్యతిరేకత ఉంది, ప్రజల దైనందిన జీవితంలో వారి జోక్యం పట్ల ప్రజలు సంతోషంగా లేరు" అని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. "తీవ్రమైన ప్రభుత్వ వ్యతిరేకత లేకపోతే, పశ్చిమ బెంగాల్‌కు ఈ రకమైన ఫలితం వచ్చేది కాదు" అని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు రాహుల్‌వర్మ నొక్కి చెప్పారు. ఈఎన్నికల్లో దాదాపు 6.82కోట్ల మంది, అంటే సుమారు 92.93 శాతం మంది ఓటువేశారు. ఇది ఆ రాష్ట్ర చరిత్రలోనే అత్యధికం. "ఓటర్లకు కొత్తదనాన్ని అందించ డంలో, తమపై ఉన్న బలమైన ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించడంలో" బెనర్జీ పార్టీ విఫలమైందని న్యూఢిల్లీలోని 'సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవల పింగ్ సొసైటీస్' రాజకీయ విశ్లేషకుడు ప్రవీణ్‌రాయ్ అన్నారు. "తమ సిద్ధాం తాన్ని అంగీకరిం చని ప్రజల పట్ల పార్టీ వ్యవస్థ శత్రుత్వంతో వ్యవహరించింది" అని పేర్కొ న్నారు. "ఆర్థిక లేమి, సామాన్య ప్రజల ఆకాం క్షల పట్ల పెరుగుతున్న అసంతృప్తిని గుర్తించ డంలో టిఎంసి విఫలమైంది" అని ఆయన అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఈ ఓటమి, మోడీ పదవికి జాతీయ స్థాయిలో పోటీదారుగా ఎదగాలన్న బెనర్జీ ఆశలనుకూడా బలహీన పరుస్తుందని రాయ్ జోడించారు. అయితే, ఈ ఫలితం ప్రభావాలు బెనర్జీకి మాత్రమే పరిమితం కావని ఆయన అన్నారు. బిజెపి విజయం, టిఎంసి అనూహ్య పరాజయం "మోడీని వ్యతిరే కించే అన్నిపార్టీల రాజకీయబలాన్ని తగ్గిస్తాయి". ఇది రెండేళ్ల క్రితంతో పోలిస్తే ఒక పెద్ద మార్పు. 2024 సార్వత్రిక ఎన్నికలలో, మోడీ పార్టీకి మెజారిటీ రాకపోవడంతో, మనుగడ కోసం మిత్ర పక్షాల మద్దతుపై ఆధారపడాల్సి వచ్చింది. సోమ వారం నాటి ఎన్నికల విజయాలు, జాతీయ ఎన్నికలలో ఎదురైన "ఎన్నికల ఎదురుదెబ్బను పూడ్చాయి" అని అన్నారు."ఇది మోడీనాయకత్వం జాతీయ స్థాయిని గణనీయంగా పెంచుతుంది. భారత దేశాన్ని పాలించేందుకు పార్టీ ఆధిపత్య శక్తిని విస్తరిస్తుంది" అని రాయ్ అన్నారు.

# బిజెపి వైపు ముస్లింల మొగ్గు!

## హిందువుల ఓట్లు ఏకీకృతం అయ్యాయి: సువేందు అధికారి

**న్యూఢిల్లీ, మే 4:** పశ్చిమ బెంగాల్‌లో "ఓటర్ల ప్రాధాన్యతలలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య పెద్ద వ్యత్యాసం ఈసారి ఎన్నికల్లో స్పష్టమైంది. అలాగే బెంగాల్‌లో ముస్లిం జనాభా అసమానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉంది, వీటి దృష్ట్యా, ఫలితం బిజెపికి భారీ తేడాతో వచ్చింది. "చారిత్రాత్మకంగా, బిజెపి హిందూ మెజారిటీ రాజకీయాల కారణంగా, పశ్చిమ బెంగాల్‌లో గెలిచే అవకాశం ఆ పార్టీకి లేదని రాజకీయ విశ్లేషకులు వాదిస్తున్నారు. బిజెపి తనను తాను హిందూ ఓటర్ల పార్టీగా చెప్పుకోవడానికి వెనుకాడలేదు. రాష్ట్రంలో బిజెపి నాయకుడు, ముఖ్యమంత్రి పదవి రేసులో ముందున్న సువేందు అధికారి మాట్లాడుతూ, "హిందువుల ఓట్లు ఏకీకృతం అయ్యాయి" అని అన్నారు. అయితే, గతంలోలాగా చాలా మంది ముస్లింలు కూడా మమతా బెనర్జీ పార్టీ టిఎంసికి ఓటు వేయకుండా, బిజెపి వైపు మొగ్గు చూపారని ఆయన పేర్కొన్నారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసిని "ముస్లిం అనుకూల పార్టీ"గా అభివర్ణిస్తూ, "బిజెపికి అనుకూలంగా ఓటు వేసిన ప్రతి హిందూ సనాతనుడికి తాను ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను," అని అధికారి అన్నారు. బిజెపికి పశ్చిమ బెంగాల్‌లో లభించిన ఈ విజయం ఎంతో ప్రతీకాత్మకమైనది. 1951లో బిజెపికి పూర్వగామి అయిన భారతీయ జనసంఘ్‌ను స్థాపించిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఈ రాష్ట్రానికి చెందినవారే. ఎన్నికల ముందు ఓటర్ల సవరణపై పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్‌కు ముందు, ఇసి ఒక ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ద్వారా ఓటర్ల జాబితాల సవరణను చేపట్టింది. ఇప్పటివరకు డజనుకు పైగా రాష్ట్రాల్లో అధికారులు ఇలాంటి సవరణలను నిర్వహించారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఈ ప్రక్రియ వివాదాస్పదంగా, రాష్ట్రంలోని 76 మిలియన్ల ఓటర్లలో దాదాపు 12 శాతం మంది అయిన 9 మిలియన్ల మందికి పైగా ప్రజలను ఓటర్ల జాబితా నుండి తొలగించి, ఎన్నికలలో ఓటు వేసే వారి హక్కును హరించింది. వారిలో దాదాపు 6 మిలియన్ల మందిని గైర్హాజరుగా లేదా మరణించినవారిగా ప్రకటించగా, మిగిలిన 3 మిలియన్ల మంది ఎన్నికలకు ముందు అందుబాటులో ఉన్న తక్కువ సమయంలో వారి కేసులను విచారించడానికి ప్రత్యేక ట్రిబ్యునల్స్ లేకపోవడంతో ఓటు వేయలేకపోయారు. తృణమూల్ కాంగ్రెస్‌తో పాటు, పలు రాష్ట్రాల్లోని ఇతర ప్రతిపక్ష పార్టీలు ఓటర్ల జాబితా సవరణలోని వ్యత్యాసాలను ఎత్తిచూపుతూ, ఎన్నికల సంఘం బిజెపికి వత్తాసు పలుకుతోందని ఆరోపించాయి. ఈ ప్రక్రియ ఎన్నికలకు ముందే ముస్లింలను అసమానంగా ఓటు హక్కు కోల్పోయేలాచేసిందని హక్కుల కార్యకర్తలు, పరిశీలకులు భావిస్తున్నారు. "అస్పష్టమైన, తొందరపాటుతో కూడిన, రాజ్యాంగ విరుద్ధమైన ఈ సవరణ ప్రక్రియను సవాలు చేస్తూ బెనర్జీ భారత సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారు. సుప్రీంకోర్టు, ప్రభావితమైన లక్షలాది మందికి ఓటు హక్కులను పునరుద్ధరించలేదు కానీ, ప్రభావిత ఓటర్ల జాబితాను ప్రచురించాలని ఇసిని ఆదేశించింది. "ఒకసారి తాను ఓటర్ల జాబితాలో ఉండాలా వద్దా" అనే ప్రశ్న బలహీన వర్గాల ప్రజలకు ప్రధాన ప్రశ్నగామారినప్పుడు, ఇది మామూలు రాజకీయం కాదు" అని సిర్కార్ అన్నారు. "ఓటర్ల జాబితా సవరణ వల్ల ఏర్పడిన ధ్రువీకరణ స్థాయిని రాష్ట్రం వెలుపల ఉన్న ప్రజలు నిజంగా గ్రహించలేరు.

"మోడీ ప్రభుత్వం కూడా ఎన్నికల కోసం పశ్చిమ బెంగాల్‌కు 2,400 కంపెనీల పారామిలిటరీ దళాలను పంపింది. ఇటువంటి రాష్ట్ర ఎన్నికలకు ఇది ఒక రికార్డు. రాజకీయ హింస భయం లేకుండా ఈ ప్రక్రియను నిర్వహించడంలో ఎన్నికల అధికారులకు సహాయపడటానికే ఇది అని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అయితే, ఓటర్లను భయపెట్టడానికో లేదా ప్రభావితం చేయడానికో ఈ భద్రతా బలగాలను మోహరించారని టిఎంసి, ఇతర ప్రతిపక్ష పార్టీలు వాదించాయి."భారీగా భద్రతా బలగాలు మోహరించడం బిజెపికి అనుకూల పరిస్థితిని కూడా సృష్టించి ఉండవచ్చు," అని శివ్ నాదర్ విశ్వవిద్యాలయానికి చెందిన వర్మ వాదించారు. తటస్థంగా ఉన్నవారు, క్షేత్రస్థాయిలో టిఎంసి యంత్రాంగానికి భయపడినవారు కూడా దీనితో ప్రభావితులయ్యారు. "భారతదేశంలోని ప్రతిపక్ష పార్టీలకు, భారత ఎన్నికల సంఘానికి మధ్య విశ్వాస స్థాయి చాలా తక్కువగా ఉందనడంలో సందేహం లేదు" అని వర్మ అన్నారు. అయితే, కేవలం ఓట్ల సవరణ ప్రక్రియ మాత్రమే బిజెపికి ఇంతటి నిర్ణయాత్మక విజయాన్ని అందించలేదని, ఇది అధికార వ్యతిరేకత, మతపరమైన ధ్రువీకరణతో సహా అనేక ఇతర అంశాలను ప్రతిబింబిస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయినప్పటికీ, మమత పోరాటం చేయకుండా వైదొలగరని విశ్లేషకులు అన్నారు.

# పార్టీ పెట్టి తొలి ఎన్నికల్లోనే గెలిచి సిఎంలయిన జాబితాలో విజయ్



**చెన్నై, మే 4:** తెలుగు నాట, తమిళ నాట సినిమా స్టార్స్‌ను ప్రేక్షకులు అభిమానించి, ఆదరించే తీరు చాలా ప్రత్యేకంగా ఉంటుంది. స్టార్స్‌ను కొందరు తమ ఇంటి మనుషుల్లా చూస్తారు. మరికొందరు దేవుడిగా చూస్తారు. అందుకే స్టార్స్ రాజకీయ రంగంలోనూ తమదైన ముద్రలో చెలామణీ అవుతున్నారు. రాజకీయ పార్టీలు స్థాపించి, ఏకంగా రాష్ట్రాలకు సిఎంలు అవుతున్నారు. అది కూడా పార్టీ పెట్టిన తర్వాత తొలి ఎన్నికల్లోనే అఖండ విజయం సాధించి సిఎంలు అవుతున్నారు. తాజాగా టివికె పార్టీ అధినేత, సూపర్ స్టార్ విజయ్ కూడా తమిళనాడు సిఎం పదవి చేపట్టబోతున్నారు. విజయ్ కంటే ముందు ఇద్దరు స్టార్స్ మాత్రమే ఇలా పార్టీలు స్థాపించి, మొదటి ఎన్నికల్లోనే విజయం సాధించారు. వారు ఒకరు ఎంజీఆర్. రెండోది ఎన్టీఆర్. తమిళనాడులో పెద్ద హీరోగా ఉన్న ఎంజీఆర్ (ఎంజీ రామచంద్రన్) 1972లో ఎఐఎడిఎంకే స్థాపించారు. ఆయన డిఎంకే పార్టీ నుంచి బయటకు వచ్చి తన సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ తర్వాత మొదటిసారి 1977లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. తమిళనాడు సీఎంగా పదవి చేపట్టారు. అంటే పార్టీ పెట్టిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లోనే ఆయన ఘన విజయం సాధించారు.

ఆయన తర్వాత తెలుగు వారికి సంబంధించి అప్పట్లో ఉమ్మడి ఎపిలో సీనియర్ స్టార్ ఎన్టీఆర్ పార్టీని స్థాపించారు. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి, 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొని భారీ విజయం సాధించారు. తొలిసారి పోటీ చేసిన ఎన్నికల్లోనే విజయం సాధించిన ఎన్టీఆర్ సిఎం పదవి చేపట్టారు. ఆ తర్వాత నటుడు విజయ్ ఇప్పుడు తమిళనాడులో టివికెను స్థాపించి, అధికారం చేపట్టబోతున్నారు. ఆయన 2024లో పార్టీని స్థాపించారు. ఆ తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలివి. ఈ ఎన్నికల్లోనే విజయం సాధించి సిఎం పదవి చేపట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు భారతీయ సినీ పరిశ్రమకు సంబంధించి ముగ్గురు నటులు ఇలా పార్టీలు స్థాపించి, ఆ వెంటనే సీఎం పదవి చేపట్టారు.

రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన

## జూనియర్ అసిస్టెంట్



పట్టుబడిన శ్రీలత

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 4, ప్రభాతవార్త:** జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ సర్కిల్-37లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటూ ఏసిబి అధికారులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే బోరబండ సర్కిల్ 37 డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో రెవెన్యూ ట్యాక్స్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.శ్రీలత ఇంటి నిర్మాణ అనుమతికి రూ.5లక్షల లంచం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిర్యాదుదారుని నుండి తొలిగా యూసుఫ్‌గూడ వెంకటగిరి సమీపంలోని రత్నదీప్ వద్ద లక్ష రూపాయల లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి లంచం నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆరోపణలపై ఆమెను అరెస్టేసి నాంపల్లి ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరు పరచనున్నట్లు ఏసిబి అధికారులు తెలిపారు.



## డంపింగ్ యార్డ్‌ను తరలించండి

సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఈటల, జెఏసి నేతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే4:** హైదరాబాద్ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ జెఏసీ ప్రతినిధులు సోమవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. డంపింగ్ యార్డ్‌ను జవహర్‌నగర్ నుంచి తరలించాలని విజ్ఞప్తి చేశారు. సీఎంను కలిసినవారిలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, జెఏసి కన్వీనర్ శంకర్ నారాయణ్, ఇతర జెఏసీ ప్రతినిధులు జవహర్ నగర్ డంప్ యార్డును తరలించాలని సీఎంకు జెఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ వేధింపులకు వెరవం: కెటిఆర్



సోమవారం కందిలో మీడియాతో మాట్లాడుతున్న కెటిఆర్

**కంది, మే 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం కేసులతో దిగుతోందని, ఆ వేదింపులకు భయపడేది లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. సోమవారం సంగారెడ్డిజిల్లా మండల కేంద్రమైన కందిలోని సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న బిఆర్ఎస్ సోషల్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను కేటిఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా కేటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అక్రమ కేసులకు బయపడేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన క్రిశాంక్‌పై 35కు పైగా కేసులు నమోదు చేశారని, స్టేషన్ బెయిల్ వచ్చే వాటిలో అరెస్ట్ చేసి జైల్లో బంధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అరాచకాలపై ప్రశ్నించడమే క్రిశాంక్ చేసిన తప్పా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అల్లుడు, ఆయన బావమరిది, కుటుంబ సభ్యులు చేసే అవినీతిపై ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారన్నారు. బిఆర్ఎస్ సోషల్ మీడియాపై చూపే శ్రద్దలలో ఒక పైసా అభివృద్ధిపై చూపిన అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి ఇంతకు ఇంత అనుభవిస్తారని జ్యోషం చెప్పారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, సబితా ఇంద్రారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, వివేకానంద గౌడ్, శంభిపూరర్ రాజు, పట్నం మాణిక్యం, కాసాల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మానవీయ కోణంలో ప్రజా పాలన: నూతి శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** అంతరాలు లేని సమాజం కోసం మానవీయ కోణంలో సిఎం రేవంత్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని తెలంగాణ బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు సోమ వారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం తల్లి దండ్రులను పట్టించుకోని కుమారుల వేతనాల నుండి పది శాతం తల్లి దండ్రుల ఖాతాలో జమ చేస్తామని చెప్పడం ప్రభుత్వ మానవీయ కోణంలో ఒక భాగమని అన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల మహిళల్లో ఆర్థిక స్వయం ప్రతిపత్తిని పెంపొందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరోకీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 1000 మంది మహిళలను ఎంపిక చేసి కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నామని వివరించారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 1.19 కోట్ల మంది మహిళలకు లబ్ధి చేకూరబోతోందని పేర్కొన్నారు.

## జెసి సెట్ హాల్ టికెట్ల విడుదల

14 వరకు డౌన్‌లోడ్‌కి అవకాశం, 15న పరీక్ష: ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే4:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎస్సీ గురుకుల సొసైటీ జూనిర్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించనున్న జేసీ సెట్-2026 ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఈ నెల 14 వరకు డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల కార్యదర్శి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతిభ కేంద్రాలు (సీవోఈ), రెగ్యులర్ జూనియర్ కాలేజీలు, సైనిక్ కాలేజీలు, ఒకేషనల్ కాలే జీలు, ఫైన్ ఆర్ట్స్ కాలేజీ (బాలికలు)ల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం ఈ పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. ఏప్రిల్ 25వరకు దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే. ప్రవేశ పరీక్షను ఈ నెల 15న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు.

## కాంగ్రెస్ గెలుపు వెనుక సిఎం రేవంత్ రెడ్డి వ్యూహాలు : అద్దంకి దయాకర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే4:** కేరళలో కాంగ్రెస్ పార్టీ విజయం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాలు ఉన్నాయని తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. కేరళ అసెంబ్లీఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఘన విజయం సాధించింది. కేరళ ఫలితాలపై అద్దంకి దయాకర్ మాట్లాడుతూ, యూడీఎఫ్ విజయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించారని అన్నారు. కేరళ ముఖ్యమంత్రి విజయన్‌పై రేవంత్ రెడ్డి నేరుగా విమర్శలు చేశా రని గుర్తు చేశారు. కేరళ అభివృద్ధిపై విజయన్‌ను నిలదీయడంతోపాటు లేఖలు కూడా రాశారని గుర్తు చేశారు. అదే సమయంలో తెలంగాణలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కేరళ ప్రచారంలో ముఖ్య మంత్రి వివరించారని గుర్తు చేశారు.

ఆన్‌లైన్‌లో మహిళలు, చిన్నారులపై వేధింపుల నివారణకు

# డబ్ల్యుఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో సదస్సు



డబ్ల్యుఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పాల్గొన్న డిజి చారు సిన్హా, డిఐజి పరిమళ హన్నా నూతన్

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** డిజిటల్ మాధ్యమాలలో మహిళలు, చిన్నారులపై జరిగే వేధింపుల నివారణకు మహిళా భద్రత విభాగం (డబ్ల్యుఎస్‌డబ్ల్యు) ఆధ్వర్యంలో డిజిపి కార్యాలయంలో సదస్సు జరిగింది. జంట నగరాలు, శివార్లలోని పలు కాలేజిలకు చెందిన 200 మంది విద్యార్థినులు పాల్గొన్న ఈ సదస్సు డిజిటల్ హుందాతనం గౌరవం అనే అంశంపై జరిగింది. ఈ సదస్సులో కీలకోపన్యాసం చేసిన డబ్ల్యుఎస్‌డబ్ల్యు డిజి చారు సిన్హా ఆన్‌లైన్‌లో మహిళలు, చిన్నారులు ఎటువంటి వేధింపులను ఎదుర్కొంటున్నారనే దానిపై వివరించారు సైబర్ స్టాకింగ్స్, ట్రోలింగ్, బల్లీయింగ్, డాక్సింగ్ వంటి వేధింపుల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా వుండాలని ఆమె కోరారు. దీంతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంను దుర్వినియోగం చేయకుండా హుందాతనంగా మెలగాలని ఆమె సూచించారు. ఆన్‌లైన్ వేధింపులపై మౌనంగా వుంటే నేరగాళ్లను మరింత ప్రోత్సహించడమేనని చారు సిన్హా తెలిపారు. ఈ తరహా నేరాల నివారణకు బాధితులకు అండగా వుండి సమిష్టిగా నేరగాళ్ల భరతం ప ట్టాలని ఆమె పిలుపునిచ్చారు. వేధింపులకు గురయ్యే వారు మౌనంగా వుండకుడా పోలీసుల ను ఆశ్రయించి న్యాయం పొందాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలతో పాటు చట్టాలకు సంబంధించి విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు చారు సిన్హా జవాబులు ఇచ్చారు. ఈ సదస్సు లో డబ్ల్యుఎస డబ్ల్యు డిఐజి పరిమళ హన్నా నూతన్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బిసి కమిషన్ సిఫారసులను ఆమోదించిన రాష్ట్ర మంత్రివర్గం

హర్షం వ్యక్తం చేసిన తెలంగాణ బిసి కమిషన్

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 4:** తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ప్రభుత్వానికి చేసిన రెండు సిఫారసులను సోమవారం జరిగిన మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో బీసీ కమిషన్ రెండు అంశాలపై చేసిన సిఫారసులను ఆమోదించడం పట్ల కమిషన్ హర్షం వ్యక్తం చేసింది. తిట్టు పదాలుగా ఉన్న పలు కులాల పేర్ల మార్పుకు సంబంధించి కమిషన్ చేసిన సూచనలను మంత్రివర్గం ఆమోదించింది. దాంతోపాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించబడుతున్న సీడ్ తదితర పథకాలకు అర్హులైన సంచార జాతుల జాబి తాను మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్ర బీసీ కమిషన్ సెప్టెంబర్ 2024లో పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్టోబర్, నవంబర్ మాసాలలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పర్యటించి, వెనుకబడిన తరగతుల స్థితిగతుల అధ్యయనం కొరకు బహిరంగ విచారణను చేపట్టింది. అందులో ప్రధానంగా సమాజంలో తమ కులం పేర్ల ద్వారా అవమానాలకు గురవుతున్న కొన్ని కులాలు తమ కులాల పేర్లను మార్చవలసిందిగా కమిషన్‌ను అభ్యర్థించాయి. ఆ అభ్యర్థనలను కూలంకషంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో వారి స్థితిగతులను అధ్యయనం చేయడం జరిగింది. సమగ్ర అధ్యయనం తర్వాత బీసీ జాబితాలో దొమ్మర కులం పేరును 'గడవంశీయ'గా మార్చాలని, బీసీ జాబితాలో పిచ్చిగుంట్ల పదాన్ని తొలగించి 'వంశ రాజ్'ను మాత్రమే కొనసాగించాలని, బీసీ జాబితాలో తమ్మళి కులంతో పాటుగా అవమానకరంగా ఉన్న 'శూద్ర కులం' పదాలను తొలగించాలని, బీసీ జాబితాలో బుడబుక్కల కులానికి 'శివక్షత్రియ' అనే పదాన్ని జోడించి, బుడబుక్కల కులం పేరును అవమానకరంగా భావించేవారు శివక్షత్రియ పేరుతో వ్యవహరించబడేలా, బీసీ జాబితాలో చాకలి కులానికి 'ధోబి' అనే పర్యాయపదాన్ని చేర్చాలని, మేర కులానికి 'మేరు' అనే పర్యాయపదాన్ని చేర్చాలని, వీరభద్రీయ కులం దాని అనుబంధ కులాలైన వీరముష్టి, నెత్తికోతల క్రమాన్ని బీసీ జాబితాలో మార్చాలని బీసీ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసిందని ఛైర్మన్ జి.నిరంజన్ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో సీడ్ పథకం అమలును పర్యవేక్షించడానికి, కేంద్ర ప్రభుత్వం, డిఎన్‌టి బోర్డుతో సంప్రదింపులు జరుపడానికి, అర్హులైన లబ్ధిదారులు పథకాన్ని అందుకోవడంలో సహాయ సహకారాలు అందించడానికి, రాష్ట్రస్థాయిలో ఎంబిసి కార్పోరేషన్ లేకపోతే ఏదైనా ఇతర సంస్థను అనుసంధానకర్తగా నియమించాలని కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఇటీవల జరిగిన కుల సర్వే ప్రకారం రాష్ట్రంలో వారి జనాభా దాదాపు 18,94,966 గా ఉంది. రాష్ట్రంలోని సంచార కులాలు, అణగారిన కులాల సంక్షేమం కొరకు రాష్ట్ర బీసీ కమిషన్ చేసిన సిఫారసులను ప్రభుత్వం యధాతతంగా ఆమోదించడం పట్ల కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు తమ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి

# డ్రగ్స్ వ్యతిరేక అఫిడవిట్

ఇంటర్ అడ్మిషన్ సమయంలో తప్పనిసరి

8 నుంచి ఇంటర్ అడ్మిషన్లు

జూన్ 1 నుంచి క్లాసులు ఆరంభం

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే4:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో అడ్మిషన్లకు సంబంధించి విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి మాదకద్రవ్య వ్యతిరేక అఫిడవిట్‌ను తప్పనిసరిగా తీసుకోవాలని ఇంటర్ బోర్డు ఆదేశాలు జారీ చేసింది. అలాగే రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కాలేజీలు తమ కాలేజీలో అనుమతి ఉన్న సెక్షన్ల మేరకు మాత్రమే అడ్మిషన్లు తీసుకోవాలని ఆదేశించింది. అనుమతి ఉన్న కాలేజీల్లో మాత్రమే అడ్మిషన్లను తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు ఇంటర్ బోర్డు సూచించింది. రాష్ట్రంలో అనుమతి పొందిన కాలేజీల వివరాలు ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్నాయని పేర్కొంది. ఈ నెల 8 నుంచి ఇంటర్ అడ్మిషన్లను ప్రారంభించడానికి షెడ్యూల్‌ను జారీ చేసింది. ఈ నెల 31 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు అడ్మిషన్ల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ సోమవారం విడుదల చేశారు. జూనియర్ కాలేజీల్లో జనరల్, వొకేషనల్ విభాగాలలో రెండేళ్ల ఇంటర్మీడియట్ కోర్సును అందిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, కోపరేటీవ్, టి.జి. రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్, బి.సి. సంక్షేమ రెసిడెన్షియల్, మైనారిటీ రెసిడెన్షియల్, కె.జి.బి.వి, టి.జి. మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలు, కాంపోజిట్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ అందరూ 2026-27 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నమోదు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

ఈ నెల 8 నుంచి కళాశాలలో దరఖాస్తులు స్వీకరించాలని, ఈ నెల 31 వరకు దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. తరగతులను జూన్ 1 నుంచి ప్రారంభించనున్నట్టు తెలిపారు. మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియను జూన్ 30 నాటికి ముగించాలని సూచించారు. ప్రిన్సిపాల్‌లు ఇంటర్నెట్ మార్క్స్ మెమోల ఆధారంగా తాత్కాలిక ప్రవేశాలు కల్పించవచ్చని తెలిపారు. విద్యార్థులు చివరిగా చదివిన పాఠశాల అధికారులు జారీ చేసిన ఒరిజినల్ ఎస్.ఎస్.సి ఉత్తీర్ణత సర్టిఫికేట్, బదిలీ సర్టిఫికేట్‌ను సమర్పించిన తర్వాతే తాత్కాలిక ప్రవేశాలు ఖరారు చేయబడతాయనానరు. తెలంగాణలోని ప్రైవేట్ ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, బీసీ సంక్షేమం, మైనారిటీ, మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ఇంటర్మీడియట్ కోర్సులో ప్రవేశం కోరుకునే విద్యార్థి ఆధార్ నంబర్‌ను తప్పనిసరిగా సమర్పించాలి.

ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మంజూరైన సెక్షన్లలో, ప్రతి సెక్షన్‌లో 88 మంది గరిష్ట పరిమితి వరకు మాత్రమే ప్రవేశాలు కల్పించాలని, బోర్డుచే తొల గించబడిన కాంబినేషన్లలో ప్రవేశాలు కల్పిం చరాదని ఆదేశాలు జారీ చేశారు. ఏవైనా ఉల్లంఘ నలు జరిగితే, జరిమానా విధించడంతోపాటు కళాశాల అనుబంధాన్ని రద్దు చేయడంతో సహా చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అడ్మిషన్ల సమయంలో, 2026-27 విద్యా సంవత్సరానికి తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా బోర్డు ద్వారా మంజూరు చేయబడిన సెక్షన్ల సంఖ్య, ప్రతి సెక్షన్‌లో నిండిన సీట్ల సంఖ్య, ప్రతి సెక్షన్‌లో ఖాళీగా ఉన్న సీట్ల సంఖ్యను కాలేజీ ప్రవేశ ద్వారం వద్ద స్పష్టంగా ప్రదర్శించాలని యాజమాన్యాలను ఆదేశించారు. ప్రతిరోజూ సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

# మండుతున్న కూరగాయల ధరలు

నిన్నమొన్నటి వరకు రూ.10 పలికిన టమాట

ప్రస్తుతం కేజి రూ.50కి పెరిగిన వైనం

ఆకాశన్నంటుతున్న చిక్కుడు, బెండ, దొండ, పచ్చిమిర్చి ధరలు



**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎండలతోపాటు కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయి. ఇప్పటికే ఆకాశన్నంటుతున్న వంట గ్యాస్, నిత్యావసర ధరలకుతోడు తాజాగా కూరగాయలు ధరలు కూడా పెరుగుతుండడంతో సామాన్యులు బెంబేళెత్తిపోతున్నారు. వారం రోజుల్లోనే రెండింతల మేర కూరగాయల ధరలు పెరిగాయి. ముఖ్యంగా ప్రతి కూరలో వినియోగించే టమాట ధరలు ఇప్పుడు భారీగా పెరిగాయి. వారం రోజుల క్రితం వరకు కిలో టమాట రూ.10గా ఉండగా ప్రస్తుతం అది రూ.40 నుంచి రూ.60మధ్యన ధర పలుకుతోంది. ప్రస్తుతం బెండ, చిక్కుడు, దొండకాయ, గోరు చిక్కుడు, పచ్చిమిర్చి, బిర్నీస్, చామదుంప, కాకరకాయ, బీరకాయ ధరలు రూ.100కు చేరువయ్యాయి. క్యాబెజి, క్యాప్సికం, క్యాలిఫ్లవర్ వంటి కూరగాయలను కొనుగోలు చేయాలంటేనే ధరలను చూసి సామాన్యులు బెంబెళెత్తిపోతున్న పరిస్థితి నెలకొంది. కీర, దోస, ఆలుగడ్డ ధరలు కూడా కిలో రూ. 50కి పైమాటేనని వినియోగదారులు వాపోతున్నారు. అయితే కూరగాయల కోసం ఇతర రాష్ట్రాల నుండి దిగుమతులపై ఆధారపడాల్సి రావడం వల్లనే ధరలు పెరుగుతున్నాయని ఆహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో ఏటేటా కూరగాయల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతోంది. ప్రస్తుతం లక్ష ఎకరాల్లో మాత్రమే కూరగాయల సాగవుతున్నాయి. ఈ విస్తీర్ణాన్ని వచ్చే అయిదేళ్లలో 5 లక్షల ఎకరాలకు పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. రాష్ట్రంలో కూరగాయల సాగు తగ్గడంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. మండే ఎండల కారణంగా ఇతర రాష్ట్రాల నుండి కూడా డిమాండ్‌కనుగుణంగా సరఫరా లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా అనూహ్యంగా అన్ని కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఎండలు నమోదవుతుండడంతో రాష్ట్రంలో సాగు చేసిన కూరగాయల తోటల నుండి దిగుబడి సరిగా రాక ధరలు భగ్గుమంటున్నాయి.

## అన్నదాతలకు శుభవార్త..సబ్సిడీపై వ్యవసాయయంత్రాల పంపిణీ

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సబ్సిడిపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందించాలని నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్న వేళ సబ్సిడిపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందించే పథకాన్ని పునరుద్ధరించనుంది. గత ఎన్నికలకు ముందు వరంగల్‌లో రాహుల్‌గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వరంగల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీంతో వరంగల్ నుండే ఈ నెల 5,6,7వ తేదీల్లో సబ్సిడిపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని వేలాది మంది రైతులకు సబ్సిడిపై యంత్రపరికరాలను పంపిణీ చేయనున్నారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తోంది. సాగు పనుల్లో కూలీల కొరతను అధిగమించడంతోపాటు తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పనులు పూర్తి చేసేందుకు వీలుగా రైతులకు భారీ సబ్సిడీలను అందిస్తోంది. వ్యవసాయశాఖ ద్వారా అర్హులైన రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను పంపిణీ చేయనున్నారు. ప్రధానంగా రోటోవేటర్లు, స్ప్రేయర్లపై సబ్సిడీని ప్రకటిస్తోంది. రైతులపై ఆర్థిక భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతో వీటిపై రాయితీలు కల్పిస్తున్నారు.

**వరంగల్ వేదికగా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయం**

పొలం దున్నడానికి ఉపయోగపడే రోటోవేటర్ కొనుగోలుపై 50,000 రూపాయల వరకు సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోంది. దీనిపై దాదాపు 50 శాతం వరకు రాయితీ కల్పిస్తారు. పురుగుల మందుల పిచికారీ కోసం ఉపయోగించే ఆధునిక హోండా కంపెనీ స్ప్రేయర్లపై 10,000 రూపాయల రాయితీ లభిస్తుంది. ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందాలనుకునే రైతులు కొన్ని నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా సాగు భూమి కనీసం ఒక ఎకరం అంతకంటే ఎక్కువ కలిగి ఉండాలి.

## పెట్రోల్, డీజిల్ కొరతపై రేపు నిరసన కార్యక్రమాలు: కూనంనేని సాంబశివరావు



**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 4:** గ్యాస్ అధిక ధరలతోపాటు పెట్రోల్, డీజీల్, కొరతకు నిరసనగా ఈ నెల 6న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్టు సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. గ్యాస్, పెట్రోల్, డీజీల్ అధిక ధరలు, కొరత వలన ప్రజలు తీవ్ర ఇబ్బందుల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో పంట కోతల సమ యంలో డీజీల్ లేకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొరత లేదని పాలకులు చెబుతున్నప్పటికీ ఆచర ణలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శిం చారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలెండర్ల ధరలను రూ.993 పెంచడంతో రూ.3100కు చేరుకున్నదని. అలాగే డీజీల్, పెట్రోల్ మీద లీటరు రూ.5, గృహావసరాల గ్యాస్ సిలెం డర్‌పై రూ.50 పెంచడానికి ఆయిల్ కంపెనీలు ప్రతిపాదనలు పంపిం చాయన్నారు. ధరల పెంపుతో ప్రజల మీద మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా భారం పడుతుందన్నారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాలను మోడీ ప్రభుత్వం వ్యతిరేకించక పోవడంతో యుద్ధం కంటే ముందు బ్యారెల్ ముడి చమురు ధర 72 డాలర్లు ఉంటే, ఇప్పుడు 126 డాలర్లకు చేరుకున్నదని గుర్తు చేశారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సెలిండర్ ధరల వలన హోటల్స్, రెస్టారెంట్లు, చిన్న పెద్ద ఆహార వ్యాపారాల మీద పడుతుందని, పెట్రోల్, డీజీల్ ధరలు పెంచినట్లయితే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం పెరిగి ప్రజలపై ఆర్థిక భారాలు పెరుగుతాయన్నారు. అమెరికా ఇరాన్ యుద్ధం వలన భారతదేశానికి ఎలాంటి ప్రమాదం లేదని, చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నాయని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఎందుకు గ్యాస్ ధరలు పెంచుతున్నారని ప్రశ్నించారు. ఈ నెల 6న సిపిఐ ఆధ్వర్యంలో గ్యాస్ సిలెండర్లు, ఖాళీ క్యాన్స్ రాష్ట్ర వ్యాపి తంగా అన్ని జిల్లా, మండల, గ్రామ, బస్తీల్లోనూ నిరసన ధర్నాలు చేపట్టాలని నిర్ణయించినట్టు కూనంనేని సాంబశివరావు తెలిపారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కిమ్స్ చైర్మన్ భాస్కర్‌రావు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే4:** కిమ్స్ ఆసుపత్రుల గ్రూప్ చైర్మన్ బి.భాస్కర్‌రావు సోమవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కిమ్స్ ఆసుపత్రి నూతన ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రావాల్సిందిగా ఆహ్వానించారు.

పంటల మద్దతు ధర పథకంలో

## మొక్కజొన్న, జొన్న పంటలను చేర్చాలి

కేంద్ర ప్రభుత్వాన్ని మరోమారు కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పండుతున్న మొక్కజొన్న, జొన్న పంటలను పిఎస్ఎస్ (పంట మద్దతు ధర పథకం)లో చేర్చడంతోపాటు శనగ, పొద్దుతిరుగుడు పంటలపై ఉన్న 25శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్‌ను రాష్ట్రవ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ విషయమై మరోమారు సోమవారం ఆయన కేంద్ర మంత్రికి లేఖ రాశారు. కేంద్ర పరిమితులతో శనగ, పొద్దుతిరుగుడు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మిగిలిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయడంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని వివరించారు. సెంట్రల్ పూల్‌లో కేంద్ర నోడల్ సంస్థ ద్వారా శనగ పంటను 29,860 మెట్రిక్ టన్నులు (మొత్తం ఉత్పత్తిలో 25శాతం) కొనుగోలు చేయడానికి, పొద్దుతిరుగుడు కొనుగోలు పరిమితిని 3690 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి కేంద్రం అనుమతించిందని గుర్తు చేశారు. అయితే కేంద్రం అనుమతించిన పరిమితి ప్రకారం కొనుగోలు గత వారమే పూర్తయ్యాయని వివరించారు. ఇంకా రైతులు పంటను మార్కెట్లకు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శనగ పంట కొనుగోలు పరిమితిని 1,12,077 మెట్రిక్ టన్నులకు, పొద్దుతిరుగుడు పంటల కొనుగోళ్లను 10,839 మెట్రిక్ టన్నులకు పెంచాలని లేఖలో మంత్రి తుమ్మల కోరారు. ఈ రబీ సీజన్‌లో 11.21 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగయిందని, అనుకూల వాతావరణ పరిస్థితులతో ఈసీజన్‌లో ఎకరానికి 26.57 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. జొన్న కూడా 3.68 లక్షల ఎకరాలలో సాగు చేయడం జరిగిందని, ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్టు తెలిపారు. మార్కెట్లో గిట్టుబాటు ధర రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్ల కోసం 246 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రస్తుత రబీ సీజన్‌లో సుమారు 3.99 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొ న్నను కొనుగోలు చేసినట్లు కేంద్ర మంత్రికి లేఖలో తుమ్మల వివరించారు. గత ఖరీఫ్ సీజన్‌లో కూడా రాష్ట్రప్రభుత్వం సుమారు 3.76లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసి రూ.902.80కోట్ల వ్యయం భరించిందని గుర్తుచేశారు.

సిలబస్‌ను పూర్తి చేయడమే కాదు

## విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

పాఠశాల విద్య డైరెక్టర్ మార్గదర్శకాలు జారీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే4:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సిలబస్‌ను నిర్ణీత సమయం కంటే ముందే పూర్తి చేయడం, బాగా ఆలస్యంగా పూర్తి చేయడం వల్ల విద్యార్థుల అభ్యాస నాణ్యత దెబ్బతింటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో సిలబస్‌ను పూర్తి చేయడం కోసం పాఠశాల విద్య డైరెక్టర్ మార్గదర్శకాలను జారీ చేశారు. అకడమిక్ క్యాలెండర్(కాలక్రమ పట్టిక)ను ఖచ్చితంగా పాటించాలన్నారు. పాఠ్యపుస్తకాల్లో సూచించిన సమయం ప్రకారమే ప్రతి అధ్యాయాన్ని పూర్తి చేయాలని, సిలబస్‌ను ముందుగా పూర్తి చేయడం, ఆలస్యం చేయడం అనుమతించబడదన్నారు. విద్యార్థులకు సబ్జెక్టుపై సరైన అవగాహన కలిగేలా బోధన సాగాలని, సిలబస్‌ను పూర్తి చేయాలనే ఆరాటంలో పాఠాలను వేగంగా ముగించకూడదని స్పష్టం చేశారు. అభ్యసన ఫలితాలపై దృష్టి పెట్టి తదుపరి అధ్యాయానికి వెళ్లేముందు, ప్రస్తుతం చెప్తున్న పాఠంలోని ముఖ్య ఉద్దేశ్యాలు, అభ్యసన ఫలితాలను విద్యార్థులు సాధించారో లేదో చూసుకోవాలని సూచించారు. ప్రతి చాప్టర్ పూర్తయిన తర్వాత క్రమం తప్పకుండా నిరంతర మూల్యాంకనం, అసెస్‌మెంట్‌లు, తరగతి గది కృత్యాలు, రివిజన్ నిర్వహించాలన్నారు. హెడ్ మాస్టర్లు సిలబస్ పురోగతిని నిశితంగా పర్యవేక్షి ంచాలిలన్నారు. ఉపాధ్యాయులు తమ రోజువారీ బోధనా పురోగతి రికార్డులను అప్‌డేట్ చేస్తూ ఉండాలన్నారు. అలాగేవెనుకబడిన విద్యార్థుల కోసం విద్యార్థుల్లో అభ్యాస లోపాలు ఉంటే, సాధారణ షెడ్యూల్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక బోధన ప్రణాళికను అమలు చేయా లన్నారు. సారాంశంలో, సిలబస్‌ను కేవలం పూర్తి చేయడం మాత్రమే కాకుండా, విద్యార్థులకు అర్థమయ్యేలా నిర్ణీత సమయంలో నాణ్యమైన బోధన అందించడమే మార్గదర్శకాల ప్రధాన ఉద్దేశ్యమని డైరెక్టర్ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

# జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యం

### ఉత్తర తెలంగాణ పంపిణీ సంస్థ సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:**జీరో ప్రమాదాల లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. పని చేసే ప్రాంతంలో ఒక్క నిమిషం ఆగి భద్రత పరికరాలు ధరించి, లైన్ మీద అవగాహన తెచ్చుకొని పని చేసే నిబంధన తీసుకువస్తామన్నారు. ఎన్పీడీసియల్ సర్కిల్ పరిధిలో సోమవారం విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ జీరో ప్రమాదాల స్థాయికి తీసుకువచ్చేందుకు ఈ నెల 1 నుండి 7 వ తేదీ వరకు ఎన్పీడీసీఎల్ వ్యాప్తంగా విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే రెండు సంవత్సరాలలో సాంకేతికతతో మన వర్క్ మొత్తం స్మార్ట్ గా మారుతుందన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. దేశ అభివృద్ధిలో విద్యుత్ శాఖ కీలకంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రతి వినియోగదారునికి విద్యుత్ ప్రమాదాల పట్ల అవగాహన కలిగిస్తూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేసేటప్పుడు విద్యుత్ భద్రత పరికరాలు ఖచ్చితంగా వాడాలని ఆదేశించారు. ప్రతిరోజు సెక్షన్ స్థాయిలో పెప్ టాక్ నిర్వహిస్తున్నామన్నారు. డిపార్ట్మెంట్ పరంగా విద్యుత్ ప్రమాదాల అసలు జరగకూడని అందుకు భద్రతే ప్రామాణికమని తేల్చి చెప్పారు. ప్రమాద భరితంగా ఉన్న లొకేషన్స్ గుర్తించి పరిష్కరించాలని, తక్కువ ఎల్సిలు ఉండేలా చూడాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసినప్పుడు రెండు వైపులా ఎర్తింగ్ ఉండేటట్లు చూసుకోవాలన్నారు. నిర్లక్ష్యంతో లైన్లు ఎక్కి ప్రమాదాలు జరగకుండా హెచ్చరికలు జారీ చేస్తున్నామని వెల్లడించారు. విద్యుత్ భద్రత పరికరాలు వాడకుండా ఎక్కి లైన్‌లలో పనిచేస్తే పనిష్మెంట్లు ఉంటాయన్నారు. వినియోగదారులు ఇండ్లలో నాసిరకపు వైరింగ్ వలన, రైతులు తడిచేతులతో పనిచేయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఇళ్లపైన నుండి వెళ్లే లైన్లను మార్చాలన్నారు. వినియోగదారునికి క్షణం అంతరాయం జరిగిన దానిని సీరియస్‌గా తీసుకోవాలని పేర్కొన్నారు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధిచెందుతున్నామని,జిఐఎస్ మ్యాపింగ్ ద్వారా నెట్వర్క్ పూర్తిగామారిందని, లొకేషన్ చూసుకొని త్వరిత గతిన అంతరాయాలు తగ్గించడానికి ఆస్కారంఉంటుందని చెప్పారు. టెలి స్కోపిక్ టెస్టర్‌లు త్వరలో అందిస్తామన్నారు. త్వరలో నియామకాలు చేపడతామని చెప్పారు.

# రాష్ట్రంలో ప్రాయోజిత పథకాల అమలు భేష్

### భవిష్యత్‌లో ఆర్థిక సహాయాన్ని అందిస్తాం

### పెండింగ్ సమస్యల పరిష్కారానికి హామీ

### ప్రశంసించిన కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత కార్యదర్శి సుధాన్ష్



**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** తెలంగాణలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ పథకాలు ప్రధానంగా ప్రాయోజిత పథకాలు అమలు తీరు భేష్‌గా ఉందని కేంద్రం ప్రశంసించింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ పేరెంటల్ సపోర్ట్ యాక్ట్ పనితీరును అభినందించింది. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలును హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ కార్యదర్శి సుధాన్ష్ పంత్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అట్టడుగు వర్గాల అభ్యున్నతిని లక్ష్యంగా చేసుకున్న కీలక సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించింది. వీటిలో ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, పౌర హక్కుల పరిరక్షణ, ఎస్సీ, బీసీ హాస్టళ్ల నిర్మాణం, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సమగ్ర పునరావాసం, జాతీయ యాంత్రిక పారిశుధ్య పర్యావరణ వ్యవస్థ కార్యాచరణ (నమస్తే), యాంత్రిక పారిశుధ్య పర్యావరణ వ్యవస్థ కోసం జాతీయ కార్యాచరణ వంటివి ఉన్నాయి. ఈ సందర్భంగా కేంద్ర కార్యదర్శి సుధాన్ష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పురోగతిని అభినందిస్తూ, మరింత లోతైన ప్రభావం చూపాలని పిలుపునిచ్చారు.

భవిష్యత్తులో మెరుగైన ఆర్థిక సహాయాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. తద్వారా అర్హులైన లబ్ధిదారులకు విస్తృత కవరేజీ, అధిక ప్రయోజనాలు చేకూరుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణలోని తల్లిదండ్రుల భరణ చట్టం అనే ప్రగతిశీల చొరవను ఆయన అభినందిస్తూ, ఇది సామాజిక భద్రత దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు. లక్షిత లబ్దిదారులకు మరింత వేగంగా, సమర్థవంతంగా పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అంతే కాకుండా అవసరమైన అదనపు ఆర్థిక సహాయాన్ని అందించడానికి కేంద్రం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగుల సంక్షేమ శాఖల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



# సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాక్స్‌విజన్ వ్యవస్థాపకుడు ప్రసాద్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే4:** మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ కాసు ప్రసాద్‌రెడ్డి సోమవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మాక్స్‌విజన్ ఆసుపత్రి 30వవార్సికోత్సవానికి ముఖ్య అతిథిగా రావాల్సిందిగా ఆహ్వానించారు.

# ఉచిత డిస్కమ్‌కు 532 దరఖాస్తులు

### ఉద్యోగులకు 8 వరకూ గడువు పొడిగింపు

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** తెలంగాణలోని కొత్తగా ఏర్పాటు చేసిన ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థకు బదిలీపై వెళ్లేందుకు పలువురు ఉద్యోగులు ముందుకొస్తున్నారు.రాష్ట్రంలోని వివిధ విద్యుత్ సంస్థలకు చెందిన ఉద్యోగులు, అర్టిజన్ల నుండి 532 దరఖాస్తులు అందాయి. దీంతో దరఖాస్తుల గడువును ఏప్రిల్ 30 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు పొడిగిస్తూ విద్యుత్ శాఖ నిర్ణయించింది. ఇప్పటివరకు, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నుండి 272 దరఖాస్తులు, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నుండి 210 దరఖాస్తులు, తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (జెన్కో) నుండి 35 దరఖాస్తులు, ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ (ట్రాన్స్కో) నుండి 7 దరఖాస్తులను ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థకు వచ్చాయి. నీటిపారుదల తదితర కీలక రంగాలకు ఉచితంగా నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు, రాష్ట్రంలోని మూడవ విద అయిన ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఆర్‌పీడీసీఎల్) 2026 జూన్ 2 నుంచి కార్యకలాపాలు ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు.

# అణు యూనిట్లుగా థర్మల్ ప్లాంట్లు

### దేశ వ్యాప్తంగా 10 పాత ప్లాంట్లు ఎంపిక

### అణు విద్యుత్ 100 గిగా వాట్లకు పెంపు

### ప్రస్తుత సామర్థ్యం 484.82 గిగావాట్లు

### కీలక సభ్యులతో సైట్ ఎంపిక కమిటీ నిర్ణయం

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించడంతో పాటు, మిగులును సాధించే దిశగా కేంద్రం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న 8.8 గిగావాట్ల నుండి 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యాన్ని చేరుకోవాలనే కేంద్రం యొక్క ప్రతిష్టాత్మక లక్ష్యంలో భాగంగా కాలపరిమితికి దగ్గరగా ఉన్న పాత థర్మల్ విద్యుత్ ప్లాంట్లను అణు విద్యుత్ యూనిట్లుగా మార్పు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. 2032 నాటికి మొదట 22 గిగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యాన్ని చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇంధన మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం దేశంలో మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యం ఇప్పుడు 484.82 గిగావాట్లుగా ఉంది. వీటిలో 184.62 గిగావాట్ల పునరుత్పాదక శక్తి, 49.38 గిగావాట్ల పెద్ద జల విద్యుత్, 8.78 గిగావాట్ల సామర్థ్యం కలిగిన అణు విద్యుత్ ఉత్పత్త ప్రాజెక్టులు ఉండగా, బొగ్గు, పెట్రోలియం, సహజ వాయువు వంటి శిలాజ అధారిత ఉష్ణ విద్యుత్‌కు సంబంధించి 242.04 గిగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2047 నాటికి దేశంలో 10 పాత థర్మల్ ప్లాంట్లను అణు విద్యుత్ యూనిట్లుగా మార్చ నుంది. విద్యుత్ యూనిట్లలో తిరిగి ఉపయోగించేందుకు వివిధ ప్రాంతాల్లోని 10 పాత లేదా రిటైర్డ్ థర్మల్ విద్యుత్ కేంద్రాలను గుర్తించింది. వీటిని తనిఖీ చేసి ప్రాథమికంగా అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై భారత అణు విద్యుత్ సంస్థ సభ్యులతో కూడిన సైట్ ఎంపిక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ గుర్తించిన ఆయా ప్రదేశాలను తనిఖీల తర్వాత తుది నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ ప్రక్రియలో మొదటి అడుగు. అణు విద్యుత్ ప్లాంట్ల ఎంపిక థర్మల్ యూనిట్ల ఏర్పాటు కంటే చాలా కఠినమైనదని, కాబట్టి ప్రక్రియకు సమయం పడుతుందని పేర్కొన్నాయి. ప్రధానంగా స్థల ఎంపిక ప్రక్రియ ప్లాంట్ల భూకంప తీవ్రత, నీటి లభ్యత మరియు సమీపంలోని నివాస స్థలంపై ఆధారపడి ఉంటుంది. అయితే తుది నిర్ణయం తీసుకునే ముందు అణు విద్యుత్ ప్లాంట్ చుట్టూ కనీసం 1 కిలోమీటర్ల పరిధికి లోడిన మండలాలను గుర్తించడం, ప్రజా నివా సాలకు నిషేధాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుందని అధికారవర్గాలు తెలిపాయి. విద్యుత్ మంత్రిత్వ శాఖ మార్చబడిన థర్మల్ యూనిట్లలో చిన్న మాడ్యులర్ రియాక్టర్లను ఏర్పాటు చేయడంతో సహా, పరిమాణం మరియు వనరుల లభ్యత ఆధారంగా, అణు విద్యుత్ ఉత్పత్తి యొక్క వివిధ పద్ధతులను అంచనా వేస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించి గుజరాత్‌లోని వానక్‌బోరి థర్మల్ పవర్ ప్లాంట్‌ను కూడా ఒక బృందం సందర్శించింది. ఈ సైట్‌లో ఒక్కొక్కటి 210 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఏడు యూనిట్లు ఉన్నాయి. మిగిలిన పాత థర్మల్ యూనిట్ల ప్రాంతాలను అణు విద్యుత్ కమిటీ పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు.

# పన్ను ఎగవేత దారులపై నజర్

### రూ.2 వేల కోట్ల అదనపు రాబడిపై

### వాణిజ్య పన్నులశాఖ దృష్టి

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** పన్ను ఎగవేతదారుపై వాణిజ్య పన్నుల శాఖ దృష్టిసారించింది. పన్ను చెల్లించకుండా అడ్డదారుల్లో వెళుతున్న వ్యాపార, వాణిజ్య, చివరకు ప్రభుత్వ శాఖల్లోని ఆదాయానికి గండి కొడుతున్న అక్రమార్కుల భరతం పట్టే దిశగా ముందుకు వెళుతోంది. తద్వారా సాధారణంగా వాణిజ్య పన్నుల కింద వచ్చే ఆదాయం కంటే మరో 1,500 నుండి 2 వేల కోట్ల రూపాయల వరకూ అదనంగా వసూలు చేయాలనే లక్ష్యంతో ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కాగా రాష్ట్రంలో జీఎస్టీ రాబడుల్లో భారీ స్థాయిలో పెరుగుదల నమోదవుతోంది. ఈ ఏడాది జనవరి నుండి వరుసగా నాలుగు నెలలుగా వసూళ్లు స్థిరంగా రూ.4 వేల కోట్లను మించిపోతున్నాయి. గత నెలలో రికార్డు స్థాయిలో రూ.4,621 కోట్ల జీఎస్టీ ఆదాయాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే నెలలో రూ.3,433 కోట్ల ఆదాయం ఖజానాకు చేరగా, ఈ ఏడాది దాని కంటే 35 శాతం అధికం కావడం విశేషం. మెరుగైన నిబంధనల పాటింపు, ఆర్థిక పురోగతి కారణంగా జీఎస్టీ ప్రారంభమైనప్పటి నుండి ఇదే అత్యధిక నెలవారీ వసూళ్లు సాధ్యమయిందని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో దీన్ని మరింతగా పెంచాలనే లక్ష్యంతో వాణిజ్య పన్నుల శాఖ పక్కా ప్రణాళిక ప్రకారం వ్యవహరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ముఖ్యంగా పన్ను ఎగవేతదారుల భరతం పట్టి తద్వారా ఆదాయాన్ని భారీగా పెంచుకోవాలని ప్రయత్నిస్తోంది.

# ఏటీఎంలు మూసివేత లేదు

### స్పష్టత ఇచ్చిన బ్యాంకులు, ఇంధన కొరత లేదన్న ఐఒసి

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** దేశంలో ఏటీఎంలు మూసివేత లేదని, ఇదే సమయంలో డిజిట్ సేవలు సైతం యదాతథంగా పనిచేస్తాయని బ్యాంకులు స్పష్టతనిచ్చాయి. దేశంలో ఏటీఎంలు మూతపడతాయంటూ సామాజిక మాధ్యమాల్లో కొన్ని తప్పుడు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ వార్తలను దేశంలోని అగ్రశ్రేణి బ్యాంకులు ఖండించాయి. తమ ఏటీఎంలతో పాటు అన్ని డిజిటల్ సేవలు పూర్తిస్థాయిలో, సజావుగా పనిచేస్తున్నాయని స్పష్టం చేశాయి. ఏటీఎంలు ఏవీ మూసి వేయడం లేదని, క్యాష్ డిపాజిట్ మెషీన్లు మరియు డిజిటల్ సేవలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, ప్రజల వినియోగానికి అందుబాటులో ఉన్నాయిని వెల్లడించాయి. మరోవైపు, దేశంలో ఇంధన కొరత ఏర్పడుతుందన్న ఆందోళనలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తోసిపుచ్చింది.దేశవ్యాప్తంగా తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా మార్గాలు సజావుగా పనిచేస్తున్నాయని స్పష్టం చేసింది. అనవసరంగా కొనుగోళ్లు చేయవద్దని, ఇంధనం, ఎల్పీజీ అన్ని అవుట్‌లెట్లలో సులభంగా అందుబాటులో ఉన్నాయని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.




తెలంగాణ టిజి20 ఐపిఎల్ లోగోను ఆవిష్కరించిన డిజిపి సివి ఆనంద్, సినీనటుడు వెంకటేష్ తదితరులు

# కేరళం ప్రజలు దేశానికే ఆదర్శంగా నిలిచారు: మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే4:** అధికారం ఉన్నా లేకున్నా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగబద్ధమైన విలువల కోసమే పోరాడుతుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. కేరళంలో విజయం ఆ పోరాటానికి దక్కిన గుర్తింపు అని వ్యాఖ్యానించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాయని అన్నారు. కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కూటమి సాధించిన ఘన విజయం, ప్రజాస్వామ్య విలువలపై ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనం అని, విద్వేష రాజకీయాలపై వివేకపు గెలుపు అని పేర్కొన్నారు. విభజన రాజకీయాల కంటే అభివృద్ధి, ఐక్యత, లౌకిక విలువలకే ప్రజలు పెద్దపీట వేస్తారని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయని చెప్పారు. కేరళం ప్రజలు విద్వేషానికి తావులేకుండా, అభివృద్ధిని, ఐక్యతను ఎంచుకుని దేశానికే ఆదర్శంగా నిలిచారని వ్యాఖ్యానించారు. కేరళంతో పాటు ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు ప్రదర్శించిన పోరాట పటిమ అభినందనీయమని అన్నారు.

# కేరళంలో కాంగ్రెస్ అద్భుత విజయం: మహేశ్‌కుమార్ గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే4:** కేరళంలో కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయం సాధించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రగతిశీల పాలన, ప్రజాస్వామ్య విలువలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ఈ తీర్పు ప్రతిబింబిస్తుందని వ్యాఖ్యానించారు. కేరళంలో తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు,నాయకులు ప్రచారం నిర్వహించడం, తెలంగాణ పాలన చూసి ఓట్లు వేయాలని కోరడం చాలా ప్రభావం చూపిందన్నారు. కేరళంలో విజయం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలాన్ని మరోసారి విజయం సాధిస్తామన్న నమ్మకాన్ని కలిగించిందని వెల్లడించారు. తమిళనాడులో మెజారిటీ స్థానాలు గెలుచుకున్న టీవికే అధినేత విజయ్‌కు అభినందనలు తెలిపారు. ఈ ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఇండి కూటమి సమీక్ష చేసి మరింత బలోపేతం అయ్యేందుకు చర్యలు చేపడుతుందని తెలిపారు. యూడీఎఫ్‌ను కేరళ ప్రజలు ఆదరించడం ఆనందంగా ఉందని తెలంగాణ రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ అన్నారు. ప్రజలు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు.

# హజ్ యాత్రికులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే4:** తెలంగాణ ప్రభుత్వం హజ్ యాత్రికులకు గుడ్ న్యూస్ తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో హజ్ యాత్ర ఖర్చులు భారీగా పెరిగాయి. ఈ అదనపు భారాన్ని పేద ముస్లిం సోదరులపై పడకుండా, ఆ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ"హజ్ యాత్రికులకు అదనంగా అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుంది. ఈ నిర్ణయం వల్ల సుమారు 7 వేల మంది హజ్ యాత్రికులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ముస్లిం యాత్రికులకు ఈ నిర్ణయం ఎంతో ఉపశమనాన్ని ఇస్తుంది. ముస్లిం సోదరులకు ప్రభుత్వం అండగా ఉంటుంది' అని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్రంలోని హజ్ యాత్రికులు, మైనారిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణలో వచ్చే ప్రభుత్వం బిజెపిదే

### ఐదు రాష్ట్రాల ఎన్నికలు కూటమికి బుద్ధిచెప్పాయి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

### పార్టీలో చేరిన పలువురు వైద్యులు



**హైదరాబాద్, మే 4 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీలో డాక్టర్స్ సెల్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులు భారతీయ జనతా పార్టీలో చేరడం అభినందనీయమని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. సోమవారం భారతీయ జనతా పార్టీ డాక్టర్స్ సెల్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులు భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికీ రాంచందర్ రావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ కూకట్‌పల్లి ప్రాంతం నుంచి మైనారిటీ సోదర సోదరీమణులు బిజెపిలో చేరడం సంతోషకరం అన్నారు. పార్టీలో చేరిన వారందరికీ నేను హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాను. బిజెపి గురించి కొంతమంది కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బిజెపి ఏ మతానికీ, ఏ వర్గానికీ వ్యతిరేకం కాదని నేను స్పష్టంగా చెబుతున్నాను. ఈ విధమైన అపోహలు సృష్టించి మైనారిటీలను బిజెపికి దూరం చేయాలనే ప్రయత్నాలు కొన్ని పార్టీలు చేశాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్" అనే సిద్ధాంతంతో దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. దేశంలో ముస్లిం సమాజానికి చెందిన అనేక మంది, ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు గతంలో అన్యాయం ఎదుర్కొన్నారు. అలాంటి వర్గాలకు న్యాయం చేయడానికి మోదీ అనేక నిర్ణయాలు తీసుకున్నారు. అందుకే దేశంలోని ముస్లిం సోదరసోదరీమణులు కూడా మోదీని విశ్వాసంతో చూస్తున్నారు. మహిళల సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నారీ శక్తి వందన్ చట్టం ఎంతో కీలకమైనదని అన్నారు. ఈ బిల్లుకు ప్రతిపక్షాలు సంపూర్ణ మద్దతు ఇచ్చి ఉంటే, దేశంలో ముఖ్యంగా ముస్లిం మహిళలకు మరింత రాజకీయ అవకాశాలు లభించేవి. కానీ కొంతమంది రాజకీయ నాయకులు స్వార్థపూరిత ధోరణితో మహిళలకు అవకాశాలు కలగకుండా అడ్డంకులు సృష్టించారు. ఈ రోజు చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే నారీ శక్తి వందన్ అధినియం అనే బిల్లు పాస్ అయ్యి ఉంటే, పార్లమెంటులో ప్రతిపక్షాలు మద్దతు పలికి ఉంటే, ఈ రోజు అనేక మంది ముస్లిం మహిళలకు ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా అయ్యే అవకాశం లభించేది. కానీ ఒక అసదుద్దీన్, అక్బరుద్దీన్ ఓవైసీలే ఉండాలనే యావతో మహిళలకు అవకాశాలు లభించకూడదనే ఆలోచనతో వారు అడ్డంకులు సృష్టించారు. ఈ రోజు దేశవ్యాప్తంగా మహిళలంతా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా మహిళలు కాంగ్రెస్ పార్టీకి, ఇండీ అలయెన్స్‌కు బుద్ధి చెప్పారని ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల ద్వారా స్పష్టంగా వెల్లడవుతుందన్నారు.

మే 10వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ రాబోతున్నారు. మూడోసారి ప్రధాని అయ్యాక, నేను బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా మన ప్రధాని నరేంద్ర మోదీ మన తెలంగాణకు విచ్చేస్తున్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే 2 లక్షలకు పైగా జరిగే భారీ బహిరంగ సభకు భూమిపూజ కూడా నిర్వహించాం, హైదరాబాద్‌తో పాటు తెలంగాణ ప్రజలు ప్రధాని నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికేలా పెద్దఎత్తున తరలిరావాలన్నారు.

# బిజెపి టార్గెట్ తెలంగాణనే: టి.బిజెపి ఆసక్తికర ట్వీట్

### బెంగాల్‌లో విజయంతో తెలంగాణలో కమలనాథుల సంబురాలు



**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:**పశ్చిమ బెంగాల్‌లో బిజెపి విజయం ఆపార్టి తెలంగాణ రాష్ట్ర శ్రేణుల్లోనూ నూతనోత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా గతంలో బెంగాల్ బిజెపి చేసిన ట్వీట్‌ను కోట్ చేస్తూ తెలంగాణ బిజెపి తన అధికారిక ఎక్స్ ఖాతాలో సోమవారం ఆసక్తికర పోస్టు పెట్టింది. బిజెపి తదుపరి లక్ష్యం తెలంగాణనేనంటూ ట్వీట్ చేసింది. ఈ పోస్టును పార్టి అకౌంట్లో పిన్ ట్వీట్‌గా ఉంచడంతో వైరల్‌గా మారింది. కాగా.. 2025లో జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 243 స్థానాలకుగానూ 202 స్థానాల్లో గెలుపొంది ఎన్డీయే కూటమి రికార్డు సృష్టించింది. ఆ డబుల్ సెంచరీ ఉత్సాహంలో నాడు నెక్స్ పశ్చిమ బెంగాల్ అంటూ అప్పట్లో బెంగాల్ బిజెపి ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ ట్వీట్ చేసింది. తాజాగా బెంగాల్‌లో విజయంతో ఆ ట్వీట్‌ను టీ. బిజెపి కోట్ చేస్తూ నెక్స్ తెలంగాణనే టార్గెట్ అంటూ ట్విట్ చేసింది.

**బిజెపి శ్రేణుల సంబురాలు..** పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ఘన విజయంపై తెలంగాణలో ఆ పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నాంపల్లిలోని శ్యాంప్రసాదన ముఖర్జీ భవన్‌లో పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. దీంతో టి. బిజెపి రాష్ట్ర కార్యాలయం ఎదుట సోమవారం సందడి వాతావరణ నెలకొంది. కార్యకర్తలు, నేతలు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. మిఠాయిలు పంచుకున్నారు. కార్యకర్తలతో కలిసి నేతలు స్టెప్పులు వేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు, కార్యకర్తలు ఆసక్తికర ఫ్లెక్సీలు ప్రదర్శించారు. త్రిమూర్తులు బెంగాల్ రాజకీయ చరిత్రను తిరగరాశారని పేర్కొంటూ ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబీన్ చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీలతో నినాదాలు చేశారు. అలాగే టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రాలు ఉన్న ఫ్లెక్సీలను ప్రదర్శించారు. మమతా బెనర్జీ బాటలోనే సీఎం రేవంత్ నడుస్తున్నారని అందులో పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురడం ఖాయమని పేర్కొన్నారు.

# ఇంటిగ్రేటెడ్‌కు రూ.10వేల కోట్లు

### ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఒకే ప్రాంగణం

### కేంద్రానికి నివేదిక సిద్ధం చేస్తున్న ఆర్థిక శాఖ

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఒకే గొడుగు కింద ప్రతిష్టాత్మంగా తీసుకున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యమ్నాయ వనరుల సమీకరణపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా ఈ గురుకులాల నిర్మాణం నిమిత్తం భారీగా నిధులు అవసరమవుతుందని అంచనా వేసింది. ఇందులో రూ.10 వేల కోట్లు కేంద్రం నుండి సేకరించేందుకు ఆర్థిక శాఖ అధికారులు ప్రతిపాదనలు చేస్తున్నారు. ప్రధానంగా రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి కోసం కేంద్రం అందిస్తున్న ప్రత్యేక సహాయ పథకం కింద కనీసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని కోరుతోంది. ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని నిర్మించాలన్న సంకల్పంతో కేంద్రం నుంచి అందే వడ్డీ లేని రుణాలను పూర్తిస్థాయిలో వినియో గించుకోవాలని భావిస్తున్నారు. ఇందుకు గాను రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం స్కీం ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ (సాస్కి) పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రాలకు 50 ఏండ్ల కాలపరిమితితో దాదాపు రూ.1.50 లక్షల కోట్ల మేర వడ్డీ లేని రుణాలను కేటాయించింది. ఈ భారీ నిధి నుంచి తెలంగాణకు దక్కాల్సిన వాటాను యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్‌కు మళ్లించేందుకు ప్రణాళిక వేస్తోంది. ఈ మేరకు దీనికి సంబంధించి ఆర్థిక శాఖ సమగ్రమైన ప్రాజెక్ రిపోర్టును సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# సంక్షేమ హాస్టళ్లకు నిత్యావసరాలు

### కామన్ ప్రొక్యూర్‌మెంట్‌లో సేకరణ

### కొనసాగుతున్న టెండర్ల ఖరారు ప్రక్రియ

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లకు జూన్ నాటికి నిత్యావసర వస్తువులను కామన్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాణ్యతను నిర్ధారించడం, కాలపరిమితులకు కట్టుబడటం, పర్యవేక్షణ సులభతరం వంటి కీలక అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ కొత్త విధానాన్ని అవలంబిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు వెల్లడించారు. గతంలో జిల్లా స్థాయి సేకరణ కమిటీల ద్వారా సరఫరాదారులను ఖరారు చేసేవారు. కానీ ఈసారి ఈ సేకరణ ప్రక్రియను ఏకీకృత రాష్ట్ర స్థాయి చట్రం కింద నిర్వహించనున్నారు. ఈ సేకరణ ప్రక్రియను పర్యవేక్షించడానికి, ఒక ప్రత్యేక ప్రాజెక్ట్ పర్యవేక్షణ విభాగాన్ని ఏర్పాటు చేసి, దాని నిర్వహణ పరిపాలనా బాధ్యతలను ఎస్సీ గురుకుల సొసైటీకి అప్పగించారు. సంక్షేమ హాస్టళకు కావాల్సిన 9 లక్షల మందికి పైగా విద్యార్థులకు యూనిఫాం, టై, బెల్ట్, నోటుపుస్తకాలు,బూటు,సాక్స్, రగ్గులు, మ్యాచ్, దుప్పట్లు, ట్రంకు పెట్టులు, డ్రెస్, ట్రాలీ బ్యాగ్‌లు, పీటీ డ్రెస్, నైట్ డ్రెస్ తదితర వస్తువులను సేకరించే ప్రక్రియ కొనసాగుతోంది.సాంఘికసంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో టెండర్ల పరిశీలన,ఎంపిక తదితర అంశాలు కొనసాగుతున్నాయి.

# కోయంబత్తూరు పారిశ్రామికవేత్త నోబెల్ బహుమతికి నామినేట్

**కోయంబత్తూరు, మే 4:** భారతదేశ ప్యాడ్‌మ్యాన్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కోయంబత్తూరుకు చెందిన పారిశ్రామికవేత్త అరుణాచలం మురుగనందం నోబెల్ బహుమతికి నామినేట్ అయ్యారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా వెల్లడించారు. 2026 సంవత్సరానికి గానూ ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతికి తన పేరు నామినేట్ అయినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు తక్కువ ధరకే శానిటరీ ప్యాడ్లను అందుబాటులోకి తెచ్చి, వారి ఆరోగ్య పరిరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినందుకు గాను ఆయన ఈ గుర్తింపునకు చేరువయ్యారు. మొదట తాను నమ్మలేకపోయానని. పుదుచ్చేరిలోని అరవింద్ కంటి ఆసుపత్రి డీన్, అక్కడి అమెరికన్ బృందాలు నా పేరును ప్రతిపాదించాయి. 24 గంటల్లోనే తన నామినేషన్ ఆమోదం పొందిందని. ఇది తనకు ఎంతో గర్వంగా ఉందని ఒక వార్తా సంస్థతో మురుగనందం తన సంతోషాన్ని పంచుకున్నారు. తమిళనాడుకు చెందిన అరుణాచలం జీవితం ఆధారంగానే 2018లో ప్యాడ్ మ్యాన్ చిత్రం తెరకెక్కింది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ప్రధాన పాత్ర పోషించారు.ఈ సినిమా సామాజిక అంశాలపై ఉత్తమ చిత్రంగా జాతీయ అవార్డును కూడా గెలుచుకుంది. సాధారణంగా నోబెల్‌బహుమతి నామినేషన్ల ప్రక్రియ ఎనిమిది నెలలపాటు చాలా క్లిష్టంగా సాగుతుంది.

# విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపిన హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే4:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో టీవీకే పార్టీ ఘన విజయం సాధించడం పట్ల బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు ట్విటర్‌లో స్పందించారు. ఈ సందర్భంగా టీవీకే అధినేత, నటుడు విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.తమిళనాడు రాజకీయాల్లో అద్భుతమైన అరంగేట్రం చేసిన నటుడు విజయ్‌కు అభినందనలు తెలిపారు ఈ ప్రజా తీర్పు ప్రజల ఆశలను ప్రతిబింబిస్తోందని, ప్రజా జీవితంలో ఆయన తన ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.





# బ్యాట్స్‌మెన్ గుండెల్లో రైళ్లు

## ఐపీఎల్-2026లో సత్తా చాటుతున్న బౌలర్లు

**ఇండియన్ ప్రీమియర్ లీగ్.. ఇది కాసుల క్రికెట్‌గా, భారీ ఎంటర్‌టైన్‌మెంట్ స్పోర్ట్ ఈవెంట్‌గా మారిందా? అంటే అవుననే అంటున్నారు మాజీ క్రికెట్ దిగ్గజాలు. ముత్తయ్య మురళీధరన్ వంటి దిగ్గజాలు నోసలు చిట్లిస్తున్నారు. ఐపీఎల్ వల్ల క్రికెట్ కిల్ అవుతోందని వాపోతున్నారు. ఐపీఎల్‌లో బౌలర్లకు అవకాశం తక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా అవకాశం వచ్చినపుడు తామేం తీసిపోమని బౌలర్లు చాటిచెబుతున్నారు**







(వార్త క్రీడా విభాగం)

ఐపీఎల్ ఇది ఫక్తు వ్యాపార వేదికగా మారిందనేది క్రీడా నిపుణులు, అభిమానులూ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. క్రికెట్, వినోదం కలయికగా ఐపీఎల్ మారింది. భారీ స్కోర్లు, సిక్సర్లు, ఫోర్లు ఇవి మాత్రమే ప్రేక్షకులను అలరిస్తాయి. ఇదే వ్యాపార సూత్రంగా బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌లు, ఇంపాక్ట్ ప్లేయర్లు వంటి మాస్ హిట్ ఫార్ములా వచ్చాయి. ఈ ఐపీఎల్‌లోనే చూసుకుంటే శతకాల మోత మోగుతోంది. ఇప్పటివరకు 9 సెంచరీలు నమోదయ్యాయి. మరో అరుగురు నైంటీస్‌లోకి వచ్చారు. ఇక సిక్స్‌లయితే 833, బౌండరీ లయితే 1436 పారాయి. ఇక ఈ ఐపీఎల్ సీజన్ 200 ప్లస్ స్కోర్ల విషయంలోనూ రికార్డులు నెలకొల్పుతోంది. 37 సార్లు 200కు పైగా పరుగులు నమోదయ్యాయి. ఇక అరుణ్ జైట్లీ స్టేడియంలోనైతే ఒకే మ్యాచ్‌లో 529 పరుగుల వరద పారింది. ఢిల్లీ క్యాపిటల్స్ ఇచ్చిన 265 రన్స్ టార్గెట్‌ను సైతం పంజాబ్ కింగ్స్ ఉఫ్‌మనిపించింది. 200 ప్లస్ పరుగులు చేసినా గెలుస్తామన్న ధీమా జట్లలో పెరిగింది. బంతి పడిందా స్టాండ్స్‌లోకి పంపామా అన్నదే యువ ప్లేయర్ల తీరుగా మారింది. ఎన్నో విభిన్న షాట్లు వచ్చిపడుతున్నాయి.

ఇంతటి బ్యాటింగ్ డామినేట్ గేమ్‌లోనూ బౌలర్లు కీరోల్ పోషిస్తున్నారు. తమపదునైన బంతులతో బ్యాట్స్‌మెన్ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. 200 ప్లస్ పరుగులు నమోదవుతున్న చోటనే లో స్కోర్లు అగుపిస్తున్నాయి. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీని 75 పరుగులకే ఆర్సీబీ కట్టడిచేయగలిగింది. ఇక వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్, రబడ, అర్చర్, కంబోజ్, మలింగ, ప్రసిద్ధ్ కృష్ణ వంటి పేసర్లు బ్యాట్స్‌మెన్‌కు తమ పేస్ రుచి చూపిస్తున్నారు. ఆరంభంలోనే వికెట్లు తీస్తూ తమ జట్ల విజయాల్లో కీ రోల్ పోషిస్తున్నారు. భువనేశ్వర్ కుమార్, కంబోజ్ చెరో 17 వికెట్లతో టాప్‌లో కొనసాగుతున్నారు. రబడ 16 వికెట్లు...అర్చర్, మలింగ 15 వికెట్లు తరువాతి స్థానాల్లో ఉన్నారు. మేమేం తక్కువా అన్నట్లు స్పిన్నర్లు కూడా తిప్పేస్తున్నారు. రషీద్‌ఖాన్, రవి భిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి తమదైన రోజున బంతిని తిప్పేస్తూ ఒంటిచేత్తే విజయాలు అందిస్తున్నారు.

మొత్తంగా చెప్పాలంటే, ఇండియన్ ప్రీమియర్ లీగ్ అత్యంత విజయవంతమైన ప్రొఫెషనల్ క్రికెట్ లీగ్‌గా, అదే సమయంలో, భారీ వినోదాన్ని అందించే వ్యాపారంగా అభివృద్ధి చెందింది.




## ఛేజింగ్‌లో చెలరేగిన రోహిత్, రికల్టన్: ముంబై విన్

**ముంబై:** వాంఖడేలో పరుగుల వరద పారింది. లక్నో సూపర్ జెయింట్స్ నిర్దేశించిన 229 పరుగుల ఛేజింగ్‌లో ముంబై ఓపెనర్లు ర్యాన్ రికల్టన్(32 బంతుల్లో 6 ఫోర్లు, 8సిక్స్‌లతో 83), రోహిత్ శర్మ(44 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్‌లతో 84) చెలరేగారు. సిక్స్‌లు, ఫోర్లతో లక్నో బౌలర్లపై చెలరేగుతూ ఓవర్‌కు 14కు పైగా పరుగులు సాధించారు. తొలి వికెట్‌కు 11 ఓవర్లలోనే 143 పరుగుల భాగస్వామ్యం అందించి విజయానికి బాటలు వేశారు. ఇద్దరూ సెంచరీల మోత మోగించే ఊపులో కనిపించినా.. మోసిన్ ఖాన్ బంతికి రికల్టన్, సిద్దార్థ్ బంతికి రోహిత్ శర్మ వెంటవెంటనే పెవిలియన్ చేరారు. తిలక్‌వర్మ(11), స్టాండ్ ఇన్ కెప్టెన్ సూర్యకుమార్(12) నిరాశపరిచారు. దీంతో మ్యాచ్ ఉత్కంఠ రేపినా నమన్ ధీర్(23 నాటౌట్), విల్ జాక్స్(10 నాటౌట్) ధాటిగా ఆడి మిగతా పనిని పూర్తి చేశారు. దీంతో ముంబై ఇండియన్స్ మరో 8 బంతులు మిగిలి ఉండగానే 4 వికెట్లు కోల్పయి అందుకుంది. ఇప్పటికే ప్లే ఆఫ్‌కు దూరమైన ముంబై ఇండియన్స్‌క ఇది ఊరటనిచ్చే విజయం.




అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన లక్నో బ్యాటర్లు చెలరేగారు. జోష్ ఇంగ్లిష్(13) వికెట్ తొందరగానే కోల్పోయినా మిచెల్ మార్ష్(25 బంతుల్లో 44), నికోలస్ పూరన్(21 బంతుల్లో63) మెరుపుఇన్నింగ్స్ ఆడారు. పవర్ ప్లే ముగిసేసరికి స్కోరును 90కు చేర్చారు. 6.5 ఓవర్లలో స్కోరును వంద దాటించారు. రెండో వికెట్‌కు94 రన్స్ అందించారు. ఈ క్రమంలో పూరన్ 16 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. వీరిద్దరూ ఉన్నంత సేపు స్కోరు 250 దాటేలా కనిపించింది. అయితే రిషబ్ పంత్(15), రఘువంశీ(11) నిరాశపరిచారు. మార్క్‌రమ్(25 బంతుల్లో 31నాటౌట్), హిమ్మత్ సింగ్(31 బంతుల్లో 40నాటౌట్) స్లాగ్ ఓవర్లలో ధాటిగా ఆడడంతో లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 228 రన్స్ సాధించింది.

## రన్నరప్‌గా మానస్ ధమ్నే

**కజకిస్తాన్:** భారత యువ టెన్నిస్ సంచలనం మానస్ ధమ్నేకు తొలి ఏటీపీ ఛాలెంజర్ సింగిల్స్ టైటిల్ తృటిలో చేజారింది. కజకిస్తాన్‌లోని షిమ్కెంట్‌లో జరిగిన హోరాహోరీ ఫైనల్లో బెల్జియంకు చెందిన బవైసర్ చేతిలో మానస్ ఓటమి పాలయ్యాడు. రెండు గంటల పాటు సాగిన ఈ తుది పోరులో 18 ఏళ్ల మానస్ గట్టి పోటీ ఇచ్చినప్పటికీ 6-7, 4-6 స్కోరుతో పరాజయం పాలై రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. సోమవారం విడుదల కానున్న నూతన ర్యాంకింగ్స్‌లో ఈ యువ ఆటగాడు మానస్ తొలిసారిగా టాప్-400లోకి ప్రవేశించనున్నాడు.



## సిన్నర్ ఖాతాలో ఐదో మాస్టర్స్ టైటిల్



**మాడ్రిడ్:** మాడ్రిడ్ క్లపెనర్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో ప్రపంచ నెంబర్ వన్ యానిక్ సిన్నర్ టైటిల్ సాధించాడు. ఈ విజయం ద్వారా పురుషులటెన్నిస్‌లో అద్భుతం చేశాడు. గతంలో ఎవరికీ సాధ్యంకాని ఘనత అందుకున్నాడు. గ్రాండ్‌స్లామ్ తర్వాత అగ్రశ్రేణి టోర్నీలుగా పరిగణించే మాస్టర్స్ సిరీస్‌లో సిన్నర్ వరుసగా ఐదో టైటిల్ గెలుపొందాడు.

మాడ్రిడ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో సిన్నర్... మూడో సీడ్ జర్మనీ ప్లేయర్ జ్వెరెవ్‌పై 6-1, 6-2తో అలవోకగా విజయం సాధించాడు. తొలి సెట్‌లో జ్వెరెవ్ సర్వీసులను పలుసార్లు బ్రేక్ చేసి 6-1తో నెగ్గిన సిన్నర్... రెండో సెట్‌లోనూ కూడా ఎదురులేకుండా కొనసాగాడు. సిన్నర్ ఏస్‌లు, బలమైన స్మాష్‌ల ముందు జ్వెరెవ్ నిలవలేకపోయాడు. ఈ టైటిల్ ద్వారా 36 ఏళ్ల చరిత్ర కలిగిన మాస్టర్స్ సిరీస్ టోర్నీల్లో వరుసగా ఐదు టైటిల్స్ గెలిచిన తొలి ప్లేయర్‌గా కొత్త రికార్డు నెలకొల్పాడు. గతంలో మూడుసార్లు జొకోవిచ్ (సెర్బియా), రాఫెల్ నాదల్ (స్పెయిన్) ఒకసారి వరుసగా నాలుగు మాస్టర్స్ సిరీస్ టైటిల్స్ సాధించారు. గత ఏడాది పారిస్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టైటిల్ గెలిచిన సిన్నర్... ఈ ఏడాది మోంటెకార్లో, మయామి, ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో విజేతగా నిలిచాడు. చాంపియన్ సిన్నర్‌కు 11 కోట్ల 21 లక్షల ప్రైజ్‌మనీతోపాటు వెయ్యి ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

# ఈక్విటీ మార్కెట్లకు ఎన్నికల జోష్

**ముంబయి, మే 4:** ఐదురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ఈక్విటీ మార్కెట్లకు జోష్ లభించింది. వీటికితోడు ఆటోసేల్స్ డేటా, బెంగాల్ ఎన్నికలు, నాలుగోత్రైమాసిక కార్పొరేట్ ఫలితాలు మార్కెట్లకు ఊతం ఇచ్చాయి. నిఫ్టీ సూచీ 24,300 మార్కును ప్రారంభంలోనే నమోదు చేసింది. చివరిలో 24,100వద్ద ముగిచింది. మెటల్, హెల్త్‌కేర్ స్టాక్స్ మద్దతుపలికాయి. ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కూడా సానుకూలంగా కనిపించింది. అమెరికా ప్రాజెక్టు ఫ్రీ పేరుతోహర్ముజ్ కార్యాచరణ ఇన్వెస్టర్లలో కదలిక తెచ్చింది. బ్రెంట్ ముడిచమురు ధరలు డాలరుతో రూపాయి మారకం విలువలు కూడా కట్టడికావడం కొంత కలిసొచ్చింది. బిఎస్ఇ సెన్సెక్స్ 355.90పాయింట్లు పెరిగి 77,269.40 పాయింట్ల వద్ద ట్రేడింగ్ ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 121.75 పాయింట్లు పెరిగి 24,119.30పాయింట్ల వద్ద ట్రేడింగ్ నిలిపింది. రిలయన్స్ 2.24శాతం, ఎల్అండ్‌టి 2.18 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.87శాతం చొప్పున పెరిగి సూచీలకు మద్దతిచ్చాయి.

బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.62శాతం, స్మాల్ క్యాప్ సూచీ 1.07శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 2470 షేర్లుపెరిగితే 1778షేర్లు క్షీణించాయి. 245కంపెనీలు మాత్రం

## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




స్థిరంగా కొనసాగాయి. పదేళ్ల బెంచ్‌మార్కు బాండ్లు 0.09క్షీణించి 7.012 శాతంతో నడిచాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి 95.24 వద్ద కదలాడింది. అంతకు ముందురోజు 94.84వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదు సెటిల్‌మెంట్లు 1.09శాతం క్షీణించి రూ.1,49,709కి చేరింది. ఇక కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడి చమురు జులై సెటిల్‌మెంట్లు 5.36 డాలర్లుపెరిగి బ్యారెల్ ఒక్కింటికి 113.53 డాలర్లుగా కొనసాగింది. ఆటో సేల్స్ విజృంభించడంతో షేర్లుకూడా గణనీయంగా పెరిగాయి. కొన్ని కంపెనీలు క్షీణించాయి. హీరో మోటోకార్ప్ 0.66శాతం క్షీణిస్తే టాటామోటార్స్ 0.73శాతంపెరిగింది. ఐషర్‌మోటార్స్ 3.08శాతం ,మహీంద్ర0.24శాతం, మారుతిసుజుకి ఇండియా 2.02 శాతం, అశోక్ లేల్యాండ్ 0.86 శాతం, టివిఎస్ మోటార్ కంపెనీ 0.26శాతం, బజాజ్ ఆటో 1.44శాతం, విఎస్‌టి టిల్లర్లు ట్రాక్టర్లు 0.02శాతం చొప్పున పెరిగాయి. అతుల్ ఆటో 1శాతం పెరిగింది. అమ్మకాల్లో 73.97శాతం నమోదుకావడమే ఇందుకు కీలకం. ఎస్కార్ట్స్ కుబోటా మాత్రం 0.81శాతం క్షీణించింది. స్టీల్ స్ట్రిప్స్ వీల్స్ 2.02శాతం పెరిగింది. ఎస్ఎంఎల్ మహీంద్ర 1.02శాతం క్షీణించడం గమార్హం. ఇక కోటక్ బ్యాంకు 2.82శాతం క్షీణించింది. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ 6.97శాతం పెరిగింది. కంపెనీ నికరలాభాలు 1290.47 కోట్లకు పెరగడమే ఇందుకు కీలకం. వాలార్ ఎస్టేట్ 19.98శాతం పెరిగింది. అవన్యూసూపర్‌మార్ట్స్ 4.72శాతం క్షీణించింది. ఈక్విటాస్ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు 6.15వాతంపెరిగితే ఆదాని పోర్టులుసెజ్‌లు 5.30శాతం, గోద్రెజ్‌ప్రాపర్టీస్ 3.54శాతం, ఎన్ఎండిసి 1.41శాతం, ఎపిల్ అపోలో ట్యూబ్స్ మైనస్ 1.59శాతం చొప్పున నమోదు కాగా ఇండస్ టవర్స్‌కూడా 2.43శాతం, సెంట్రల్ డిపా జిటరీ సర్వీసెస్ 2.36శాతం చొప్పున క్షీణించాయి.

## ఆదిత్యబిర్లా కేపిటల్ నికరలాభం 1129 కోట్లు

**ముంబయి, మే 4:** ఆదిత్యబిర్లా కేపిటల్ సోమవారం నికర లాభాల్లో 31శాతం వృద్ధిని ప్రకటించింది. వడ్డీ ఆదాయం గణనీయంగా పెరగడంతో 31శాతం పెరిగి రూ.1129 కోట్లకు చేరింది. ఆర్థికసేవల కంపెనీ మొత్తం కార్యకలాపాలద్వారా జనవరి మార్చి త్రైమాసికంలో గత ఏడాది రూ.865 కోట్లుమాత్రమే ఆర్జించింది. నికరవడ్డీ ఆదాయం రూ.5516 కోట్లుగా ఉంది. గత ఏడాది ఇదేకాలంలో రూ.4481 కోట్లు మాత్రమే రాబట్టు కోగలిగిన కంపెనీ ఈసారి గణనీయంగా పెంచు కోగలిగింది. మొత్తం రాబడులు 12,214 కోట్లనుంచి 13వేల 549 కోట్లకు పెరిగింది. ఇక పూర్తి సంవత్సరానికిగాను ఆదిత్య బిర్లా కేపిటల్ 3764 కోట్లు లాభం సాధించింది. గత ఏడాది 3332 కోట్లనుంచి 13శాతంపెంచుకోగలిగింది. మొత్తం రాబడులు సంవత్సరంలో రూ.45,509 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది రూ.40,590 కోట్ల నుంచి గణనీయంగాపెంచుకుంది. ఆర్థికఫలితాలు గణనీయంగా మెరుగుపడటంతో ఆదిత్యబిర్లా కేపిటల్ షేర్లు 348.10 రూపాయలుగా ట్రేడ్ అయ్యాయి. నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ హోదాలో ఎబిసి పలు రంగాల్లో విస్తరించింది. ఎస్ఎంఇ, రిటైల్ రుణాల్లో భారీ వృద్ధిని నమోదుచేసుకుంది.

## 41శాతం పెరిగిన జిందాల్ స్టెయిన్‌లెస్ లాభం

**ముంబయి, మే 4:** జిందాల్ స్టెయిన్‌లెస్ సోమవారం ప్రకటించిన ఆర్థిక ఫలితాల్లో 41 శాతం వృద్ధిని నమోదు చేసింది. నాలుగో త్రైమాసికంలో రూ.834.21 కోట్లు లాభం ఆర్జించినట్లుప్రకటించింది. ఏడాది క్రితం 589.96 కోట్లు ఆర్జించి కంపెనీ ఈసారి గణనీయంగా లాభాన్ని పెంచుకుంది. కంపెనీ మొత్తం రాబడులురూ.11,427.91 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది ఇదేకాలంలో 10,292.27 కోట్లుమాత్రమే ఆర్జించిన కంపెనీ ఈసారి రాబడులు కూడా పెంచుకోగలిగింది. అలాగే పూర్తి సంవత్సరానికిగాను కంపెనీ నికరలాభాలు రూ.2499.72 కోట్లనుంచి రూ.3184 కోట్లుగా నమోదుచేసుకుంది. మొత్తం రాబడులు కూడా రూ.39,603.06 కోట్లనుంచి రూ.43,306.14కోట్లు తెచ్చుకోగలిగింది. ఉక్కురంగంలో అద్వితీయంగా ఎదుగుతున్న జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ ఈసారిఆర్థికఫలితాలను మెరుగుపరుచుకోవడంలో సఫలీకృతం అయింది.

## 39 పైసలు క్షీణించిన రూపాయి



**ముంబయి, మే 4:** డాలరుతో రూపాయి మారకం విలువలు ఆల్ టైమ్ కనిష్టానికి చేరుకున్నాయి. 39 పైసలు క్షీణించి సోమవారం మార్కె ట్‌లో 95.23వద్ద ట్రేడింగ్ కొనసాగింది. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, గ్లోబల్ మార్కెట్లలో అనిశ్చితి, ముడిచమురు ధరల్లో పెరుగుదల, దిగుమతుల చెల్లింపులు పెరగడంతో రూపాయి భారీగా క్షీణించింది. బ్రెంట్ ముడిచమురు బ్యారెల్‌కు 110 డాలర్లుగా పెరుగుతూ పోయింది.

భౌగోళిక ఉద్రిక్తతలతో విదేశీ నిధులు మార్కెట్ల నుంచి ఎక్కువ భాగం విత్‌డ్రా అయ్యాయి. ఇంటర్ బ్యాంకు ఫారిన్ ఎక్స్ఛేంజి మార్కెట్‌లో రూపాయి 94.95వద్ద ప్రారంభం అయింది. ట్రేడింగ్ ఆసాంతం క్షీణిస్తూనే ఉంది. చివరకు 95.23వద్ద స్థిరపడి 39పైసలు క్షీణించిందని తేలింది. అంతకు ముందురోజు 94.84 వద్ద నమోదయిన సంగతి తెలిసిందే. రానున్న కాలంలో 95.35 నుంచి 95.70వరకూ కూడా వెళ్లవచ్చని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ అనలిస్టు దిలీప్ పర్మార్ తెలిపారు. ఇక దేశీయ ఈక్విటీ ఫ్రంట్‌పరంగా సెన్సెక్స్ 355.90 పాయింట్లుపెరిగితే నిఫ్టీ కూడా 121.75 పాయింట్లుపెరిగింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈక్విటీ మార్కెట్లనుంచి రూ.8047.86 కోట్లు విత్‌డ్రాచేసారు. దీనితో పెట్టుబడులు విత్‌డ్రాతో డాలర్ చెల్లింపులు పెరగడం, ముడిచమురుధరలకు కూడా చెల్లింపులు డాలర్లతోనే జరుగుతుండటంతో డాలర్‌కు డిమాండ్ విపరీతంగా పెరిగి చెలామణిలో రూపాయి క్షీణించింది.

## టాటా టెక్నాలజీస్ రాబడులు రూ.1572.22 కోట్లు

**ముంబయి, మే 4:** టాటాగ్రూప్‌లోని టాటా టెక్నాలజీస్ సంస్థ నికరలాభాలు 8శాతం పెరిగాయి. నాలుగోత్రైమాసికంలో రూ.204.17 కోట్లు సాధించింది. అంతకుముందు ఏడాది ఇదేకాలంలో రూ.188.87 కోట్లు ఆర్జించిన కంపెనీ ఈసారి మరింతగాపెరిగింది. రాబడులు కూడా 1285.65 కోట్లనుంచి రూ.1572.22 కోట్లు ఆర్జించింది. మొత్తం వ్యయాలు నాలుగోత్రైమాసికంలో రూ.1088.2కోట్లనుంచి రూ.13,82.62 కోట్లు ఆర్జించింది. పూర్తి సంవత్సరంలో ఆదాయం రూ.5168.45కోట్లనుంచి 5505.57 కోట్లకు పెంచు కోగలిగింది. మూడో త్రైమాసికం నుంచి నాలుగో త్రైమాసికంలో కంపెనీ మంచి ఫలితాలను రాబట్టిందని ఎండి సిఇఒ వారెన్ హ్యారిస్ అన్నారు. 2027సంవత్సరంలోకూడా రెండంకెల వృద్ధితో ముందుకువెళతామన్నారు. కంపెనీ బోర్డు తుదివిడత డివిడెండ్ ప్రతి వాటాకు రూ.8.35 ప్రకటించింది. ప్రత్యేక డివిడెండ్‌రూపంలో ఈక్విటీ వాటాకు రూ.3.35 చొప2న ప్రకటించింది.




## ఉత్పత్తిరంగ పిఎంఐ సూచీ స్వల్పంగా రికవరీ

**ముంబయి, మే 4:** భారత్ ఉత్పత్తిరంగ కార్యకలాపాలు ఏప్రిల్‌లో స్వల్పంగా రికవరీ అయ్యాయి. కొత్త ఆర్డర్లు వచ్చినపడుతున్నప్పటికీ నాలుగేళ్ల కనిష్ఠస్థాయిలోనే ఉన్నాయి. ఎచ్ఎస్‌బిసి భారత్ ఉత్పత్తిరంగ పిఎంఐ సూచీ 53.9 పాయింట్లనుంచి 54.7 పాయింట్లకు పెరిగింది. గడచిన నాలుగేళ్లలో చూస్తే రెండోసారి స్వల్పస్థాయిలో వృద్ధిని నమోదుచేసింది. 50 పాయింట్లకు పైబడితే వృద్ధితగ్గితే తిరోగమనంగా పిఎంఐ సూచీలు పరిగణిస్తారు.

అంతకుముందు నెలతో పెరిగినప్పటికీ ఏప్రిల్ వృద్ధి మాత్రం స్వల్పస్థాయి లోనే ఉన్నదని హెచ్ఎస్‌బిసి భారత్ చీఫ్ ఎకానమిస్ట్ ప్రాంజుల్ భండారి అన్నారు. మార్చి నెలతో పోలిస్తే కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి కొంత ఊతం ఇచ్చాయని ఆయన అన్నారు. అయితే సూచీలు మాత్రం మూడున్నరేళ్లతో పోలిస్తే తక్కువ స్థాయిలోనే ఉన్నాయి. మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలు కొంత ప్రభావితం చేసినట్లు తెలిపారు.

క్లయింట్లనుంచి గ్రీన్‌సిగ్నల్ రావడం కూడా లేట్ అయింది. ఉత్పత్తి వ్యయాలు 2022 ఆగస్టు నుంచి కూడా గణనీయంగాపెరిగాయి. ఇక ఉత్పత్తి రేట్లు కూడా గడచిన ఆరునెలలతో పోలిస్తే ఆశాజనకంగానే పెరిగినట్లు భండారి పేర్కొన్నారు. అయితే ఈ వృద్ధి స్వల్పస్థాయిలోనే



ఉందని అందువల్ల భారత ఉత్పత్తిరంగానికి వచ్చిన భారీ ముప్పు ఏమీలేదన్నారు. కొత్త ఎగుమతి ఆర్డర్లపరంగా చూస్తే ఏడునెలల గరిష్టంగా ఉన్నాయి ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జపాన్, కెన్యా, ఛైనామెయిన్‌లాండ్, సౌదీ అరేబియా, యుఎఇ, యుకెలనుంచి ఆర్డర్లు చెప్పుకోదగిన స్థాయిలోనే ఉన్నాయి. ఇక వ్యయం పరంగా చూస్తే కంపెనీలు అల్యూమినియం, రసాయనాలు, విద్యుత్ విడిభాగాలు, ఇంధనం, తోళ్లు, పెట్రోలియం ఉత్పత్తులు, రబ్బర్ వంటి వాటిలో ధరలు పెరిగాయన్నారు.

44 నెలల్లో ఎన్నడూలేనంతగా ముడివనరుల వ్యయం పెరిగిందని హెచ్ఎస్‌బిసి భారత్ చీఫ్ ఎకానమిస్ట్ ప్రాంజుల్ అన్నారు. 400 ఉత్పత్తి రంగ సంస్థలను విశ్లేషించిన అనంతరం వాటిని క్రోడీకరించి పిఎంఐ సూచీ తయారుచేస్తుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-40/1, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036; Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.